
ఆంధ్రపత్రిక



25 నయాపైసలు

ANDHRA PATRIKA



శ్రమ జీవులు

ఫొటో: ఎమ్. శ్రీనివాసన్.


పుష్పమువలె...
రెక్సోనాతో మీ చర్మ
సౌందర్యము వికసించును!
* రెక్సోనా సబ్బులో, కేడిల్...
చర్మమును పోషించునటువంటియు
మీ సహజ సౌందర్యమును బయ
ల్పరచుటకు సహకరించునటు
వంటియు ఒక ప్రత్యేక నూనెల
మిశ్రమము, గలదు।
Rexona
BLENDED WITH CADYL
ఇది ఒక్కటే కేడిల్‌తో గూడిన టాయిలెట్ సబ్బు
రెక్సోనా ప్రొప్రయిటరీ లిమిటెడ్ తరపున భారతదేశంలో తయారుచేయబడినది
R.P. 150-X52 TL

సంవత్సర చందా
రు. 18—0—0
విడిపత్రిక 25 న.పై

ఆంధ్రపత్రిక
సచిత్రవారపత్రిక

సంపుటము 52
సంచిక 7
9-10-57

Founder: K. NAGESWARA RAO

హేవిళంబి ఆశ్వయుజం, బహుళ పాడ్యమి బుధవారం

★ విషయానుక్రమణిక ★

ముఖచిత్రం:
అనితా గుహ

★


మీరు
స్వీకరించడానికి
సమ్మతించే
బహుమతినే...
ఇతరులకు
ఇవ్వండి.

డన్‌లపిల్లో




దిండ్లు

రెండు సైజులలో
కలవు. పిల్లలకు
పెద్దవారికి
సరిపోయేవి
అడుగున రక్షణకై
అండర్ కవర్లు
కూడా కలవు.




గుండ్రని,
అటు, ఇటూ వాడుకునే
కుషన్

వీపుకు ఆనుడుకింద
కుర్చీమీదకూడా
వేసుకోవచ్చు.




చదరంగా వుండే
అటు, ఇటు వాడుకునే
కుషన్

పడకటింటికి,
స్టడీ, డ్రాయింగ్
రూమ్‌లకు, ఇతర
గదులకు
ఉపయోగకరమైనవి.




కుర్చీ కుషన్‌లు

మూడు సైజులలో కలవు.
పని చేసుకునేటప్పుడు
విశ్రాంతి పొందేటప్పుడు
వాడుకోవచ్చు.



బోల్‌స్టర్

మీ పందిరి
మంచానికి రంగులతో
శోభ చేకూర్చడానికి,
వెసులుబాటుకు




ఆకర్షణీయమైన
బహుమతి

అతి కొత్తరకం
బహుమతికి,
చేతికి
అమిరే జిప్పర్ బ్యాగ్,
డన్‌లపిల్లో పడక,
దిండు కలిసివున్న
డన్‌లపిల్లో
ట్రావెలింగ్ కిట్
ఇవ్వండి.



DPC-87

ది డన్‌లప్ రబ్బర్ కం. (ఇండియా) లి.



న్యూఢిల్లీ లేఖ

ప్రజాస్వామ్యం పేర అవకతవకలు

శ్రీ కృష్ణ
[ఆంధ్రపత్రిక ప్రతినిధి]

ప్రజాస్వామ్యమంటే కేవలం సిద్ధాంతం కాదు; ఒకానొక జీవిత విధానం. సిద్ధాంతాలను పైనుంచి దిగుమతి చేసుకోవచ్చుగాని, ఒక జీవితవిధానాన్ని దిగుమతి చేసుకోవడం అసంభవం. అది దేశంలో పుట్టి పెరగవలసినదే. నియంతృత్వంకంటే ప్రజాస్వామ్యం ఆచరణలో పెట్టడం చాలా కష్టసాధ్యమైనది. నియంతృత్వంలో వ్యక్తికి బాధ్యత బాధలేదు; ఏం చెయ్యాలో, ఏం చెయ్యకూడదో చెప్పేవాడొకడుంటాడు. కాని ప్రజాస్వామ్యంలో వ్యక్తి తనకర్తవ్యం తనే నిర్ణయించుకోవాలి; తన దేశానికి, తన రాష్ట్రానికి, నగరానికి, ఆఖరికి తన పేటకి ఏది శ్రేయస్కరం, ఏదికాదు అనేది తనే నిర్ణయించుకోవాలి. పౌరులలో ఆత్మసంయమనం ఉన్ననాడే ప్రజాస్వామ్యం విజయంపొందుతుంది. స్వాతంత్ర్యం వచ్చి పదేళ్ళయిన తర్వాత, ఇప్పుడు దేశంలో ప్రజాస్వామ్యం పేరిట జరుగుతున్న అవకతవకలు చూసి ప్రధానమంత్రి ఇటీవల ఎంతో ఖేదం వెల్లడించారు.

మొదట్లో 'సి' తరగతి రాష్ట్రంగా ఢిల్లీకి ప్రజాస్వామ్యం అంటగట్టారు. 1956 లో ఢిల్లీ ప్రభుత్వపు కేటాయింపు పద్దులు, ఆడిట్ నివేదిక ఈ మధ్య విడుదల చేయబడినవి. మొత్తం రు. 6,61,64,000 గ్రాంటులో రూ. 1,28,04.245 ధనం, అంటే దాదాపు నూటికి 20 వంతుల ధనం ఖర్చుకాకుండా మిగిలిపోయిందని ఆడిట్ నివేదిక తెలుపుతోంది.

ఒకొక్క పద్దు క్రింద కేటాయించిన ధనానికీ, యథార్థంగా ఖర్చయిన ధనానికీ పొంతన ఉండేట్లు చూడడంకోసమే, సాధారణంగా వ్యయంపై అజ్మాయిషీ ఏర్పాటు చేస్తూ ఉంటారు. కాని ఈ అజ్మాయిషీ లోపభూయిష్ఠంగా ఉందని నివేదికలో వెల్లడయింది.

1948 లో ఒక అధికారి తనపై అధికారుల అనుమతి లేకుండా ఇంపీరియల్ (ఇప్పుడు స్టేట్) బ్యాంక్‌లో ప్రభుత్వపు అక్కౌంటునగాక విడిగా కొన్ని కరెంట్ అక్కౌంటులను ప్రారంభించాడని ఆడిట్ నివేదిక బయటపెట్టింది. ఇంకా ఆ నివేదిక ఈ క్రింది విషయాలు బయటపెటింది:—

బడ్జెట్ గ్రాంటు వృథాగా రద్దయిపోతుందేమోనని, 1953-54 ఆర్థిక సం॥ అంతంలో లక్షన్నర రూ॥లను ఖజానానుంచి తీసుకుని ఏవో సరుకులు కొనడానికని కరెంట్ అకౌంట్లలో వేయడం జరిగింది. కాని ఆ సరుకులలో ఎక్కువ భాగం 1954-55 సం॥ లో కొనడం జరిగింది.

రివిన్యూ రాబడులను, ఋణపరిష్కారానికిగాను కేంద్రం ఇచ్చిన గ్రాంట్లను, ఋణపరిష్కారంగా ఇతరులు ఇచ్చిన పైకమూ రూల్సు ప్రకారం ఖజానాలో కట్టకుండా కరెంట్ అకౌంట్లలో డిపాజిట్ చేయడం జరిగింది.

కరెంట్ అకౌంట్లలోని నిల్వలను ఆర్థిక సంవత్సరాంతంలో రూల్సుప్రకారం ప్రభుత్వానికి జమకట్టవలసి ఉన్నప్పటికీ అలా కట్టకుండా మరుసటి సంవత్సరంకూడా కరెంట్ అకౌంట్లలోనే ఉంచడం జరిగింది.

ఆడిట్‌శాఖ సలహా ప్రకారం 1953 జూనులో ప్రభుత్వము ఈ కరెంట్ అకౌంట్లను రద్దుచేయవలసిందిగా ఉత్తర్వులిచ్చింది. కాని ఆ అక్కౌంట్లు మూసివేస్తే లెక్కలపని ఇంకా ఎక్కువ అవుతుందనీ, దానికి వేరే కొత్త సిబ్బంది అవసరమవుతుందనీ చెప్పి 1956 ఆగస్టు నాటికికూడా అలాగే కరెంట్ అకౌంట్లను కొనసాగిస్తూ వచ్చారు. ఇది రాజ్యాంగంలోని 284 వ నిబంధనకు విరుద్ధం.

శరణార్థులకోసం కట్టించిన ఇళ్ళను, షాపులను ఆయా వ్యక్తులకు కేటాయించే భారం కేంద్ర ప్రభుత్వం రాష్ట్రప్రభుత్వానికి అప్పగించింది. అద్దెలు వసూలు చేయడానికి, స్థలాలు కొనుక్కున్నవారికి గృహనిర్మాణసామగ్రి ఇవ్వడానికి, నిరాశ్రయులకు ధనసహాయం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఒక సంఘాన్ని నియమించింది. 1953 లోను, 1955 లోను ఈ సంఘం చేసినపని పరమలోపభూయిష్ఠంగా ఉన్నట్లు ఆడిట్ లో తేలింది. ఉదాహరణకు:

డబ్బు ముట్టినట్లు రసీదులు జారీచేసినా, ఆసంగతి క్యాష్ బుక్కులలో వ్రాయకుండా వదిలేశారు. బిల్లులు ఆమోదించబడనప్పటికీ పెద్దపెద్ద మొత్తాలను క్రింది అధికారులకు బజానా ఇచ్చారు.

అద్దెలు వసూలుచేసేటప్పుడు కొన్ని ఇళ్లను వదిలెయ్యడం జరిగింది. దీనివల్ల 1949-50 నుంచి ప్రతిఏటా కొన్నివేల రూ. లు ప్రభుత్వానికి నష్టం కలుగుతోంది.

నెలనెలా ముట్టిన డబ్బునుకూడి మొత్తం ఎంత వచ్చిందీ లెక్కలు వెయ్యలేదు. ముట్టిన డబ్బులెక్కను సరిగ్గా క్యాష్ బుక్కులలో వ్రాయలేదు.

1956 ఆగస్టులో బకాయిల మొత్తం రూ. 1,93,44,524. అయితే ఈ లెక్క కూడా ఖచ్చితమైన లెక్క కాదు. ఎందుకంటే, అద్దెలు వగైరాలను ఖచ్చితంగా నిర్ణయించకుండా ఉజ్జాయింపుగా సే లెక్కిస్తూ వచ్చారు.

అద్దెలు వసూలుచేసి రసీదు బుక్కులలో

రాసినడబ్బును అప్పగించకుండా ఒకఉద్యోగి పరారీ అయ్యాడు. అతనిమీద 1956 మార్చి నుంచి పోలీసు దర్యాప్తు జరుగుతూ ఉన్నది.

నిరాశ్రయులైనవారికి ధనసహాయంచేసే కార్యక్రమంక్రింద ఒక్కొక్కనికి రూ. 80 సైకమూ, సామగ్రిరూపేణాగాని, ధనరూపేణాగాని మరొక రూ. 500 సహాయమూ ఇవ్వవలసి ఉంది. 1956 జూన్ నెలాఖరువరకూ ఈ కార్యక్రమం క్రింద రూ. 43,13,154 ఖర్చింపబడింది. అయితే వీటికి సరైన లెడ్జర్ అక్కౌంట్లు లేనందున ఈ మొత్తానికి మించి ఖర్చయిందేమో తెలియదు.

నిరాశ్రయులైన శరణార్థులకు ఇవ్వాల్సిన గృహనిర్మాణ సామగ్రి సుమారు రూ. 1,80,000 ఖరీదైనది. 1951-52 సం॥ నుంచీ ఈ సామగ్రి ఊరికే పడిఉంటోంది. ఇప్పుడీ సామగ్రి అంతా సరిగ్గా ఉందీ లేనిదీ ఎవరికీ తెలియదు.

1954 అక్టోబరు తర్వాతకూడా రాష్ట్ర ప్రభుత్వమే నీటి పన్నును మునిసిపల్ కమిటీకి చెల్లిస్తోంది. ఈ పన్నును న్యాయంగా అద్దెలకున్న వారినుంచి వసూలు చేసి మునిసిపల్ కమిటీకి చెల్లించాలి. అలా జరగలేదు. కొన్నిచోట్ల జరిగినా వాటికి అక్కౌంట్లు లేవు.

అయీ విషయాలన్నీ 1953 జూలైలో రాష్ట్రప్రభుత్వం దృష్టికి తేబడినవి. కాని ఎవరూ ఏచర్యా తీసుకోలేదు.

పశ్చిమ పాకిస్తాన్ పట్టణాలనుంచి పారిపోయి వచ్చిన చిన్న వర్తకులకు, చేతిపనులవారికీ, ఇతర వృత్తులవారికీ పునరావాసం కల్పించేందుకు 1947 లో భారతప్రభుత్వం ఋణసహాయ కార్యక్రమం నిర్ణయించింది. రూ. 500 కంటె ఎక్కువ ఋణాలు



శ్రీ కే. నారాయణరావు

అంతర్జాతీయ రాజ్యాంగ, న్యాయశాస్త్రాలను అభిమాన విషయాలుగా తీసుకుని మొన్న జూలైనెలలో జరిగిన మద్రాసు విశ్వవిద్యాలయ ఎం. ఎల్. పరీక్షలో ప్రథమశ్రేణిలోవీరు ఉత్తీర్ణులైనారు. న్యాయశాస్త్రానికి చెందిన ఈ విభాగంలో ఇంతకుముందు ఎవరూ ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణులు కాలేదు. శ్రీ నారాయణరావు స్వగ్రామం శ్రీకాకుళంజిల్లా వంతనర్సీపురం. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఎం. ఏ. (ఆనర్సు), బి. ఎల్. డిగ్రీలు ఇదివరకు తీసుకున్నారు.

ఇవ్వరాదని మొదట్లో నిర్ణయించినా తరవాత రూ. 5000 వరకూ ఇవ్వవచ్చునని నిర్ణయించారు. ఈఋణంపై మొదటి ఏడాది వడ్డీ ఉండదు. వడ్డీతోసహా మూడేళ్ల తరవాతనుంచీ మూడేళ్లలోగా వసూలుచేస్తారు.

1955 సెప్టెంబరువరకూ రాష్ట్రప్రభుత్వం ఇచ్చిన అప్పులు రూ 21,25,045. ఆనాటివరకూ వడ్డీ లేకుండా బకాయిల మొత్తం రూ. 7,96,220. ఇంత వసూలు కావలసి ఉండగా 1 ఏప్రిల్ 1955 నుంచి 30 సెప్టెంబర్ 1955 వరకూ వసూలైనది రూ. 1,020 మాత్రమే. అసలు వసూలైన మొత్తాలకు సరిగ్గా అక్కౌంట్లులేవు. బకాయిలు చెల్లించవలసిందని బాకీదార్లకు నోటీసులు జారీ చెయ్యనూలేదు. ఋణాలు జారీ చేసే అధికారులు తామిచ్చే ఋణాలు సక్రమంగా వినియోగింపబడుతున్నవో లేదో పరిశీలించనూలేదు. బకాయిలను భూమిశిస్తుగా వసూలుచేసే ప్రయత్నం, సరైన చట్ట అధికారం లేనందున విఫలమైందని అధికారులు తెలియజేశారు.

రాష్ట్రపరిపాలనకు రూ 26,10,156 ఖర్చయింది.

మహాత్మాగాంధీ నాయకత్వాన వ్యవహరించిన కాంగ్రెసు భారతదేశం చాలా బీద దేశమని వర్ణిస్తూఉండేది. బీద భారతదేశం బ్రిటిష్ మార్కు ప్రజాస్వామ్యాన్ని భరించలేదు.

మొదటి రోజుల్లో ఢిల్లీ మంత్రివర్గంలో ఒక ముఖ్యమంత్రీ, ఇద్దరుమంత్రులూ మాత్రం ఉండేవారు. ముఖ్యమంత్రి ఢిల్లీ పరిసరాలకు సంబంధించిన వ్యక్తి. ఒక మంత్రి జమియా మిలియా ఇస్లామియాతోపాటు ఉత్తరప్రదేశ్ నుంచి ఢిల్లీకి వలసవచ్చిన వ్యక్తి. మరొకమంత్రిపదవిలో ఉన్న ఆవిడ లేడీహార్డింజ్ కళాశాలలో చదివినావిడ. అదే ఆవిడకు ఢిల్లీతో ఉన్న సంబంధమల్లా. దీన్నిబట్టి కాంగ్రెసుకు ఢిల్లీనగరంతో ఉన్న సంబంధం ఏపాటిదో తెలుస్తుంది. ఒక

(56-వ పేజీ చూడండి)

అమెరికన్ మహిళ ఆదర్శ సేవ

"నేటి శిశువులమీదనే రేపటి ప్రపంచం ఆధారపడి ఉందనేది మామూలుగా అందరూ అనేమాటే. అందరూ మామూలుగా అనేసినంతమాత్రాన అది మామూలు మాటైపోదు," అని అమెరికన్ మహిళ హెలెన్ కా పాంటల్యాని అంటుంది ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యాన ఉన్న ప్రపంచ శిశుసహాయనిధి (UNICEF) తాలూకు అమెరికన్ సంఘానికి ఈమె ముఖ్యాధికారిణి. ప్రపంచానికి అన్నిటికంటె ముఖ్యమైనది ఈ శిశు సహాయనిధి అని ఆమె తరుచు అంటూ ఉంటుంది.

"ఈనిధి తరఫున నేను ఎన్నిమైళ్ళు ప్రయాణం చేశానో, ఎందరితో మాట్లాడానో, ఎన్ని ఉత్తరాలు రాశానో లెక్కలేదు," అని ఆమె ఎంతో ఉత్సాహంతో చెబుతూ ఉంటుంది.

శిశుసహాయనిధి అమెరికన్ సంఘంలో 60 మందిదాకా స్త్రీ పురుషులు ఉన్నారు. వీరందరూ ఉద్యోగరీత్యా ఆ సంఘంలో పనిచేయడం లేదు. స్వచ్ఛందంగా ఆ శిశునిధికి సహాయపడాలనే ఉన్నతాశయంతోనే పనిచేస్తున్నారు. వీరికి ముఖ్యాధికారిణియైన హెలెన్ కా పాంటల్యాని కూడా స్వచ్ఛందసేవికయే. అయినా ఆమెకు ఎప్పుడూ చేతినిండా పని ఉంటుంది. ఈ సంఘంలో జీతాలమీద పనిచేసే ఉద్యోగులు కూడా కొద్దిమంది ఉన్నారు. వీరి కార్యాలయం సమితిభవనంలోనే ఉంది.

శిశుసహాయనిధికి వచ్చే డిసెంబరులో 11 వ వార్షికోత్సవం జరుగుతుంది. వివిధదేశ ప్రభుత్వాలద్వారా ఆహార, ఆరోగ్య సదుపాయాలు చేస్తూ ఈ సహాయనిధి ప్రపంచమంతటా అనేకలక్షలమంది శిశువులకు

ప్రపంచ శిశు సహాయ నిధి



అప్పుడే ప్రసవించిన బిడ్డను స్నానం చేయిస్తున్న ఒక స్త్రీ. మంత్రసానులను తరిఫీదు చెయ్యడం సమితి శిశు సహాయనిధి నిర్వహిస్తున్న అనేక మాతా శిశు ఆరోగ్య, సంక్షేమ కార్యక్రమాల్లో ఒకటి.

తోడ్పడింది. 1955 లోనే 105 దేశాలలో 881 సహాయ కార్యక్రమాలద్వారా శిశునిధి వారు 4½ కోట్ల శిశువులకు, వారి తల్లులకు సహాయం చేశారు.

"మాతా శిశు సంక్షేమకేంద్రాలకు ముందు ముందు చాలా ప్రాధాన్య ముంటుం దని నాకు అనిపిస్తోంది. ఎందుకంటే ఈ కేంద్రాలద్వారా స్థానికంగా పనిచేసే నర్సు లను, మంత్రసానులను తరిఫీదు చేయ వచ్చును. అనుభవంలేని తల్లులకు శిశుసం రక్షణ పద్ధతులను బోధించవచ్చును." అని మిసెస్ పాంటల్యూని అంటారు.

ఈమె విశ్వరాజ్యసమితి స్థాపింపబడిన నాటినుండి సమితి విషయాలపట్ల ఆసక్తి కన బరుస్తూ వచ్చింది. సమితి కార్యక్రమాలకు తోడ్పడే అనేక స్వచ్ఛంద సంఘాలలో పనిచేసింది. 1949 లో శిశు సహాయనిధి తాలూకు అమెరికన్ సంఘానికి సభ్యురా లుగా ఎన్నికైంది. 1953 నుంచీ ఈమె ఈ సంఘానికి ముఖ్యాధికారిణిగా ఉంది. అమె రికన్ సంఘం మాస్తరుగానే వివిధ దేశా లలో 17 జాతీయసంఘాలు పనిచేస్తు న్నాయి. ఇవన్నీ ప్రత్యేకంగా శిశు సహాయ

(47-వ పేజీ చూడండి)



విశ్వరాజ్యసమితి ప్రపంచ శిశు సహాయనిధి తాలూకు అమెరికన్ సంఘానికి ముఖ్యాధి కారిణి మిసెస్ హెలెన్‌కా పాంటల్యూని.



ఇవి గ్రీటింగ్ కార్డులు. ప్రముఖ చిత్రకారులు ఈ కార్డులమీది బొమ్మలను చిత్రించి బహూకరించారు. ఇలాంటి పదిరకాల కార్డు లను శిశు సహాయనిధివారు ఈ ఏడాది 65 దేశాలలో అమ్ముతారు. వీటివల్ల వచ్చే రాబడిని శిశు నిధికే ఉపయోగిస్తారు. పైనుంచి ఒక టవ చిత్రం: ప్రాచ్యదేశాల బాలుకు వ్రాయడం నేర్చుకుంటున్నారు (వియట్‌నాం చిత్రకారుడు: మయ్‌తూ). రెండవది: దక్షిణ అమెరికన్ వీధి గాయకులు (అమెరికన్ చిత్రకారుడు: లడ్విగ్ బిమల్‌మాన్స్). మధ్యది: మాత, శిశువు (అమెరికన్ చిత్రకారుడు: గ్లాడిస్ ఆర్. డేవిస్). క్రిందినుంచి ఒకటవది: మంచుతో కప్పబడిన చర్చిముందు అమెరికన్ పిల్లలు గానం చేస్తున్నారు. రెండవది: స్విట్జర్లండ్ ప్రాంతంలో గొర్రెపిల్లవాడు

నక్షత్ర ఫలితాలు

(9-10-57 మొదలు 15-10-57 వరకు)

ఈ వారము గ్రహస్థితి.

	కే		
	మీన, మేష, వృషభ, మిథునములలో చంద్రుడు.		
	శు శ	రా	ర కు బు గు

[10-10-57 రాత్రి 9 గం|| మొదలు 11-10-57 రాత్రి 10 గం|| వరకు శని వేధ హేతు క్రాంతము; 13-న బుధాస్తమయము].

అశ్విని [చూ, చే, చో, లా]

ఈ వారము కార్యభారము ఎక్కువగుట చేత శరీరమునకు ఉష్ణాధిక్యమువల్ల బాధ కలుగును. పండితగోష్ఠి, పుస్తకపఠనవల్ల కొంత మనశ్శాంతి గలుగును. మీకు ఓర్పు ఎక్కువగా వుండుటవల్ల కష్టములను భరించగలరు. ఉద్యోగులకు కొంత మంచికాలము. సోదరవర్గమువల్ల స్వల్ప సహాయము, చురుకుమాటలవల్ల మనోవ్యథ, పిల్లలవల్ల సంతోషము కలుగును. 12, 13 తేదీలు లాభదాయకములు. వారాంతమందు ప్రయాణముకలిగే సూచన.

భరణి [లీ, లూ, లే, లో]

ఈ వారము మీకు మంచి యోగకాలము. మధ్యయందున్న మిత్రుల సహాయమువల్ల కార్యములు సానుకూలమగును. ఉద్యోగులకు అధికారుల దయ కలుగును. విద్యార్థుల చదువు చురుకుగా సాగును. గణితశాస్త్రజ్ఞులకు, కవులకు, కళాకారులకు, నటీనటులకు మేలుగా వుంటుంది. 9, 10 కార్యానుకూలత. 12, 13 తేదీలలో లాభము.

కృత్తిక [అ, ఈ, ఉ, ఏ]

ఈ వారమందు మీరు బంధుమిత్రులతో సుఖముగా గడుపుతారు. క్రొత్తవారిని కలుసుకొని వారిమూలముగా మీవిజ్ఞానాన్ని వృద్ధి చేసుకుంటారు. భాగ్యము అలంకార ప్రాప్తి. పిల్లలవల్ల సంతోషాన్ని పొందుతారు. ఉద్యోగులకు అధికారుల ఆదరణ కలుగుతుంది. విద్యార్థులకు, న్యాయవాదులకు మేలైనకాలము. పండితులకు సన్మానము కలుగుతుంది. 10, 11 తేదీలలో క్రొత్తవారిని కలుసుకొంటారు. వారాంతమందు పండితులకు సన్మానము కలుగుతుంది.

రోహిణి [ఓ, వా, వీ, వూ]

ఈవారము మీకు భాగ్యయోగించే సమయము. మిత్రులతో విందులను ఆరగించి, వినోదములను చూచి ఆనందించెదరు. వెండి సామానులను సంపాదింతురు. సంఘములో పలుకుబడి హెచ్చుతుంది. గాయకులకు కళాకారులకు, విద్యార్థులకు మంచికాలము. 9, 10 తేదీలలో వినోదము. 12, 13 తేదీలలో గౌరవము. వారాంతమందు విద్యార్థులకు యోగించును.

బి. నరసింగరావు

మృగశిర [వే, వో, కా, కీ]

ఈవారము మీకు గ్రహానుకూలత యొక్కువగుటచేత యోగదాయకముగా గడుస్తుంది. గతవారమందు మొదలుపెట్టి అసంపూర్తిగా వున్న పనులు ఈ వారమందు లాభకరముగా పూర్తిచేసుకోగలుగుతారు. స్త్రీలవలన వినోదము. తీపివస్తువులు తింటారు. కవులకూ, గాయకులకూ, కళాకారులకూ యోగకాలము. 9, 10 తేదీలలో కార్యానుకూలత. 14, 15 తేదీలలో గాయకులకూ, కళాకారులకు మేలు.

* ఆరుద్ర [కూ, ఖ, జ, ఛ] *

ఈవారము శరీరమునకు శ్రమఎక్కువ కలిగేపనులు చేయవలసివచ్చుటచేత మనస్సునకు అశాంతి కలుగుతుంది. ఆర్థికస్థితి తృప్తికరముగా వుంటుంది. ఖర్చులు ఎక్కువవుతవి. కోర్టువ్యవహారములు వాయిదాపడును. ఉద్యోగులకు ఒత్తిడిఎక్కువగును. వారాంతమందు కొంతమెరుగుగా వుంటుంది. పితృవర్గమునుండి అపేక్షించిన సహాయము సకాలమున చేకూరదు. 9, 10 తేదీలలో అశాంతి. 11 వ తేదీని ఆర్థికదుస్థితి. వారాంతమందు స్వల్పలాభము.

* పునర్వసు [కే, కో, హా, హి,] *

ఈ వారము మీకు అనుకూలముగా లేదు. సకాలములో అనుకున్న ఆర్థిక సహాయము కలుగకపోవుటచేత తలపెట్టిన కార్యములు నెరవేరక మనోవ్యథ పొందుతారు. నిందలపాలవుతారుగాని, వారాంతములో కొందరు మిత్రులు మీరు కోరకుండానే కలుగజేసుకుని, నిలిచిపోయిన కార్యములను ముగియుటకు సహాయపడెదరు. మధ్యతరగతి ఉద్యోగులకు మొదట్లో ఒత్తిడి కలిగిననూ, వారాంతమందు కొంత తృప్తి ఏర్పడుతుంది. ఆరోగ్యము గురించి శ్రద్ధ అవసరం. 9, 10 తేదీలు కార్యభంగం. 11 అనారోగ్యం; 15 న స్వల్పశాంతి.

పుష్యమి [హూ, హే, హో, డా]

ఈ వారము మీకు మిశ్రమయోగము. అనుకున్న పనులు జరగకపోయినను, ఖర్చులు ఎక్కువైనను, వేదాంతగ్రంథములను చదువుటచేత, జ్ఞానుల సాంగత్యము కలుగుటచేత మనశ్శాంతికలుగుతుంది. ఉద్యోగులకు ఏమంత మంచికాలముకాదు. కొంత ఒత్తిడి కలిగిననూ, 14, 15 తేదీలలో స్వల్పముగా స్థిమితము కలుగుతుంది. స్త్రీలతో వివాదము. వాత ప్రారంభములో కుటుంబములో

—ధరలు :—

నూనెలు, వస్త్రములు :—కొద్దిగా పెరిగే సూచన కలదు.

నూనె దినుసులు :—కొద్దిగా పెరుగుతవి.

బెల్లము, పంచదార, చింతపండు :- సమముగా వుంటవి.

ఆహారధాన్యములు, పప్పుదినుసులు :- అనుకూలముగా వుంటవి.

వెండి, బంగారము : స్వల్పముగా హెచ్చుగు సూచన.

వారమంతటా సువృష్టి.

* * *

జన్మనక్షత్రమునుబట్టిగాని, నామనక్షత్రము (వారివారి పేర్లననుసరించి పేరు మొదటి అక్షరము)ను బట్టిగాని ఫలములను చూచుకొనవలెను. కృష్ణుడను పేరునకు మృగశిరా నక్షత్రమును వృష్ణుడను పేరునకు స్వాతీనక్షత్రమును, శ్రీధరుడను పేరునకు చిత్తానక్షత్రమును, క్షేత్రపాలకుడనే పేరునకు హస్తా నక్షత్రమున్నూ, భీముడు భైరవుడనే పేర్లకు పూర్వాషాఢ నక్షత్రమునూ చూచుకోవలెను.

అనారోగ్యము కలిగే సూచన.

ఆశ్లేష [డి, డూ, డే, డో]

ఈ వారమున కార్యభారము అధికమవుతుంది. శ్రమకు తగిన ఫలితములేక అసంతృప్తి కలుగుతుంది. కోర్టుపనులలో కొంత అనుకూలత ఏర్పడినను కొంతమట్టుకు వాయిదాపడుతుంది. ఉద్యోగులకు శ్రమ, కార్యానుకూలత, క్రమేణా వారాంతమున అధికారుల మన్నన కలుగును. దుష్టస్త్రీలతో వివాదమువల్ల మనోవ్యథ కలుగుతుంది. 11 వ తేదిని వివాదము. 12, 13 తేదీలు అశాంతి.

మఖ [మా, మీ, మూ, మే]

ఈ వారము మీ శక్తినంతయు ఉపయోగించి ప్రయత్నించినను కార్యానుకూలత వుండదు. అయిననూ నిరుత్సాహపడక ప్రయత్నించుతూనే వుంటారు. అదే మంచిదిన్నీ, క్రమ క్రమముగా కష్టములను తగ్గించేదిన్నీ అవుతుంది. పెద్దల సాంగత్యమువల్ల కొంత ఊరటపొందుతారు. భార్యాబిడ్డల ఆరోగ్యము మిమ్ములను కలవరపరుస్తుంది. వారాంతమందు మిత్రుల సహాయమువల్ల కొంత ఉపశమనము కలుగుతుంది. 11 వ తేదీ ఆరోగ్యచింత. 13, 14 తేదీలలో శాంతి.

* పూర్వ ఫల్గుణి (పుబ్బ) *
[మో, టా, టీ, టూ]

ఈ వారము మీకు యోగకాలము. పదవిలోనుండువారి సహాయమువలన ఆర్థిక చిక్కులు తొలగును. కోర్టు వ్యవహారములు అనుకూలముగా వుండును. జ్ఞాతుల సహాయము కలుగుతుంది. ఉద్యోగులకు ఒడిదుడుకులు లేకుండా గడుస్తుంది. వ్యాపారులకు లాభదాయకము. కవులకూ, కళాకారులకూ, పండితులకూ మేలుజరిగే కాలము. విద్యార్థులు నూతన విషయములను నేర్చుకుంటారు. 11వ తేదీని శ్రమ ఎక్కువ. 14, 15 తేదీలు యోగము.

* ఉత్తర ఫల్గుణి (ఉత్తర) *
[టే, టో, పా, పి]

ఈ వారము మీకు చాలా యోగదాయకముగా వుంటుంది. ధనాదాయము హెచ్చు. మిత్రులవలన లాభము. గతవారమందు కలిగిన చిక్కులు తీరిపోతవి. పండితులకు, న్యాయవాదులకు మేలుకాలము. వెనుకబడిన కోర్టు వ్యవహారములలో అనుకూలముగా తీర్పు వచ్చును. కార్యభారమువల్ల శ్రమ ఎక్కువగా వుంటుంది. కళాకారులకు యోగించును. 10, 11 తేదీలలో శ్రమ, 14, 15 తేదీలలో మిత్రదర్శనము, కార్యానుకూలత, సహాయము కలుగును.

హస్త [పూ, ష, ణ, ఠ]

ఈ వారమందు మీకు పెద్దల సాంగత్యము కలుగును. బంధుమిత్రులతో విలాసముగా గడుపుదురు. ఆర్థిక స్థితి బాగుంటుంది. ఉద్యోగులకు అధికారుల మన్నన కలుగును. కుటుంబమున నుండువారికి అలంకార లాభము. వర్తకులకు యోగించును. గాయకులకు, కళాకారులకు మంచికాలము. 9, 10 తేదీలు ఆర్థికలాభము. 11 తేదీని ఖర్చు ఎక్కువ. 14, 15 తేదీలు కార్యలాభము.

చిత్త [పే, పో, రా, రి]

ఈవారమున మీరు రత్నములను సంపాదిస్తారు. బంధువులవల్ల లాభము; మిత్రులతో వినోదము. ఉద్యోగులకు గౌరవప్రదముగా వుంటుంది. 12 వ తేదీని తూర్పుదిక్కునుండి సంతానవిషయమై శుభవార్త వచ్చును. 9, 10 తేదీలలో వర్తకులకు లాభము. వారాంతమందు ఖర్చులు ఎక్కువ. కళాకారులకు, కవులకు గాయకులకు మేలు కాలము. విద్యార్థులకు ఉత్సాహసమయము.

* స్వాతి [రూ, రే, రో, తా] *

ఈ వారమున ఆర్థికముగా ఒత్తిడి ఎక్కువగుటచేతనూ, శ్రమ అధికమయే కార్యములు చేయుటచేతనూ అశాంతి ఎక్కువగా వుంటుంది. కోర్టు వ్యవహారములు తృప్తికరముగా వుండవు. పితృవర్గమువారితో కలతలు. అపేక్షించిన సహాయమురానందున నిరాశ. 9, 10 తేదీలలో శ్రమ; ఆర్థిక దుస్థితి. 11-వ వివాదములు. వారాంతమందు స్వల్పలాభము. ప్రయాణముచేసే సూచనలు. విద్యార్థులకు మంచికాలముకాదు.

విశాఖ [తీ, తూ, తే, తో]

ఈ వారమున మిశ్రమఫలములు కలుగును మొదట్లో కార్యహానివల్ల నిరాశకలిగినను, వారాంతములో అజ్ఞాతమిత్రుల సహాయము వలన అనుకూలించి శాంతికలుగును. అనుకోని ప్రయాణము చేయవలసివచ్చుటచేత 11, 12 తేదీలలో ఖర్చు ఎక్కువ. ఉద్యోగులకు మొదట్లో వత్తిడి కలిగినను, వారాంతమందు కొంత అనుకూలత కలుగును. 14, 15 తేదీలలో కుటుంబమందున్న వృద్ధుల ఆరోగ్యభంగం. అశాంతి.

అనూరాధ [నా, నీ, నూ, నే]

ఈ వారము మీకు అనుకున్న పనులు నెరవేరకపోవుటచేతను, ఆశించిన సహాయము కలుగకపోవుటచేతను మనోవ్యథ ఎక్కువగా వుంటుంది. అయిననూ ఓర్పుతో కార్యాచరణ చేస్తారు. పెద్దల సాంగత్యమువల్ల కొంత ఊరట చేకూరుతుంది. 9, 10 తేదిలలో అశాంతి. 11, 12 తేదిలలో త్రిప్పట, ఆశాభంగం. వారాంతమందు కొంచెం శాంతి కలుగును. కుటుంబములోనివారి ఆరోగ్య

★ నక్షత్ర ఫలితాలు ★

మును గురించి చింత. విద్యార్థులకు చదువు సాగదు.

జ్యేష్ఠ [నో, యా, యీ, యూ]

ఈవారము మీకు అనుకూలతకన్న ప్రతికూలత ఎక్కువ. కార్యభారము ఎక్కువగుటచే శ్రమ అధికమై అశాంతిగావుంటుంది. యత్నకార్యములు వెనుకపడును. అయినప్పటికీ కోర్టువ్యవహారములలో కొంత అనుకూలత జరుగుతుంది. దుష్టస్త్రీలతో వివాదమువల్ల మనోవ్యథ. ఆర్థికవిషయాలలో 10, 11 తేదీలలో కొంత వత్తిడి కలిగిననూ క్రమేణా వారాంతమునకు సర్దుబాటుఅగును. 9వ తేదీని వివాదము, అశాంతి. అనారోగ్య సూచన.

మూల [యే, యో, బా, బి]

గతవారమందు ఏర్పడిన ఆర్థిక మాంద్యము ఈ వారమందు కూడా మిమ్ములను వెన్నాడినను, సోదరుల సహాయంవల్ల కొంత ఊరట గలుగుతుంది. ఉద్యోగులకు అధికారుల ఒత్తిడి ఎక్కువవుతుంది. చురుకు మాటలవల్ల మనస్సు గాయపడుతుంది. వాడిగలవాటితో కోసుకొనుటగాని, కాలివేలుకు దెబ్బ తగులుటగాని సంభవించవచ్చును. దైవచింతన అవసరం.

10, 11 తేదీలు చాలా తొందర కలిగించే కాలము. మనోవ్యథ.

పూర్వాషాఢ [బూ, ధ, ఫ, ఢ]

ఈవారము మీ ప్రతిభ నంతటినీ చూపించి కార్యానుకూలతవల్ల తృప్తిని పొందుతారు. మిత్రులసహకారము ఎక్కువగా వుంటుంది. ఉత్తమగ్రంథాలు చదివిన ఆనందము ఎంతగానో లభిస్తుంది. ఉద్యోగులకు తోటివారి సహకారముచే అధికారుల మన్నన కలుగుతుంది. విద్యార్థులకు మేలుకలుగును. గణిత శాస్త్రజ్ఞులకు, కళాకారులకు మంచికాలము. 10, 11 తేదీలలో అనారోగ్య సూచన, అశాంతి. వారాంతమందు ప్రయాణము.

ఉత్తరాషాఢ [బే, బో, జా, జీ]

ఈవారము మీకు అన్నివిధాలా యోగ కాలము. పెద్దల సాంగత్యమువల్ల జీవితములో ఉపయోగానికి వచ్చే అనేక క్రొత్త విషయాలు తెలుసుకుంటారు. గృహమందుండువారి సహకారముతో నిర్విఘ్నముగా పనులు జరుపుకుంటారు. మీ హోదా గౌరవము పెరుగుతవి. వృత్తులలో నున్నవారికి అనుకూలత ఎక్కువ. బడిపిల్లలకు చదువు చురుకుగా సాగుతుంది. పండితులకు న్యాయవాదులకు కళాకారులకు మంచికాలము. 10, 11 తేదీలలో కొంత కార్యవిలంబము. వారాంతమందు ప్రయాణమువల్ల లాభము.

శ్రవణము [జూ, జే, జో, ఖా]

ఈవారము మిత్రులతోను, కళాకారులతోను వినోదముగా గడచును. ఆర్థికస్థితి ప్రోత్సాహకరముగా వుంటుంది. మాతృవర్గమువారి సహాయంకలుగుతుంది. ఆప్తులతో మృష్టాన్నభోజనము ఆరగిస్తారు. విద్యార్థులకు మంచికాలము. ఉద్యోగ వృత్తులు ఒడిదుడుకులు లేక జరుగుతవి. కళాకారులకు, గాయకులకు నటీనటులకు యోగ కాలము.

10, 11 తేదీలలో స్వల్పప్రతికూలత.

ధనిష్ఠ [గా, గీ, గూ, గే]

ప్రస్తుతము మీకు అన్నివిధాలా యోగ కాలమని చెప్పుకోవాలి. బహుకాలంనుండి మిమ్ములను చిక్కుపెడుతూ నిలిచిపోయిన కార్యములను నెరవేర్చుకొని శాంతినిపొందుతారు. భాగ్యవృద్ధి అవుతుంది. పశువులను సంపాదించగలుగుతారు. వృత్తి ఉద్యోగాలలో మొదట కొంత అశాంతిగా గడచిననూ క్రమేణా వారాంతమునకు లాభదాయకముగా వుంటుంది. కవులకు, గాయకులకు, నటీనటులకు యోగము. 10, 11 తేదీలలో కార్యముల యందు మాంద్యం.

శతభిషం [గో, సా, సీ, సూ]

గతవారమందు గలిగిన యోగము క్రమేణా తగ్గుచుండుటచేత కార్యభారము ఎక్కువై ఉష్ణాధిక్యము కలుగును. అకాలభోజనము. అనారోగ్యసూచనకనబడగానే గ్రహరాజు, ఆరోగ్యదాయకుడూ అయిన రవికి శాంతి చేసుకొనుటవల్ల అన్నివిధములా మేలుకలుగుతుంది. పితృవర్గమువారినుండి ఆపేక్షించిన సహాయం సకాలములో చేతికిరాక ఆందోళన పడెదరు. విద్యార్థులకు చదువు మందముగా సాగును. ఉద్యోగ వృత్తులలోనుండువారికి శ్రమ అధికము. 10, 11 తేదీలలో అనారోగ్య సూచన.

పూర్వాభాద్ర [సే, సో, దా, దీ,]

ఈవారములో ఆర్థికస్థితి బాగుండకపోవుటచేతను, అనుకున్న కార్యములు నెరవేరకపోవుటచేతను నిరుత్సాహము మొదట్లో కలిగినను, అజ్ఞాతమిత్రులసహాయమువల్ల కార్యానుకూలత కొంతవరకు వుంటుంది. వ్యాపారవృత్తులలోనివారికి ప్రతికూల సూచనలు కనపడును. ఆరోగ్యముగురించి జాగ్రత్త అవసరం. విద్యార్థులకు బద్ధకమువల్ల చదువు సక్రమముగా జరుగదు. 10, 11 తేదీలలో ప్రతికూలము. వారాంతమునందు కొంచము అనుకూలము.

*** ఉత్తరాభాద్ర [దు, శం, ఝా, థా] ***

ఈవారము నిరుత్సాహముగా వుంటుంది. అవసరానికి కావలసిన డబ్బు చేతికి రాకపోవుటచేత కార్యవిలంబనము కలుగుతుంది. పుణ్యకార్యాలు పైనవేసుకొని కార్యానుకూలతకు హెచ్చు శ్రమపడెదరు. సాధుసాంగత్యమువల్ల ఊరటకలుగుతుంది. వ్యాపారస్థులకు, ఉద్యోగులకు మంచికాలముకాదు. సంఘంలో ప్రతికూల వాతావరణం ఏర్పడుతుంది. అయిననూ ఓర్పుతో నిగ్రహించుకుంటారు. గృహమందుండువారి ఆరోగ్యమును గురించి శ్రద్ధ అవసరం. విద్యార్థులు క్రొత్త విషయాలు నేర్చుకుంటారు. 10, 11 తేదిలు శ్రమదాయకముగ వుంటవి.

రేవతి [దే, దో, చా, చీ]

ఈవారము మీరు ఎంతైనా శ్రద్ధతీసుకోవడం మంచిది. ప్రతికూల వాతావరణము ఎక్కువ. ఆర్థిక మాంద్యము ఏర్పడుతుంది. ఇచ్చిపుచ్చుకోనేపట్ల వివాదాలు సంభవిస్తాయి. స్త్రీలవలన నిందలపాలవుతారు. నౌకర్ల సహకారమువల్ల కార్యానుకూలత వుంటుంది. విద్యార్థులకు చదువుసాగదు. ఉద్యోగులకు వ్యాపారస్థులకు చాలా ఒత్తిడి కలుగుతుంది. త్రిప్పట ఎక్కువవుతుంది. భార్యకు అస్వస్థత. 10, 11 తేదీలలో అన్ని రంగములలోనూ ప్రతికూలత యేర్పడుతుంది. ★



గండం గడిచింది!

నాకు జాతిద్వేషం లేదని ఋజువు చేసుకోవటానికీ, ఆంధ్రుల శౌర్యమూ, పరాక్రమ విశేషాలు, కొత్తరుచిచూపించటానికీ, ఆనాళ్ళ ఆదివారం వుదయం నాకు అవకాశం దొరకబట్టి- అయ్యరుగారికి నాయెడల సుహృద్భావం కొత్తకలిగి, క్రమేణా మామైత్రి అన్యోన్యానురాగాలతో, వుభయుల గృహాభిద్రాలూ కలబోసుకుని విశ్వసించుకునే స్థితివరకూ దిగజారటమూ, యావదాంధ్రులకూ గర్వకారణమని నే ననుకుంటున్నాను.

అయ్యరుగారింట్లోకి వేళకాలకటం, అందులో ఆదివారంనాడు వుభయులమూ యింట్లో వున్నప్పుడే- ఆయనకు మూర్ఛవటలు పోసి మంచమెక్కి మూర్ఛపడమూ, ఆ వళాన నేను నా శౌర్య పరాక్రమాలు

పురాణం సుబ్రహ్మణ్యశర్మ

విజృంభించగా 'సిరికిం జెప్పడు శంఖచక్రయుగమున్...' అన్నట్లుగా పరిగెత్తవమున్నా (మా ఆవిడ చెప్పదీసుకుని నాకన్న కాలోనే వొచ్చిందనుకోండి) ఆ అయ్యరుగారి భార్య విభీతహరిణేక్షణ, క్షమించాలి! ఇక్కడకథ కొంచెం ఆపు చెయ్యవలసి వచ్చినందుకు విచారంగావుంది. ఆ య్యరుగారి భార్య మీదుగా యీ చప్పుకథ మందు నడవబోతుందని యెవరైనా అపోహపడితే వారు చాలా ఆశాభంగం చెందవలసివస్తుంది.)

ఆవిడ గజగజా వొణికిపోతూంటే నా ప్రాణాని కెంతో హాయిగా వుందనుకోండి!

చివరికి ఆ తేలుని 'ఎటాగో' చంపాను.

ఆవిడవద్దంటూంటే కాఫీకూడాయిచ్చింది. మా ఆవిడ నన్ను యెంతో మెచ్చుకుంది. పుట్టి పుణ్యాన తను వీరపత్ని అయిపోయింది అందులో ఢిల్లీలో గదిన్నర వాటాలో వుంటూన్నప్పటికీ.

ఏతావాతా చెప్పొచ్చే దేమిటంటే, యిట్లా మనయిరుగుపొరుగువాళ్ళు చిన్నచిన్న కష్టాల్లో పడుతుంటేనేగాని రాష్ట్రేతరాంధ్రుల సాహసపరాక్రమాలు రాజధానిలో చూపెట్టడం సాధ్యపడదు. వీడో మనమూ మనమూ భాయీలం గనుక యిదంతా దేనికే గాని ప్రదేశ్‌లో కొత్త ఆటు జరిగినా యిటు జరిగినా పర్వపోవటం నామర్దా (సంజీవరెడ్డిగారు చెప్పినట్లు...రాజకీయాలు మాట్లాడనని లెంపలేసుకుంటున్నాను. మా గవర్న్‌మెంటు సర్వీసులో రాజకీయాల ప్రసక్తి రాకూడదు. అంటే నోటి దురుసుతనం కూడా పోయాక యిక ఆంధ్రత్వం యేమవుతుంది చెప్పండి! కథానికా శిల్పం యిక్కడ దెబ్బతింటున్నదని శ్రేయోభిలాషులు గోల పెడ్తారు. వాళ్ళనిగ్గోసిరి! 'నా ఋషిః కురుతే కావ్యమ్' నిరంకుశాః కవయః అన్నారు మనపూర్వులు. చెప్పుకోవయ్యా నీదిక్కున్న చోట...ఎవ్వరేమనుకొన్నా నాకేటి కొరత, నాయిచ్ఛయే గాక నాకేటి వెఱపు' తెలుగు పద్య పాదాలు వుటంకిస్తున్నప్పుడు కొత్త అక్షరాలు యిటూ నటూ పడ్డాయి. లిపి సంస్కరణలో ఆ అభ్రాంద్రాలన్నీ సర్దుకుందాం. ఇక ప్రస్తుతానికి వస్తే—)

కథా ప్రారంభం కెట్టిదనిన—

ఇందులో స్త్రీ పాత్రలు రాకూడదనుకున్నాను. కాని శృంగారం హాస్యం లేకున్నట్లైతే నుల్లో బాటలాగ పాఠకులకి తగిలే—కాని... కావ్యానందం సిద్ధించడమెల్లాగ? రససిద్ధాః కవీశ్వరాః! అన్నారాయె. (కొట్టు! నాకు సంస్కృతం వొక్క అక్షరంముక్క రాదు. కాకిన సంరక్షణార్థం అయం పటాటోపః, నారీయాన పరీశ్రమః, శతశ్లోకేన పండితః గాడ్నీ. కొత్త దాబుగా దర్జాగా వుంటుంది. ఇంటికెళ్ళను చూసేనా పాఠకులు కొత్త పోతారని-నా భ్రమ!)

మా ఆవిడకు నిద్రపట్టని జబ్బొకటుంది.

★ గండం గడిచింది ★

అయ్యరుగారి భార్యకుకూడా నిద్రపట్టదనుకోండి. తేళ్ళూ జెర్రులూ వస్తాయేమోనని ఆవిడ భయం కావచ్చు! మొగుడుగారు యింట్లో వున్నంతసేపూ ఆవిడకు తలనొప్పో, నికారమో, కాళ్లు పీక్కుపోవటమో అన్నీ కలిసో, విడివిడిగానో వచ్చి తీరుతాయి. నేను అమృతాంజనం ఆవిడకోసమే కొన్నానని మా యింట్లోమనిషి చిరచిర లాడ్తుంది. క్రీస్తు ప్రభువు యేం చెప్పాడో గురజాడ అప్పారావుగారూ అదే చెప్పారు ముత్యాలసరాల్లో—'స్వంతలాభం కొంతమానుకు'... పద్దెర్రచేసి చూడ్డం తప్పిస్తే యేమన్నా వింటేనా? పాఠకులు యే విధంగా అనుకుంటారో అదే ఫణితిని తూ. చా. తప్పకుండా మావత్తు కథా—కమామీషు అయ్యరుగారి రెండో పెళ్ళి పెళ్ళాం మీదుగా—(ఐనా యీ జుల్లోకూడా సెకండుహాండు మ్యారేజి బాద ప్లాటు అల్లుకుని కొత్త చమత్కరించా ని యే రచయితా కొత్త కాలగమనం తెలి నవాడు అంత చచ్చుపూవు చెయ్యడు! ంగ్లీషులో కూడా అపభ్రంశాలు ర్లుతాయి. రాసిందికొట్టేసే లవాటు లేదు.) అంటుంది అనుకుంటుంది ఇల్లాలు. దీనికితోడు (అయ్యరుగారనటం గు లేదు, చెట్టంతమనిషిని అందులో ఆర్థిక ఖోద్యోగిని పట్టుకుని. ఆయనకు జీతం 30 రూ||లు. అందులో సగం నాకు లేదు— బాడు ప్యాసులున్నాయని మా ఆవిడ గర్వడుతుందిలెండి. ఆడవాళ్ళ స్వభావం అంతే—ిందుమీదా తెలియదు) స్వామినాథన్ గారికీ శ్రీమతి స్వామినాథన్‌గారికీ హిందీ అక్షరంముక్క రాదు. అంచేత భాషాంతరీకరణ సమస్య నా పీకకు చుట్టుకుంటుంది. రాలు సారాలు, రోడ్డుమీదపోయే పాత డ్డలకూ బూడ్సుల జోళ్ళకూ (బూడ్సుల డంటే గ్యాపకంవచ్చింది. నా ప్లకున్న డు పాతికరూపాయలది మరమ్మత్తుకోసం సినబుట్టలో దాచానా—అది కనపడ్డం లేదు. మంటే దొంగచూపులూ చికిలినవ్వూనూ! ళ్ళు వొళ్ళుమండుకుపోతుంది. స్టైన్‌లెస్ స్టీలు గ్నా, జాడీవో, యిత్తడిగిన్నో పుచ్చుకుని తయారవుతుంది యెదురుగుండా) మారుగా గిన్నెలూ సీసాలు అంటగట్టేవాళ్లను పిలవాలి. ఆవిడ చొరవగావచ్చి శంకర్‌న్ పిక్కీవో, ఇలస్ట్రేటెడు వీక్లీవో యిమ్మని అనుగుతుందా—యింగ్లీషురాని యీ యింట్లో జీవానికెందుకొచ్చిన జెలసీ చెప్పండి. ఆవిడ నాతో యింగ్లీషులో మాట్లాడగానే తనకు నమ్మకం కుదిరేట్టు తర్జుమాచేసి చెప్పాలి. ఆవిడదంతా బడాయిట—ఈ హిందీ రాకపోవటం, ఆదివారంనాడు నా అదృష్టంకొద్దీ స్వామినాథన్‌గారు 530 రూ||ల. జీతగాడు యింట్లో వుంటూండగా తేలురావటం, దాన్ని నేను తన సలహామీద తక్కున వెళ్ళి నిలుచున్న పాట్న చంపటం, యిదంతా జరిగాక మా విదేశీవ్యవహారాలు రప్చర్ లేకుండానే సాగిపోతాయని నాకు నమ్మకం కుదిరింది.

ఈలోగా మళ్లీ శెలవురోజు వచ్చింది.

(గత సంచిక తరువాయి అన్నట్లు శెలవురోజు వస్తేనే గాని మళ్లీ కథ నడవదు.) మాకు కూడా రైల్వేలో ఫించనుపద్ధతీ ప్రవేశ పెట్టారని హడావిడిగావుంది. ఆ వాకబులు కొత్త ఆర్థికశాఖలో గజెటెడు ఆఫీసరు స్వామినాథన్ గార్ని అడిగి తెలుసుకుందామని (తేలును చంపిన కృతజ్ఞత వుండకపోదా అని) కాఫీకి పిలిచాను. ఏమాట కామాటే చెప్పుకోవాలి. గజెటెడాఫీసరునని పిసరంత గర్వంకూడా లేదు స్వామినాథన్‌గారికి. చాలా నిరాడంబరమైన వ్యక్తీనూ, కించిత్తు భార్యాభయం వున్నప్పటికీ, భోళామనిషి, (మనవాడికొపాటి హోదావచ్చేసరికి గుర్లు మీదకు పోవుటండీ!)

మీద పంకా తిరుగుతోంది. వాతావరణం అప్పటివరకూ ప్రశాంతంగానే వుంది. కథ ముగిసేవేళకు ఎట్లా మారుతుందో చదువరులు కొంచెం ఓపికపట్టాలి! ఇహ మా సంభాషణ డొంకతిరుగుళ్లు లేకుండా, సెల్యులాయిడూ న్యూసుప్రింటూ వేస్తుగానక్కర్లేకుండా సూటిగా తూచినట్లు వాడిన శబ్దాలతో సాగింది.

నేను—'ఫించన్ పుచ్చుకుంటే నాకేం లాభం చెప్పండి!'

ఆయన—'నీజీతం సగటున రెండువందలనుకో—ముప్ఫైరెండేళ్లు సర్వీసు దాటేసరికి నీ ప్రావిడెంటు ఫండు సుమారు ఆరువేలు దాటొచ్చు. చక్రవడ్డీ వొకవెయ్యి కలుపుకో—బోనస్ ఆరువేలు పదమూడువేలు వస్తాయా. గ్రాచ్యుటీ అప్పుడూ యెప్పుడూ యిస్తారు. అవునా?

'నేను చచ్చిపోయినా యిస్తారు మా ఆవిడకు. మరి ఫించన్ పుచ్చుకుంటే రిటైరయాక బ్రతకొద్దుటండీ?'

'సరిగ్గా విను. నువ్వు ఐదొందలన్నా ఆఖరిజీతం పుచ్చుగోకుండా రిటైరవవు. అందులో 3/8 వంతు 188.25 చొప్పున 12 × 10, 120 మాసాలకు 17,600 సుమారుగా ముడ్తుందా, ఇందులో నీకు 4,500 లాభంకదా?'

'నేను రిటైరయాక బ్రతక్కపోతేనో...'

'నువ్వు టక్కున చచ్చిపోయినా నష్టం లేదు. ప్రభుత్వం మీయావిడకు అన్యాయం చెయ్యదు. పదేళ్లు 50% ఫించను ఆవిడకు యిస్తారు. అంటే ఎనిమిది వేలు—'

'మరి నేను అర్థమధ్యస్తంగా ఏ రైలు క్రిందపడో, కారుగుద్దేసో పరమపదించాననుకోండి. అప్పుడూ నా పెళ్లాం వునూరుమని యేకుస్తుంది.'

'వినమంటూంటే—ఫించను పుచ్చుకున్నాక నువ్వు మరో పదేళ్లలో హఠాత్తుగా చచ్చిపోయినా, చచ్చినట్లు ప్రభుత్వం గ్రాచ్యుటీ 50% కలిపి నీ భార్యకు యిచ్చుకోవాలికుంటుంది పదేళ్లవరకూ. అదే లాభం—ఇక నువ్వు ప్రమాదవశాత్తూ మరణిస్తే, అందుకో సుళువు చెబ్తాను విను. ఇప్పుడు నువ్వు ప్రావిడెంట్ ఫండు నెలా పదోపరకో ఇస్తున్నావా, ఆ మొత్తం ఇన్సూర్ చెయ్యి నాలుగు వేలకు. రిస్కు ఎల్లానూవుంది. నువ్వొకవేళ పదేళ్లలో గుటుక్కుమన్నా, అవో నాలుగు వేలు, గ్రాచ్యుటీ మూడు వేలు, ఫించన్ పెట్టి నీభార్య దర్జాగా సంతోషంగా కాలం గడుపుతుంది పదేళ్ళవరకూ.'

ఈ 'దర్జా' 'సంతోషం' అన్న మాటల్ని వింటున్న కిటికీలోని నాలుగు జతల కళ్ళు వుఋనుతిమినట్లు—వంట యింట్లో ఏదో పెద్ద చప్పుడయింది. ఇద్దరం కంగారుగా వీధిలోకి పారిపోయొచ్చేశామనుకోండి. ఆగిన్నెల కంచాల విసురుడులో (మాకేం గాయాలాటివి తగల్లేదనుకోండి) మాపరుగులో మేమిద్దరమూ చెరో రోడ్డు పుచ్చుకుని వినయనగర్ బస్సుస్టాపింగు దగ్గర మళ్ళీ కలుసుకున్నాం.

సరే — నేనేమో రైల్వే గుమాస్తాని... మరి ఆయన గజెటెడాఫీసర్ మినిస్ట్రీ ఆఫ్ ఫైనాన్స్... కొత్త వెనకా ముందూ చూసుగోనక్కర్లా? యెంత వీరపత్నిఐనా ఇన్ని మాట్లు బుజువు చేసుకోవాలా?

స్వామినాథన్‌గారు బస్ నంబరు 27 లో దూరి చిరునవ్వు నవ్వారు. నేను అప్రయత్నంగా చేయివూపుతూ 'రూథర్ రోడ్' బస్సుకోసం స్టాపింగులో క్యూలో గుండె మీద చేయి వేసుకుని నిలబడ్డాను.

ఐతే మామూలు మనిషికన్నా పరుగెత్తే మనిషి గుండె నిముషానికి యెన్ని మార్లు ఎంత వేగంగా కొట్టుకుంటుందీ యెవరన్నా మెడికల్ స్టూడెంటుని అడిగి తెలుసుకోవాలి. ★

కనుపర్తి వరలక్ష్మమ్మ

రాత్రి చాలా ప్రొద్దుపోయింది. తెల్లవారితే కనకం పెండ్లి. గోపాలంగారు పెండ్లి పనులతో నలిగి సున్నమైపోతూ గూడా, ఇంకా అల్లుడు పెండ్లికి రాలేదన్న ఆదుర్దాతో బాధపడుతూ, మెయిల్ వద్దకు రామును పంపుదామన్న ఉద్దేశంతో "రామూ రామూ" అంటూ పెద్ద కొడుకును కేక వేశారు. పెండ్లిపనులతో అంతకంటే అలిసిపోయిఉన్న రాము "ఎందుకునాన్నా, పిలిచావు" అంటూ వచ్చాడు.

"చూడూ, మీ బావ మెయిలుకు తప్పకుండా వస్తాడు. ఇదేగా ఆఖరు బండి. తెల్లవారితే పెండ్లి ఆయెను. ఇంకే బండికి వస్తాడు? తెల్లవారుజామున ఎవరినన్నా తీసుకొని రైలువద్దకుపో," అన్నారు.

"అబ్బా! ఎన్ని బండ్లకుపోను? ప్రొద్దున ప్యాసెంజరుకు వెళ్ళి వచ్చానా, సాయంత్రం ఎక్స్‌ప్రెస్‌కు వెళ్ళివచ్చానా! ఇప్పుడు ప్యాసింజరుకు వెళ్ళివస్తున్నా; ఇంకా ఎన్ని బండ్లకు వెళ్ళనుబాబూ! నిన్నటినుండి ఈ బండ్లకు తిరగడమే సరిపోతున్నది," అన్నాడు రాముడు విసుగ్గా, కోపంగా.

"అవును నాయనా! ఇన్ని బండ్లకు తిరిగి, అసలు వచ్చేబండికి వెళ్ళకపోతే ఎట్లా చెప్పు? ఇన్ని బండ్లకు తిరిగింది కనిపించదు. రైలువద్దకన్నా రాలేదన్నమాట నిముషంలో వచ్చేస్తుంది. ఏదో యీ ఒక్క బండికి గూడా వెళ్ళివస్తే మాట దక్కుతుంది. మన వూళ్ళో మెయిల్ యెక్కువసేపు ఆగదుగా. అతనికి ఒక్కడికీ సామానులన్నీ దించుకొని దిగడం కష్టం గూడాను," అన్నారు గోపాలంగారు.

"ఏమో మెలకువవస్తే వెళ్ళుతాను."

"మెలకువేమిటి? మనకీ రాత్రి నిద్రలున్నాయేమిటి మేలుకోడానికి. విడిదిలో పెండ్లివారి కన్నీ అమిరినాయో లేదో, ఒకమాటు వెళ్ళివస్తాను. బాబూ! తప్పకుండా రైలువద్దకుపో, మళ్ళీ సందట్లో మఱచిపోతావని చెప్పుతున్నాను," అంటూ గోపాలంగారు విడిదిలో పెండ్లివారి సంగతులు కనుక్కొనేందుకు వెళ్ళారు.

అబ్బబ్బా! బావకోసం రైలుచుట్టూ తిరగలేక యిదైపోతున్నాను, పోనంటే, "పోరా తమ్ముడూ" అంటూ బిక్కముఖం వేసుకొని అక్కయ్యొకతే. ప్రతిబండికీ తరుముతుంది. పోతే ఆయనరాడు', అంటూ సణుక్కున్నాడు రాము. "బావ రాకపోతే అక్కయ్య బిక్కముఖం వేయకపోతే ఇంక నవ్వేస్తారురా" అన్నది వాళ్ళ మేనత్త కామేశ్వరమ్మ నవ్వుతూ. "అబ్బో. బావకు బలే బెట్టుగా ఉన్నదే. నిన్ననంగా వస్తానని వ్రాశాడు. ఇంతవఱకు రాలేదు. అత్తయ్యగారు, మామయ్యగారు కూడా వచ్చారు. వాళ్ళబ్బాయికంటే వాళ్ళె మంచివాళ్ళన్నది" పెండ్లికూతురు కనకం. "ఉండమ్మా ఉండు. రేపు మీఆయనేమి బెట్టుచేస్తాడో" అన్నది, వాళ్ళ పింతల్లి కమలమ్మ. "చేసేనా?" అన్నది కనకం. "చేస్తే ఏమిచేస్తా" వేమిటని అందరు పకపకా నవ్వారు. కనకం సిగ్గుతో గదిలో దూరింది.

2

తెల్లవారు జామున మూడుగంటలకు వెళ్ళి కనిపెట్టుకొని కూర్చొగా, కూర్చొగా ఐదు గంటలకు బొయ్యమని అఱచుకుంటూ



ఆనందం

—ఫొటో: జె. వి. రత్నావళి, హైదరాబాదు.


వచ్చింది మద్రాసు మెయిల్. రాము కళ్ళు నులుముకుంటూ సెకండుక్లాసు కంపార్టుమెంటువద్దకు పరుగెత్తుకెళ్ళాడు. తనకొరకు ఎవరైనా రైలువద్దకు వచ్చారేమోనని ఎదురు చూస్తూ తలుపుతీసుకొని నిలబడ్డ ప్రసాద్ రామును చూచి "రామూ" అన్నాడు. "ఆఁ వచ్చావూ" అంటూ రాము బావగారివద్దకు వచ్చాడు. లెదర్ బ్యాగ్, హోల్డాల్, పూలబుట్ట వగైరాలు చకచకా రాముకందించి, ఎడమచేతిమీద కోటు వేసుకొని, కుడిచేతితో హాట్ పట్టుకొని వడివడిగా రైలు దిగాడు ప్రసాదరావు. రైలుకూలీ సామాను తెస్తూవుండగా బావమరదు లిద్దరూ టికెట్ కలెక్టరుకు టికెట్ ఇచ్చి బయటికి వచ్చి రిక్షా కుదుర్చుకొని సామానులు పెట్టుకొని రిక్షా ఎక్కారు. "ఏమోయ్ రామం నా కోసం చాలాసేపటినుంచి కనిపెట్టుకొని కూర్చున్నట్టున్నావు. వెధవబండి గంటన్నర లేట్. పాపం నిన్ను చాలా కష్టపెట్టాను" అన్నాడు ప్రసాద్.

"ఇవ్వాలిటి కష్టమేనా? రెండు రోజులనుంచి బండి బండికి వచ్చిన కష్టమో! అబ్బా బండిబండికి త్రిప్పి ఏమి వేధించావయ్యా బావా!" అన్నాడు రాము.

"పెండ్లి యీ ఉదయం తొమ్మిది గంటలకుగా. నేను అయిదు గంటలకే వస్తిని. నేనేమి పొరబాటు చేశానురా" అన్నాడు ప్రసాద్.

"అయితే సరిగా నీవుగూడా పెండ్లికొడుకులాగా ముహూర్తం వేళకే రావాలెనా ఏమిటి? ఒకపూట ముందుగా వస్తేనేం? అటువంటి వాడివి ఒకటి రెండు రోజులు ముందుగా వస్తానని వ్రాయడమెందుకూ? ఆవచ్చే రైలేదో కచ్చితంగా వ్రాస్తే ఆ రైలుకే వచ్చేవాణ్ణిగా" అన్నాడు రాము, రెండురోజుల నుండీ రైళ్ళచుట్టూ తిరిగిన విసుగుదలా కోపం చూపిస్తూ.

"ఒరే! నీవూ ఉద్యోగంలో ప్రవేశిస్తేగాని ఈ ఉద్యోగపు కష్టాలు తెలియవు. నాకూ ఒకటి రెండు రోజులు ముందుగానే రావాలెనని ఉన్నది కాని ఏం జేస్తాను? ఆఫీసర్ సెలవివ్వేగామా. వాడో పెడసరపు మనిషి. ముఖ్యంగా వెళ్ళా



ఎందుకైనా మంచిది — ఇద్దరు డాక్టర్లుండాలి!

★ చదివింపు ★

లయ్యా! అంటే నీ పెళ్ళైతే వెళ్ళడం ముఖ్యంగాని, మరదలు పెళ్ళేమి ముఖ్య మయ్యా అంటాడు. ఏంజెప్పను ఆమనిషికి? పైగా అవి తీసుకురా ఇవి తీసుకురా అని మీ అక్కయ్య పురమాయింపు లాయెను. పట్నంనుంచి వస్తున్న వాడిని గదా కొత్త పూలుగీలైనా కొనుక్కోకుండా ఎట్లారాను? అవీయివీ చూచుకొని వచ్చేటప్పటికి ఆలస్యమైంది. ఏమి చేయ మంటావురా" అన్నాడు ప్రసాద్.

"అవునులే, నీ వక్కడ అవీయివీ చూచుకుంటూ మమ్మిక్కడ ఏమీ చూచుకోకుండా పూటపూటా రైళ్లు కాచేందుకు పరుగెత్తించావు. బలేబావవయ్యా! పెండ్లికి వచ్చేవాడికి నీకే అంతతీరు బడిలేనిపనైతే పెండ్లిచేసే వాళ్ళకు మా కెంతపని ఉంటుందంటావు" అన్నాడు రాము చులుగ్గా.

"ఆమహాచేశావు లేవోయ్! పెండ్లి పెత్తనమంతా నీవే చేస్తుంటే మీ నాన్న గారు ఏమి చేస్తున్నట్టు" అన్నాడు ప్రసాదు నవ్వుతూ.

"అవును నీకేమి తెలుస్తుంది? ఎంత మంది విఱగపడి పనిచేస్తే ఆడపిల్ల పెండ్లవుతుంది?" అన్నాడు రాము.

"పాపం చాలా కష్టపడుతున్నావు, పెండ్లివారిచేత మంచి పంచెల చాపు యిప్పిస్తాపద," అన్నాడు ప్రసాద్.

బావమఱదు లిద్దఱు సల్లాపా లాడుతుండగా నిముషంలో రిక్షా యింటికి వచ్చేసింది. అలుడు వచ్చినందుకు బ్రహ్మానంద భరితులై గోపాలంగారు "వచ్చావా నాయనా" అని ప్రేమపురస్సరంగా అల్లుణ్ని లోనికి తీసుకు వెళ్ళారు. అత్తగారు తక్షణం లోపలికివెళ్ళి కాళ్ళు కడుగుకోటానికి నీళ్లు తెచ్చియిచ్చి "కాళ్ళు కడుక్కోండి" అన్నది. సుందరి అల్లంతదూరాన పెనిమిటిని చూచి చిఱునవ్వుతో తల వంచుకొంది. పెండ్లికూతురు "అబ్బో బావ వస్తున్నాడు, ఎగతాళిచేస్తా" డని గదిలో దూరింది. సెలవు దొరికిందో లేదో ఈరైలుకైనా ప్రసాదరావు వస్తాడో రాడో అని తహతహలాడుతున్న వారందరికి ప్రసాదు ఆగమనం మహా హర్షదాయక మైంది.

ప్రసాద్ మేడమీదకు వెళ్ళుతూఉండగా నౌకరుచేత అతనిపెట్టె హోల్డాల్ పట్టించుకొని సుందరిగూడా మేడమీదకువెళ్ళి భర్తను చూచి "చాలా తొందరగానే వచ్చారే" అన్నది నవ్వుతూ.

"రాకేమి? పెండ్లి అయిపోలేదుగా" అన్నాడు ప్రసాద్.

"సరే యింకా పెండ్లికూడా అయిపోవాలె కాబోలు"

"ఉద్యోగం చేస్తున్నవాడిని నీవలె పది రోజులు ముందుగా వచ్చి కూర్చోడానికి ఎట్లా వీలవుతుంది. పైగా పూలవీ, బుక్కా అనీ, ప్రెజెంటేషన్లనీ, లక్షు పురమాయిస్తివి

దేవివారి ఉత్తరువు ప్రకారం అవన్నీ సప్లయి చేసుకొని రావలెగదా."

"సరేకాని కనకానికి ఏమి ప్రెజంటు తెచ్చారు?"

"ఏదో తెచ్చాను."

"నాకు చూపించరూ?"

"చూస్తువుగానిలే అంతతొందరెందుకు?"

"ఏదీ బ్యాగ్ తాళం చెవి యిట్లా యివ్వండి."

"అది ప్యాక్ చేసి ఉన్నది. ఆనక చదివింపులప్పుడు చూడవచ్చునులే."

"ప్యాక్ విప్పితేనేమి? ఆనక ఎట్లాగో విప్పేదేగా. అయినా అంత ప్యాక్ చేసిన కేమిటండీ?" అంటూ తాళపు చెవికోసం కోటుజేబులు వెతుకుతున్నది సుందరి. ఇంతలో "వరపూజకు పోవాలె త్వరగా రా అమ్మా" అని కేక వేసింది సుందరితల్లి. "ప్రసాదరావ్ వరపూజకు పోతున్నాము. నీవుగూడా రా" అని పిలిచారు గోపాలంగారు అల్లుణ్ణి.

"అది ఆనక చూడవచ్చులే. మీ నాన్నగారు, అమ్మగారు, పిలుస్తున్నారు, పోదాం పద" అన్నాడు ప్రసాద్. సతీపతు లిరువురు గబగబా మెట్లుదిగి క్రిందికి వచ్చేశారు. ప్రసాద్ తలిదండ్రుల కిద్దఱకు కన్పించి కుశల ప్రశ్నలుచేసివచ్చి పెండ్లికూతు రెక్కడా కన్పించ దేమంటూ కనకం ఉన్న గదిలోకి వచ్చాడు. కల్యాణం బొట్టుతో, బుగ్గ కాటుక చుక్కతో, కాళ్ళకు పసుపు పారాణితో, పట్టుచీర, పట్టు రెవిక ధరించి గౌరీపూజకు కూర్చోబోతున్నది. కనకం.

"ఏమిటి విశేషం కనకం? బలే ముస్తాబైనా" వన్నాడు ప్రసాద్. ఎప్పుడూ బావగారిని హాస్యాలాడి విసిగించే కనకం ముద్దరాలై సిగ్గుతో తలవంచుకున్నది, బావగారిని చూచి." అబ్బో అమ్మాయిగారు చాలా సిగ్గు నేర్చుకున్నదే" అన్నాడు ప్రసాద్ నవ్వుతూ. "పెండ్లికూతురు అయిన తర్వాత గూడా యింకా సిగ్గుపడకుండా నీతో కబుర్లు చెప్తూ కూర్చుంటుందయ్యా" అన్నది పెండ్లికూతురుతల్లో మల్లె పూవులదండ పెట్టుతున్న కనకం మేనత్త. కనకం మరి కొంచెం సిగ్గుతో ముడుచుకుపోయింది.

"ఏం కనకం పెండ్లికొడు కెట్లా ఉన్నా" డన్నాడు మళ్లీ ప్రసాద్ కవ్విస్తూ. కనకం యిక జవాబుచెప్పకుండా ఉండ లేక పోయింది.

"పోయి చూచిరా" అన్నది.

"నేను చూచి వస్తానులే; నీవు చూచినప్పు డెట్లా ఉన్నాడో చెప్పు"

"అట్లా అడిగితే అదేమి చెప్పుతుందిరా. బాగా ఉండబట్టే చేసుకుంటున్నది" అన్నది అప్పుడే అక్కడకువచ్చిన ప్రసాద్ తల్లి.

3

ఇంతలో వరపూజకు పదండని గోపాలం గారు వచ్చి స్త్రీ పురుషు లందర్నీ పిలుచుకొని మేళ తాళాలతో బయలుదేరి వెళ్లారు. పెండ్లికొమార్తెను గౌరీ పూజకు కూర్చోబెట్టి పురోహితుడు గూడా వరపూజ జరిపించుటకువెళ్లాడు. వరపూజ అయింది. పెళ్ళికొమారుని కారుమీద తోడ్కొని వచ్చారు. పెండ్లికొమారుడిచేత మంగళ స్నానాలు చేయించి పట్టువస్త్రములు కట్టించి పందిరిలో వివాహతంతు ఆరంభించాడు- శాస్త్రులుగారు - ఆడపెండ్లివారు మగపెండ్లివారు స్త్రీ పురుషులు యావన్మంది చక్కగా ముస్తాబై పెండ్లి పందిరినిండా కూర్చున్నారు. మంగళ వాద్యాలు మ్రోగుతున్నాయి. వెంట వెంటనే కన్యాదానం సూత్రధారణం తలంబ్రాలు అయిపోయినాయి. "అయ్యా! కన్యాదాతలకు కట్నాలు తీసుకరండి అమ్మా వధూవరులకు చదివింపులు చదివించేవాళ్ళు చదివించవచ్చును" అన్నాడు శాస్త్రులుగారు. కన్యాదాతలకు కట్నాలు చదివించడమైన తరువాత వధూవరులకు చదివింపు లారంభమైనాయి. బంధువులు, మిత్రులు పరిచయస్తులు ఉభయపక్షాల వారు వారికి ఇష్టమైనవిధంగా వస్త్రాలు, రజతపాత్రలు, గ్రంథాలు, కలాలు, పెన్సిళ్లు టాయిలెట్ సామానులు జోరుగా చదివించడం ప్రారంభించారు. కనకానికేదో బహూకనం తెచ్చానన్న ప్రసాద్ చదివింపుల వేళకు ఎక్కడా కన్పించకపోతే సుందరి పెనిమిటికోరకు పందిరంతా వెదికి అక్కడ కనిపించకపోతే మేడమీదకు వెళ్ళింది. ప్రసాద్ అక్కడ నిదానంగా పడుకొని ఉన్నాడు.

"ఇదేమిటండీ, ఇక్కడ పడుకున్నారు? కనకానికి ఏమిటో ప్రెజెంటేషన్ తెచ్చానంటిరే! చదివించరూ?" అన్నది.

"నీవు తీసుకపోయి చదివించూ."

"అదేమిటి నేను చదివించడమేమిటి? మీరు వచ్చి చదివించరాదూ?" అన్నది సుందరి.

"వస్తున్నాలే పద" అదిగో ఆ బ్యాగులో ఉన్నది. తీసుకొనివెళ్ళు" అన్నాడు. తాళపు చెవి చేతిలో పెడ్తూ. సుందరి గబగబా తాళము తీసి దానిలోవున్న బంగిని తీసి "యిదేనా" అన్నది. "అవును, తీసుకపద" అన్నాడు. సుందరి వడివడిగా మేడదిగి బంగీ తీసుకవచ్చి శాస్త్రులుగారి చేతిలో పెట్టి ఇది పెండ్లికుమార్తెకు చదివించండన్నది." ఇదేమిటని చదివించను బంగీఅని చదివించవచ్చునా? ఎవరి పేర చదివించను" అన్నాడు శాస్త్రులుగారు.

"ఎవరి పేర నేమిటండి మా వాడు తెచ్చి నట్టున్నాడు. వాడిపేర చదివించం" డన్నది ప్రసాదరావు తల్లి.

"అబ్బాయిగారిపేరు ప్రసాదరావుగారు గాదుటండీ?"

"అదేమిటండోయ్! అప్పుడేమఱచిపోయి నారు? మాఅబ్బాయిని ఇంట్లో ప్రసాద్, ప్రసాద్ అంటాముగాని వాడి పూర్తిపేరు వేంకట సూర్యలక్ష్మీనరసింహ శివరామకృష్ణ సుధాకరప్రసాదరావుగారు. మా యింటిపేరు హరిరాజువారు అన్నది ఆమె. ఊహూ! మీ! బావగారు హరిరాజు వేంకట సూర్యలక్ష్మీ నరసింహశివరామకృష్ణ సుధాకర ప్రసాదరావుగారు మీ వివాహమహోత్సవ కాలమందు మరదలిని ఆశీర్వదించి యిచ్చిన బంగీ" అని శాస్త్రులుగారు అంటూ ఉండగానే పెండ్లికుమార్తె తల్లి "అదేమిటండీ శాస్త్రులుగారూ అంతతొందర? బంగీలో వున్న వస్తువేదో తీసి చదివించాలె గాని బంగీ అని చదివించడమేమిటండీ" అన్నది. ఇంతలో ప్రసాదరావు వచ్చి నవ్వుతూ నిలుచున్నాడు. "దానిలో ఏమున్నదిరా అన్నది "తల్లి శాస్త్రులనుగారినే చూడమను" అన్నాడు ప్రసాదరావు.

"అయ్యా ఆ వస్తు వేమిటో పైకి తీసిఇస్తే చదివిస్తాముగాని ఈ బంగీలన్నీ ఎక్కడ విప్పమండీ" అంటూ శాస్త్రులుగారు "అమ్మా ఎవరివద్దనైనా కొత్త చాకు ఉంటే అందుకోండి అన్నాడు. రాము చాకు తెచ్చి యిచ్చాడు. గుడ్డతోకుట్టి సీలుచేసిన బంగీని చాకుతో కోశాడు శాస్త్రులుగారు. అంతటితో దానిలోవస్తువు బయట పడలేదు. దానిచుట్టు ఎన్నో కాగితాలు టేపుతో గట్టిగా చుట్టి ఉన్నాయి. క్షణంలో అందరి దృష్టులు ప్రసాదరావు మఱదలికి తెచ్చిన బహూకరణ పైనిలిచిపోయినాయి. ఆబంగీని చుట్టిన కాగితాలకు అంతులేదు. అక్షయవస్త్రాల్లాగా 'రిస్టువాచీ' అంటున్నారు. ఒకరు చెమటలు పోస్తూ శాస్త్రులుగారు విప్పదీస్తున్నారు.

అందరు ఒకరిమీద ఒకరు నిలిచి విరగబడి చూస్తున్నారు. అందులో ఏమున్నది? ఒకరు 'ఉంగర' మంటున్నారు. ఒకరు 'పచ్చనోటు' అంటున్నారు. "మఱదలి బహుమానం కాదు గాని మమ్మలను గూడా హైరాను పెట్టుతున్నా వేమయ్యాపంతులు" అంటున్నాడు శాస్త్రులు. అదిగో, అదిగో వచ్చింది. చేతి రుమాలుతో కట్టి ఉన్నది, ఏమిటి ఏమిటి, చిన్న బొమ్మ పాతగుడ్డపేలికనయా పైనా, "హా! హా!" అందఱు విఱగబడి నవ్వుతూ, "ఏడీ ఆబావగారు?" అంటూ నలుదెసలా పరికించి చూచారు. బావగారు పత్తాలేదు. ★

అయిదు రూపాయిల నోటు

అలారం గడియారం గణగణమంటూ మ్రోగింది. గాఢంగా నిద్రపోతున్న భానుమూర్తి ఉలిక్కిపడి లేచాడు.

వెధవ గడియారం! దానిష్టమొచ్చినప్పుడు మ్రోగుతుంది. దాని నోరుమూసి మళ్ళీ పడుకున్నాడు, దుప్పటి ముసుగుపెట్టి.

కాని నిద్రపట్టలేదు. మంచి నిద్రలో వుండగా ఒకసారి లేపితే మళ్ళీ నిద్రపట్టదు, తనకుమాత్రం అనుకున్నాడు. బద్ధకంగా లేచి మంచంమీద కూర్చొని ఒళ్ళు విరుచుకుంటూ కళ్లు తెరిచాడు.

ఎదురుగా పిల్లి. పెద్ద పనున్నట్టుగా, అతని కోసమే ఎదురుచూస్తున్నట్టుగా కూచొని వుంది. పిల్లిశకునంమీద అతనికంతగా నమ్మకం లేకపోయినా కళ్ళు తెరవగానే అది కనిపించేసరికి, అకారణంగా అతనికి దానిమీద చాలా కోపం వచ్చింది.

టైము చూశాడు. ఏడుగంటలవుతోంది. ఎనిమిదింటికల్లా ఆఫీసుకెళ్లాలి. హడావుడిగా లేచి టూత్ బ్రష్‌తో పళ్లుతోమటం మొదలుపెట్టేడు. ఉన్నట్టుండి జ్ఞాపకం వచ్చిందతనికి ఆ రోజు ఆదివారమని, ఆఫీసుకు సెలవని.

చాలా ఆనందమైందతనికి. అతనికే అనుమానం వేసింది. తనకెందుకింత ఆనందం? ఆ రోజు ఆదివారమని ముందరే తెలిసివుంటే, అంత ఆనందం పొందేవాడు కాదతను. తనిక వెళ్ళాలి అనుకుంటున్న సమయంలో సెలవని జ్ఞాపకం వచ్చేసరికి అదొకవిధమైన సంతోషం అదొకవిధమైన ఆనందం.

నెమ్మదిగా ముఖము కడగటం పూర్తిచేశాడు. ఆ రోజు తను చెయ్యవలసిన కార్యక్రమం ఏమిటో ఆలోచిస్తూ స్నానము చెయ్యటం పూర్తిచేశాడు.

బట్టలేసుకుందామని అల్మైరు తెరిచేటప్పటికి యిస్త్రీబట్టలొకటీ లేవు. బట్టలన్నీ మాసిపోయాయి. క్రితంరోజు వేసిన పంట్లామునే, కొంచెం సరిచేసి తొడుక్కున్నాడు. టేబుల్‌మీదఉన్న పర్సు చూడగానే అప్పుడు జ్ఞాపకం వచ్చిందతనికి, అది నెలాఖరనీ, తన దగ్గిర డబ్బులు నిన్నటితోనే అయిపోయాయనీ.

బయటికెళ్దామని లేచినవాడు, వుసూరుమంటూ కూలబడ్డాడు. ఏమిటి చెయ్యటం? తన కార్యక్రమమంతా డబ్బులు లేకపోవటం మూలాన, ధ్వంసమయిపోవలసిందేనా? ఆలోచనలో పడ్డాడు.

ఆలోచించటానికైనా ముందర కాఫీ తాగాలి. పర్సులో ఎంతవుందో అని లేచి చూశాడు. ఒక నయాపైస మాత్రం కనిపించింది. ఛీ!

తనను తనే తిట్టుకున్నాడు, అంత అజాగ్రత్తగా డబ్బు ఖర్చుపెట్టినందుకు.

కాసేపు ఆలోచించాడు భానుమూర్తి. ఇప్పుడు కాఫీకి కూడా డబ్బులు లేవే ఎలాగ? ఆ! జ్ఞాపకం వచ్చిందతనికి సిగరెట్టు డబ్బా సంగతి. గబగబా లేచి గూట్లోవున్న సిగరెట్టు డబ్బా తెరచి చూశాడు. అందులో కొన్ని కాన్లున్నయ్.

అవి తను పడేసినవే. తన దగ్గిర చిల్లరగా కాన్లొచ్చినపుడు, అందులో పడేస్తూవుండేవాడు. అవి యిప్పుడు అక్కరకొచ్చినయ్.

అవన్ని చేతులో పోసుకుని లెక్కపెట్టేడు. సరిగా తొమ్మిది కాన్లున్నయ్. పరవాలేదు కాఫీ తాగేసెయ్యొచ్చు అనుకున్నాడు.

"భగవాన్"

అవన్నీ జేబులో పోసుకుని రూమ్ తాళం వేసి రోడ్డు మీదికి వచ్చేడు.

జేబులో కాన్లన్నీ వున్నాయో లేదో తడుముకుంటూ హోటల్‌లోకి దారితీశాడు. మూలగా వున్న ఒక కుర్చీమీద కూచొని చుట్టూ చూశాడు. చాలా మంది యిడ్లీలు వేడివేడి సాంబారుతో పాటు లాగేస్తున్నారు.

హాయిగా సెలవురోజు ఎంజాయ్ చెయ్యకుండా తనకీ ఖర్మేమిటనుకున్నాడు. నిరుత్సాహంగా కాఫీ త్రాగటం పూర్తిచేశాడు.

క్యాషియర్ దగ్గరకు వెళ్ళి ఎనిమిది కానులు టేబుల్‌మీద పెట్టారు. అలా యివ్వటం ఎందుకో తనకే బాగాలేదు. తనని చూచి, తన కానని చూచి క్యాషియర్ ఎందుకో అదోవిధంగా నవ్వేడు.

భానుమూర్తికరికాలిమంట నెత్తికెక్కింది. సాంబారు మొహమూ వాడూనూ తననిచూచి నవ్వుతాడూ! తన దగ్గిర డబ్బు లేక అలా యిచ్చే ననుకున్నాడు కాబోలు. మనసులోనే తిట్టుకున్నాడు.

తన దగ్గిర నిజంగా డబ్బులు లేక పోయినా ఎదుటిమనిషి అలా అనుకున్నాడేమో నన్న ఊహ భానుమూర్తికి మహా చిరాకు కలిగించింది.

బయటకొస్తూ సిగరెట్టుకోసం జేబులో చెయ్యి పెట్టాడు. అవి కూడా ఐపోయినయ్. డబ్బులు లేకపోవటం ఎంత అవస్థగా వుంది ఇవ్వాళ, అనుకున్నాడు.

రోడ్డుమీద కొచ్చేడు. రోడ్డుమీద జనం అంతా హడావిడిగానడుస్తున్నారు. ఉసూరుమంటూ భానుమూర్తి అటూయిటూ చూస్తూ నడుస్తున్నాడు.

ఇంతలోనే అతనికి గోడమీద వున్న ఒక పోస్టర్ కనిపించింది. అది కొత్తగా వచ్చిన ఇంగ్లీషు పిక్చర్ "మిలియన్ పౌండ్ నోట్."

భానుమూర్తి మళ్ళీ మళ్లీ చూచాడు ఆ పోస్టర్ వంక. ఈ పిక్చర్ కోసమే తను చాలా రోజులనుంచి ఎదురు చూస్తున్నది. మార్క్ ట్వేన్ కథ! ఎటూ కాని టైంలో వచ్చిందే. డబ్బులేవు. మిలియన్ పౌండ్ నోట్ పోగొట్టుకోవాల్సిందే. థియేటరు వాడు "ఒక రోజు మాత్రమే" అని వేశేడు. ఇంకోరోజుంచితే వాడి తాత సొమ్మేమన్నా పోయిందా!"

భానుమూర్తికి ఒక్కసారిగా విచారం పెలుబికింది. తన దగ్గిర ఈ రోజు డబ్బులేక పోవడం మూలాన ఎంత యిబ్బందిగా వుంది మరి! ఇది పిల్లి ప్రభావమా? కాదు. కాకూడదు. తన దగ్గిర డబ్బులు నిన్నటితోనే ఐపోయినయ్. పిల్లేం చేయగలదు. దాని మొహం! అని సమాధానం చెప్పుకున్నాడు.

విచారంలో మునిగిపోయిన భానుమూర్తికి సడన్‌గా ఒక మధురమైన చక్కని తీయని ఊహ తోచింది.

తన జేబులో యిప్పుడొక ఐదు రూపాయల నోటువుంటే ఎంత బాగుంటుంది?

బాగుండదు మరీ! చాలా బాగుంటుంది. అద్భుతంగా వుంటుంది. మిలియన్ పౌండ్ నోట్ చూసెయ్యొచ్చు.

ఇలా ఊహా ప్రపంచంనుండి వాస్తవిక ప్రపంచంలోకి పడేటప్పటికి ఎవరో అంటున్నారు. "కొత్త కళ్లుపెట్టుకు నడవరాదటయ్యా? మీద కొచ్చి పడతావ్" అని.

భానుమూర్తి అయోమయంగా చూచేడు. ఒక్క క్షణం ఆగేక తెలిసింది. తానప్పుడు రోడ్డు మధ్య వున్నాడని, ఆ మాటలు తన్ని గురించేనని, ఆ సమయంలో అతనెందువల్లో ఆ మాటలని అంతగా పట్టించుకోలేదు.

భానుమూర్తి మళ్ళీ ఆలోచిస్తున్నాడు.

తన దగ్గర ఐదు రూపాయలుంటే చాలా బావుంటుంది. కానీ తన కెలా లభిస్తాయి ఐదు రూపాయలు. ప్రస్తుత పరిస్థితుల్లో తనకి డబ్బు లభ్యమవటానికి రెండే రెండు మార్గాలున్నాయ్. ఒకటి, ఎక్కడన్నా దొరకాలి. ఈ మార్గం మీద భానుమూర్తి కసలు నమ్మకం లేదు. చిన్నప్పుడెప్పుడో అతను ఓ అణా పారేసుకున్నాడు. ఆ రోజే అతనికి బేడ దొరికింది. బాస్నెలా వుంటుందో చూద్దామని ఆ బేడని ఎక్కడో దూరంగా పారేశాడు. అంతే! అప్పటికి యిప్పటికి అతని కెన్నడూ డబ్బులు దొరకలేదు. దేర్‌ఫోర్, ఈ మార్గం లాభం లేదు, అనుకున్నాడు భానుమూర్తి.

ఇక పోతే, ఎవరన్నా అప్పివ్వాలి. తన కెవరు అప్పిస్తారు? తనకు పరిచయమున్న వాళ్ళందర్నీ ఒకొక్కరినే జ్ఞాపకం తెచ్చుకుంటున్నాడు.

ఎవరిస్తారు? రామ్మూర్తి. వాడిమొహం వాడేమి యిస్తాడు. శంకరంగాడు, అసలు యివ్వడు. ఇక పోతే, యిస్తే గిస్తే ఒక్క వెంకటేశంగాడు యివ్వాలి. ఈ మిగిలిన వాళ్ళంతా, తన దగ్గర పుచ్చుకునే వాళ్ళేతప్ప యిచ్చేనాథుడే లేడు.

తను చూస్తూ, చూస్తూ మిలియన్ పౌండ్ నోట్ వదులుకోలేడు, వెంకటేశం దగ్గర ఎలాగైనా ఒక ఐదు రూపాయలు సంపాయించాల్సిందే. భానుమూర్తి దృఢంగా నిశ్చయించుకున్నాడు.

వెంకటేశం యిల్లు చాలా దూరం. అయినాసరే. తప్పదు. ఎవడికోసం. వడినైనా సరే వెళ్ళాల్సిందే.

భానుమూర్తి త్వరగా అడుగులు వేయటం మొదలు పెట్టేడు.

తాను వెంకటేశం యింటికివెళ్ళి చాలా రోజులవుతోంది. ఇంత కాలానికి వాడింటికి వెళ్ళి, అప్పడు గతే ఏమీ అనుకోడు కదా!......ఆ! వాడలా అనుకునే స్వభావము కలవాడు కాదులే. వాడోక చిన్న పొలిటీషియన్. పట్టుకుంటే వదిలి పెట్టడు. ఎదుట మనిషి వింటున్నాడో లేదో అనైనా గమనించకుండా పొలిటిక్స్‌తో బోర్ చేసి వదిలి పెడ్తాడు. అందుకేకదా! వాడింటికి తాను తరచు వెళ్ళంది. కాని యిప్పుడు తప్పదు. అవసరం తనది కనుక.

వెంకటేశం యింట్లో అడుగు పెట్టగానే వాడే కనిపించాడు, హాల్లో పేపరు చదువుతూ.

"కమాన్ భాయ్. కమాన్. కూచో" అన్నాడు పేపరు బల్లమీద పెడుతూ. తనెందుకు వచ్చాడో కనుక్కోకుండానే మొదలు పెట్టేడు.



హైదరాబాద్‌లోని వై. ఎం. సి. ఏ. హాలులో స్వాతంత్ర్య వార్షికోత్సవం రోజున ఆంధ్రఉద్యోగి కళామండలివారు ప్రదర్శించిన 'మురికి పేటలు' అనే నాటకంలో విశ్వేశ్వరరావు పాత్ర నటించి ప్రేక్షకుల అభిమానం చూరగొన్న శ్రీ వేణు.

"చూశావటోయ్ పేపర్. నెహ్రూ మన కెంత అన్యాయం చేశాడో. మనం, యింత మంది వున్నామా!, దేశంలో వున్న పెద్ద రాష్ట్రాలలో మనది ఒకటా!, కాని ఏం లాభం, సెంట్రల్ కేబినెట్‌లో మన రిప్రజెంటేషన్ లేదు." ఈ ధోరణిలో అరగంట సాగింది ఉపన్యాసం. భానుమూర్తి కసలు వీటిలో ఇంటరెస్టు లేదు. ఈ అరగంట సేపు, "ఊఁ ఆ!" అనటం తప్ప ఇంకేమీ చెయ్యలేకపోయాడు.

అరగంటపైన బోర్ చేశాక అప్పుడు విచారించాడు వెంకటేశం, భానుమూర్తి ఏస్థితిలో వున్నదీనూ.

"ఏం! భాయ్! పొద్దున్నే వచ్చావ్? ఏమిటి సంగతి" అన్నాడు, పేపర్ లోకి చూస్తూనే.

"అమ్మయ్య!" నిట్టూర్పు విడిచాడు భానుమూర్తి. ఎంత హాయిగా వుందీ ప్రశ్న. ఇటువంటి ప్రశ్నకోసమే తాను అరగంట నుంచీ నిరీక్షిస్తున్నది. భానుమూర్తికి ప్రాణం లేచి వచ్చింది.

"నీతో చిన్న పనుండే వచ్చానోయ్," అన్నాడు. ఏమిటన్నట్టు చూశాడు వెంకటేశం.

"పెద్ద పనేమీ కాదనుకో, ఓ ఐదు రూపాయలు అవసరంగా కావాలి, ఇస్తావేమోనని..." సందేహిస్తూనే అన్నాడు భానుమూర్తి.

వెంకటేశం ఒక్క నిముషం ఆలోచించి "ఉండు ఇప్పుడే వస్తాను," అని లోపలికెళ్ళేడు.

డబ్బు తెస్తాడు కాబోలు. భానుమూర్తి ఆనందంతో ఉప్పొంగి పోయాడు. అతని ఊహలో మిలియన్ పౌండ్ నోట్ మెదిలింది.

పొద్దున తన కెదురైన పిల్లికూడా తన మీదేమీ పనిచెయ్యలేక పోయింది. తనెంత పవర్‌ఫుల్! భానుమూర్తి సంతోషం పట్టలేక పోతున్నాడు.

ఇంతలోనే, వెంకటేశం బయటికి వచ్చాడు, ఇంకేదో పేపర్ చంకలో పెట్టుకుని.

"ఆ! ఏమిటన్నావ్? ఇందాక?" అన్నాడు.

భానుమూర్తి క్రుంగిపోయాడు. తను యిందాక చెప్పినది, వినిపించుకున్నట్టు లేదు.

"ఆ! ఏమీ లేదు. ఓ ఐదు రూపాయలు కావాలి అన్నాను" అన్నాడు మళ్ళీ, వెంకటేశం ముఖకవళికలను పరిశీలిస్తూ.

కాని వెంకటేశం ముఖంలో పెద్ద మార్పేమీ కనుపించలేదు.

"సారీ బ్రదర్. నాదగ్గర కూడా లేదు.



అయిదురూపాయల నోటు

నాకూ నెలాఖరేగా. రెండురోజులాగితే యిస్తా" అన్నాడు తాపీగా, కుర్చీలో కూర్చొంటూ.

భానుమూర్తికి పటరానికోపం వచ్చింది. ఇంతసేపూ కూచోబెట్టి వీడు చెప్పే సమాధానం యిదా? పైగా రెండురోజులాగితే యిస్తాట్ట. వెధవ రెండురోజులాగితే వీడిచ్చేదేమిటి? తనే యిస్తాడు కావాలంటే. ఇంతసేపూ వీడి గ్యాస్ విన్నందుకే యివ్వచ్చునే!

తప్పదు కనుక, బలవంతాన కోపం తగ్గించుకొని "అయితే యిక నేవస్తా!" అన్నాడు నీరసంగా.

"శుభం" అన్నాడు, వెంకటేశం కుర్చీలోంచి లేవకుండానే.

భానుమూర్తి రోడ్డుమీద కొచ్చిపడ్డాడు. టైముచూశాడు; పది అవుతోంది. అప్పుడప్పుడే ఎండ చురచురమంటోంది.

భానుమూర్తికి కోపంగానూ, విచారంగాను వుంది, ఇంతదూరం వచ్చి ఫలితం లేకపోయిందే అని. వెంకటేశం ఇలా చేస్తాడని తానెన్నడూ అనుకోలేదు. తానెంత ఆశాభంగము పొందింది తలుచుకుంటుంటే, భానుమూర్తికి కోపం పెలుబికిపోతోంది.

ఆముదం తాగినముఖంతో నడక ప్రారంభించాడు. ఊరిచివర అవటంవల్లనేమో అక్కడ అట్టే జనంలేదు. నీరసంగా నడుస్తున్నాడు భానుమూర్తి.

కొద్దిదూరం వెళ్లేక, భానుమూర్తియొక్క నీరసం, విచారం అన్నీ ఒకసారి ఎగిరిపోగల దృశ్యం ఒకటి కనబడింది. అతను సంతోషంతో ఉక్కిరిబిక్కిరి అయ్యాడు.

పొద్దుటినుంచి తాను దేనికోసమైతే తపిస్తున్నాడో, దేనికోసమని యింతదూరం కాళ్ళీడ్చుకుంటూ వచ్చాడో, ఆ అయిదురూపాయల నోటు! సున్నని సిమెంటురోడ్డుమీద, గాలివల్ల అటూ యిటూ నాట్యం చేస్తోంది. మడతలు విడిన ఐదురూపాయల నోటు భానుమూర్తికది నిజమో భ్రమో తెలియటం లేదు. ఒకసారి గిల్లుకుని చూశాడు నిజమే. భానుమూర్తి కదిప్పుడు మిలియన్ పాట్ నోట్ విలువ చేస్తుంది.

ఆ ఐదురూపాయల నోటు కనిపించడం నిజమేనని తేల్చుకోగానే, భానుమూర్తికి గుండెలు, గబగబా కొట్టుకున్నయ్. అటూ యిటూ చూశాడు. మనుషులెవరన్నా వున్నారేమోనని, ఎవరూ కనుపించలేదు. గబగబా రెండడుగులు ముందుకువేసి, ఆ ఐదురూపాయల నోటును, తొందరగా పంట్లాము జేబులో వేశాడు. ఆ సమయంలో భానుమూర్తి ఏదో దొంగపని చేస్తున్నాడిలా ఫీలైనాడు.



★ స్నేహితులు ★

ఒకడు: "కోటి విద్యలు కూటి కొరకే"

రెండో: "దయయుంచి పేర్లు చెప్తారా? నా తత్వానికి సరిపడే విద్య ఏదైనా ఉంటే నేర్చుకుంటాను."

* * *

ఒకడు: కవిగారు ఇంట్లో ఉన్నాడా?

రెండో: ఇలాంటి ప్రయోగాలు ఆయనకు గిట్టవు!

* * *

ఒకడు: డబ్బు అడిగినప్పుడల్లా అబద్ధాలాడుతావేమయ్యా!

రెండో: ఇకమీదట నా చేత అబద్ధాలాడించ బోకండి బాబూ! మీకు పుణ్యముంటుంది!

* * *

ఒకడు: వాడ్ని చూచినప్పుడల్లా అలా బెదిరిపోతావేం?

రెండో: నేనేం బెదిరిపోవటం లేదు. వాడే నన్ను బెదరగొడ్తున్నాడు.

* * *

మొదటి: (విసుక్కుంటూ) ఇందాకటినుంచి తిరుగుతున్నాను. అయిదు రూపాయిల నోటుకు చిల్లరే దొరకలేదు.

రెండో: అరే! నీవు చిల్లరకోసం అడిగావా? నేను చేబదులు అడుగుతున్నావనుకున్నాను! ఇవిగో ఐదు రూపాయిలు" అంటూ తీసిస్తాడు.

ఎల్. వెంకటేశ్వర్లు

మొదటి: (అందుకుంటూ)నోటు రేపిస్తానులే బ్రదర్! నిన్న తొడుక్కున్న చొక్కా-జేబులో పర్సు తీయటం మర్చేపోయాను.

* * *

ఒకడు: నేను ఆ 400 పేజీల ఇంగ్లీషు పుస్తకాన్ని నాల్గురోజుల్లో తెలుగులోకి అనువదించాను. ఇదివరలో ఇదే పుస్తకాన్ని ఒక ప్రఖ్యాత కవి 4 సంవత్సరాలు తంటాలుపడి అనువదించాడట.

రెండో: మహానుభావుడు. ఆయన తంటాలు పడి మీపని చాలాసులభం చేశాడనుకుంటాను.

* * *

ఒకడు: మన స్నేహితుల్లో ఎవరిదగ్గరైనా చిల్లరగా పది రూపాయిలుంటే యిప్పించరా!

రెండో: (ఆలోచన నటిస్తూ) బ్యాంకిలో దొరకవచ్చు

* * *

ఒకడు: ఎప్పుడూ చెడిపోయే ఆ గడియారం చేతిన పెట్టుకొని తిరగకపోతే హాయిగా రైలుచక్రాల కింద పెట్టరాదుట్రా!

రెండో: ఏం? రైలుచక్రాల కింద పడితే రిష్టువాచి బాగుపడుతుందంటావా?

* * *

ఒకడు: నీ ఉద్యోగం పోయిందిటగా!

రెండో: అబ్బే ఎక్కడికీ పోలేదు. ఆఫీసులోనే ఉన్నది.

★ అయిదురూపాయలనోటు ★

ఈ పనిచేసి రెండడుగులు ముందుకు వేశాడో లేదో, పక్కనున్న సందులోంచి, రామ్మూర్తి—అతని పాలిటి శత్రువులా—ఎదురయ్యాడు.

అతన్ని చూడగానే భానుమూర్తి తెగఖంగారు పడిపోయాడు. తడబడ్డాడు. తను ఐదు రూపాయలనోటు తియ్యటం వాడుచూడ లేదుకద తనదని డబాయిస్తాడేమో. వీడూ యిప్పుడేరావాలీ! భానుమూర్తి ఊరికే గాభరా పడ్డాడు.

అంతలోకే రామ్మూర్తి భానుమూర్తిని సమీపించాడు. భానుమూర్తి రామ్మూర్తి ముఖంలోకి ఒక్కసారి పరిశీలనగా చూశాడు.

"ఫరవాలేదు. తనునోటు తియ్యడం వీడు గమనించి నట్టులేదు," అనుకున్నాడు, కొంచెం స్థిమిత పడ్డాడు.

"ఏంరా! అలాచూస్తావేం గుడ్లగూబలా? నేనేలే!"అన్నాడు రామ్మూర్తి సమీపిస్తూ.

"ఆ! అబ్బే! ఏమీలేదు. ఎక్కణ్ణించి వస్తున్నావ్?" అన్నాడు భానుమూర్తి కొంచెం సర్దుకొంటూ.

"నీకోసమే తిరుగుతున్నాను. ఇప్పుడు నీరూమ్‌నుంచే వస్తున్నాను. రూమ్ తాళం వేసుందీ," అన్నాడు రామ్మూర్తి.

"నా కోసమా? ఏమిటి సంగతి"

"ఆ! ఏముంది, మామూలే అవసరంగా కావాలి, ఓ ఐదురూపాయ లిప్పిస్తా. వేమో నని మీ రూమ్‌కెళ్లేను. నువ్వక్కడలేవు. అదృష్టవశాత్తు యిక్కడ కనిపించేవ్" అన్నాడు రామ్మూర్తి.

భానుమూర్తికి యించుమించుగా తల తిరిగింది. గుడ్ గాడ్! తను ఐదురూపాయల నోటు తియ్యడంచూచి వీడిలా అడగటం లేదుకదా! ఐదురూపాయలతో ఎంతమందికి అవసరం వచ్చింది?

భానుమూర్తి ఒక నిశ్చయాని కొచ్చేశాడు "నే నెక్కణ్ణించి తెచ్చి యివ్వగలనోయ్. నెలాఖరుకదూ! నా దగ్గిర దమ్మిడికూడా లేదు," అన్నాడు పంట్లాము జేబులోంచి కర్చీఫ్‌తీసి ఎండవల్ల ముఖముమీద పట్టిన చెమట తుడుచుకుంటూ.

ఆ సమయంలో, భానుమూర్తి ఊహించ నటువంటి,-అతనికి సంబంధించినంతవరకూ-విషాద సంఘటన ఒకటి జరిగింది. భానుమూర్తి పంట్లాము జేబులోనుండి కర్చీఫ్ తీసినపుడు, దానితోపాటు ఆ దొరికిన ఐదు రూపాయల నోటు, జేబులోంచి క్రింద పడింది.

ఆ విషయం వెంటనే భానుమూర్తి గ్రహించాడు. అతని గుండెలు గబగబా కొట్టుకున్నయ్. ఆ నోటు రామ్మూర్తి చూస్తే ఇంకేమన్నా వుందా? ఇంతకు పూర్వమే, తను, తనదగ్గిర దమ్మిడికూడా లేదనిచెప్పేడు అటువంటప్పుడు, తన జేబులోంచే ఐదు రూపాయలు క్రిందపడడం, అతనుచూస్తే ఏమనుకుంటాడు? తనని గూర్చి దురభిప్రాయం ఏర్పడదూ!

అదృష్టవశాత్తు రామ్మూర్తి ఆనోటుక్రింద పడటం చూచినట్టులేదు.

"అయితే లేదన్నమాటేగా? వస్తా!" అన్నాడు రామ్మూర్తి వెళ్ళిపోవటానికి వెనక్కి తిరుగుతూ.

భానుమూర్తి గుండెలు గబగబా మళ్ళీ ఓసారి కొట్టుకున్నయ్. కాని ఈసారిసంతోషంతో! రామ్మూర్తి క్రిందపడ్డ నోటును చూడకుండా వెళ్ళిపోతున్నందుకు వాడు కొంచెందూరం పోతే తానానోటును,తీసేసుకోవచ్చు.

కాని, ఇంతలోనే రామ్మూర్తి వున్నట్టుండి వెనక్కి తిరిగేడు. "ఇప్పుడు వెంకటేశం యింట్లోవుంటాడా?" అన్నాడు.

రామ్మూర్తి వెనక్కి తిరగటంతోనే, భానుమూర్తి ఉత్సాహమంతా ఎగిరిపోయింది.

"ఉండొచ్చు" అన్నాడు నిరుత్సాహంగాను, రామ్మూర్తి నోటును ఎక్కడ చూస్తాడోనన్న భయంతోను.

భానుమూర్తి అనుకున్నంతా అయింది. రామూర్తి ఈసారి ఆ నోటును, చూడనే చూసేడు. క్రిందికి వంగి భానుమూర్తి కాళ్లకు, కొంచెందూరంలో, గాలికి రెపరెపలాడుతున్న ఆ నోటును పైకితీసేడు రామ్మూర్తి. భానుమూర్తి నిశ్చేష్టుడై అలా చూస్తూవుండిపోయాడు.

"ఇది నీదికాదుకదా?" అన్నాడు రామ్మూర్తి భానుమూర్తికి ఆనోటును చూపిస్తూ.

భానుమూర్తికి ఏడుపొచ్చినంతపనైంది. ఆ నోటును, ఏముఖము పెట్టుకుని తనదని చెబుతాడు. ఇంతకుపూర్వమేగా తన దగ్గిర దమ్మిడీకూడా లేదని చెప్పింది. ఒకవేళ తనదే నని చెప్పినా వాడు నమ్మొద్దూ "ఒక్కక్షణం క్రితంవరకూ డబ్బులేద న్నాడు. ఇప్పుడీ నోటు కనుపించగానే తనదంటున్నాడు." అని వాడనుకోడూ. "ఒకవేళ తనదేనని వాడు నమ్మినట్లయితే డబ్బులుంచుకునికూడా యిందాక లేవన్నాడు." అని తనమీద దురభిప్రాయం ఏర్పడదూ వాడికి?

వెల్లవేసిన ముఖంతో ఏమీఎరగనట్టూ "ఏదీ, ఇదా? అబ్బే నాదికాదు. అసలు నాదగ్గిరెక్కడున్నాయ్ డబ్బులు పోవడానికి," అన్నాడు భానుమూర్తి లోలోపల ఏడ్చేస్తూ.

"థ్యాంక్ గాడ్! నేనివాళ ఎవరిముఖం చూచేనో అదృష్టంబాగుంది. వస్తా. గుడ్ బై" ఐదురూపాయలనోటు జేబులో పెట్టుకుని ఇట్టే మాయమయ్యాడు రామ్మూర్తి.

"నేనెవరి ముఖం చూశానివ్వాళ!" తనలోతను ప్రశ్నించుకుంటున్నాడు, భానుమూర్తి. పావకాళంగా ఏడవటానికి అతనికిప్పుడు తీరిక చిక్కింది. "వెధవపిల్లి వెళ్ళగొట్టాలి యింట్లోంచి," అనుకుంటున్నాడతను.

జేబులోకొచ్చిన నోటుపోయిందే. ఆ వెధవ! రామ్మూర్తిగాడు తనకు ఎదురవకుండా వున్నట్లయితే ఆ నోటు తనకే దక్కేది.

ఏమైతేనేం పోయింది ఐదురూపాయల నోటు "ఆ! పోక, దొరికిన సొమ్ము వుంటుందా, ఏమిటి?" అని స్థిమితపడదల్చుకున్నాడు భానుమూర్తి.

సందుమలుపు తిరిగేటప్పటికి ఎదురుగా గోడమీద పోస్టర్ కనుపించింది.

"మిలియన్ పౌండ్ నోటు"

"ఒకరోజుమాత్రమే."


దాన్ని చూచేసరికి మళ్లీ ఒక్కసారి దుఃఖం పెల్లుబికింది భానుమూర్తికి. అది రోడ్డుకాబట్టి లోలోపలే బావురుమన్నాడు.

దోవలో అనుకుంటున్నాడు భానుమూర్తి రూమ్‌కెడుతూ, "పోయింది ఐదు రూపాయల నోటా? మిలియన్ పౌండ్ నోటా?" ★



పాపాయి నవ్వు

—ఫొటో: టి. జి. కృష్ణరావు, రాజమండ్రి.]



"నా తల్లి క్రిష్ణమ్మ
నడకలోనే వుంది
తెలుగు వయ్యారాల తీరు
తెలుసుకోండోయ్ తెలుగువారు.."

అంటూ మరీ గట్టిగా పాడుతున్న మా ప్రక్కింటి 'మర్ఫీ'నిసయితం డిఫీట్ చేస్తున్న "ఎవిటే ఆ నిలువుజీతం? గుమ్మం పట్టుకొని అలా వ్రేళ్లాడకపోతే, ఈ బియ్యం ముందేసుకు నేను ముసలిదాన్ని కూర్చున్నా నే కాస్తా ఏరరాదు" అన్న మా అమ్మమాటలు నా చెవుల్లో గింగురుమంటున్నాయ్.

"ఇంకెక్కడి సుశీల అత్తమ్మా! ఒంటి గంట కావస్తూందిగా; ఆ ఆపద్బాంధవుడు వచ్చి ఉత్తరం అందిచ్చేవరకూ మన లోకములో ఉంటుందా? పోన్లేపాపం! నేనేరుతున్నాగా!" అని మా వదిన వేళాకోళం కలిసిన సానుభూతివాక్యాలను పలికింది.

నాకు భగ్గుమంది. "నే నేం పోస్టుకోసం వెయిట్ చెయ్యడం లేదు" అంటూ బియ్యం ఏరడానికి కూర్చున్నాను. ఏరుతున్నానన్న మాటే కాని, దృష్టిఅంతా వీధి ప్రక్కనే వుంది. బెడ్డలు ఏరి పారవేయడానికి బదులు బియ్యమే ఏరి పారేశాను!

వదిన గమనించింది కాబోలు, "తల్లీ నీవు ఏరినంత పుణ్యం! బియ్యం కాస్తా పారవేయకు! వెళ్ళి గేట్ కీపర్ పని చెయి" అంది.

నేను కోపంతో ఏదో అనబోయేసరికి "పోస్ట్"అంటూపోస్టుమాన్ వచ్చాడు. ఇంతసేపూవున్న బింకం. సిగ్గు, కోపంఏమయ్యాయో! ఒక్క పరుగున గేటుకేసి పరువెత్తాను. వాడు నావంక ఒక జాలి చూపు చూచి, ఓ ఎలక్ట్రిక్ బిల్లు అందించాడు!!

బిక్క మొహంతో ఇంట్లోకి వస్తుంటే అమ్మ "ఏమే! మీ ఆయన ఏం రాశారు?" అంది.

"ఉండండి అత్తమ్మా. ఓ నాలుగు మార్లయినా చదివి ఆ తరువాత ఆ... ఏం రాయలేదు. అంతా బాగున్నారట- అంతే, అని తనే అనదూ?" అని వెక్కిరింపుగా అంది వదిన.

ఆ బిల్లును మెల్లిగా జారవిడిచి, మేడమీదికి తుర్రుమన్నాను.

"... నీవు తిరుగు టపా అంపలేదే, సిరిసిరి మువ్వా..." అంటూ ప్రక్కింటి రేడియో అల్లరిపాటలు పాడుతూంది. అసలేమండుతున్న నాహృదయంలో మరి కాస్తా ఆజ్యం పోసిన ట్లనిపించింది! దిండులో తలదాచుకున్నాను. ఏమిటేవిటో ఆలోచనలు సుడిగుండాల్లా నా తలలో తిరుగుతున్నాయ్. రోజు తప్పకుండా మావారి దగ్గరనించిఉత్తరం వచ్చేదే, మరి ఈవేళ రాలేదేంటి? ఎక్కువ పేజీలు వ్రాయకపోయినా ఒక చిన్న ముక్కయినా రాసారుగదా! ఎవరైనా స్నేహితులువచ్చి తీరుబడిలేకపోయిందేమో? మొన్ననంగా మొన్న నాస్నేహితులు ముసురువస్తే నేనెలాగో విలుమాచుకొని నాలుగు పేజీల ఉత్తరం వ్రాయలేదూ! వీరింతే ... "ఆ ఆరేపు రాద్దాంలే" అనుకొని వుంటారు వారికేం. మహారాజులాగ బయట తిరుగుతూంటారు.

నేనేగా ఎటూగాక ఇంట్లోపడి ఏడ్చేది—

నాతలగడ తడిసి ముద్దయింది! వీరు ఊరికెళ్ళేటప్పుడు నేనెప్పుడూ ఏడవనని మాటిచ్చాను. ఛీ... మరి ఏమిటిల్లా ఏడుస్తున్నానని నాకే అనిపించింది. ఎడిచేందుకు కూడా నాకధికారం లేదా!

మావదిన, "అన్నం తిందువుకాని రావే సుశీ!" అంటూ పిలిచింది. వెళ్ళి కంచం ముందు కూర్చున్నాను. ఆయన కిష్టమయిన బంగాళాదుంపకూర కంచంలోపడింది. దానికేసిచూస్తూ అలాగే వుండిపోయాను అన్నం కలుపుకోవడంకూడా మరిచిపోయి! ఇంతలోకి వదిన, "ఒకరోజు ఉత్తరం రాలేదని అంతగా బెంగపడుతున్నావే; ఈమాటు మా తమ్ముడు వస్తే, బాగా చెప్తానులే. అన్నం తిను" అని బుజ్జగిస్తున్నట్లు ఎగతాళి చేసింది!

ఇంతలో గేటువద్ద సైకిల్ బెల్ 'టింగ్' మంది. మా 'ప్రభు' ఎదురెళ్ళి, ఏంటో తెస్తున్నాడు "అక్కయ్యా మరి, మరి... నీకో జాబొచ్చిందే...ఇదుగో నే!" అని నాముందు జారవిడిచి పరుగు తీశాడు.

"నీకోసమే నే జీవించునది..." అనే సినిమాపాట వినిపిస్తూంది! ★



'పూలకోసం'

—ఫొటో: జె. రామకృష్ణశాస్త్రి, సాగర్.]

సమాన ఉజ్జీలు

పాత్రలు:

భాగ్యమ్మ— తల్లి
సూర్యం— భాగ్యమ్మ కొడుకు
శాంత— ఆమె కూతురు
జానకి— సూర్యం చేసుకోవాలనుకొన్నామె
రత్నారావు—శాంత చేసుకొందామనుకొన్నవాడు

[ఒకరోజు రాత్రి సుమారు పదిగంటల ప్రాంతాల్లో, భాగ్యమ్మ గారింట్లో]

సూర్యం: అదిసరేగాని అమ్మా, నాన్నగారేరీ?

భాగ్యమ్మ: అదిగో, మన కామరాజు లేడూ ఇందాక వచ్చి, అదేదో ఊళ్ళో ఓ సంబంధం ఉంది, చూద్దువుగాని రా, ఆవటా అని పిలుచుకెళ్ళారు.

సూర్యం: వాడో అంటగొట్టు వెధవ. వాడికేవూళ్ళో పనుంటే, ఆవూళ్ళోనే ఓ సంబంధం పుట్టుకొస్తుంటుంది.

భాగ్యమ్మ: అదేమిట్రా ఆ పెద్దమనిషిని పట్టుకొని అలా అంటావ్? ఏణ్ణర్థంనుంచీ, కానీ డబ్బడక్కుండా, మనకోసం సంబంధాలు చూసిపెడుతున్నాడు గదా...

సూర్యం: ఏడిశాడు. వాణ్ని నమ్ముకొంటే మనమిక శాంతపెళ్లి చేసినట్టే. అదిగాదమ్మా. ఇంతదేశంలో, శాంతకు తగ్గ మొగుడే దొరక లేదా?

భాగ్య: దొరికితే మనకేమన్నా ముచ్చటా ఏమిట్రా నాయనా; దాన్నలా ఉంచడానికి? ఎక్కడికెళ్ళినా అంతంతమాత్రంగానే ఉంది. మీ నాన్నగారు, ఎంతకాలంనుంచి చూస్తున్నారు గాదు!

సూర్యం: నాన్సెన్స్. తెలుగుదేశంలో ఆడపిలలకు భర్తలు దొరకడంలేదంటే ఏమనుకోవాలి... దేశం అంత గొడ్డుబోయిందని నేననుకోను.

భాగ్య: ఎక్కడికెళ్ళినా కట్నాలు... వంగి లేవలేని చవటకు పదివేలు. ఆ సూర్నారాయణ కొడుకు కేశవులు మూడుసార్లు యప్పే తప్పాడా—మొన్నో సంబంధం వస్తే, పదిహేనువేల దగ్గిర్నుంచీ, ఆ పెద్దమనిషి బేరం పెట్టాడుట.

సూర్యం: మొగాడు పెళ్లికాకుండా ఎన్నేళ్ళున్నా ఎవ్వరూ ఏమీ అనరు. ఆ పనే ఆడది చేసినప్పుడు, అందరూ ఎందుకాడిపోసుకొంటారో నాకర్థం గాకుండా ఉంది.

భాగ్య: అంటే-నువ్వనేదేమిట్రా?

సూర్యం: ఆఁ-మరేంలేదు. వడ్లగింజలో బియ్యపుగింజ. ముప్పయ్యేళ్ళు నెత్తికొచ్చాయి. బియ్యే పాసయ్యాను. ఇచ్చే దిక్కు లేకగానీ, కలక్టరుగిరీ వెలిగించగలను. అయినా నా పెళ్ళిని గురించి నువ్వుగానీ నాన్నగానీ ఆదుర్దాపడకపోతే మానె - కనీసం అనుకొన్నట్టుగా కూడా లేదు.

భాగ్య: అదేమిట్రా సూర్యం! నువ్వేదో మాకు పరాయివాడివైనట్టు మాట్లాడుతా

రావూరి భరద్వాజ

వేంరా? అంకొచ్చే సంబంధం దొరికితే నీకు మాత్రం పెళ్లిచేయాలని మాకు లేదూ?

సూర్యం: అందొచ్చే సంబంధమన్నదానికి ఓఅర్థమంటూ లేదా యేమిటి? నాకీమధ్య సవాలక్ష సంబంధాలు తారసపడ్డాయి.

భాగ్య: మాతో మాటమాత్రమన్నా అనలేదేంరా?

సూర్యం: మరి మీరు అందొచ్చే సంబంధమో అని గోలకెత్తుతుంటిరి. అదేమిటో నాకు తెలియందే, ఈ పురాణమంతా నేను విప్పి కూచోలేదనా నువ్వనేది?

భాగ్య: పోనీ నీకు నచ్చినపిల్లను పెళ్లాడరా! మేమేమీ కాదనం—సరేనా?

సూర్యం: (నవ్వి) మన సమాజం బాగా జబ్బుపడ్డదమ్మా! ఈస్థితిలో దీనికి మంచిచెడ్డలూ, న్యాయాన్యాయాలు, జాతిగా తెలియకుండాపోయినయ్. ఎందుకంటున్నానంటే...

(దూరంగా కారు ఆగినచప్పుడు)

సూర్యం: (ఆశ్చర్యంగా) ఇంతసేపూ శాంత ఇంట్లోనే ఉన్నదనుకున్నాను.

(కారు తలుపు వేసిన ధ్వని. 'గుడ్ బై... టాటా'...అని శాంత అంటుండగా కారు కదిలిపోతుంది...)

భాగ్య: ఇదేమిటే తల్లీ! ఇంత పొద్దుపోయిందాకా ఉన్నావ్?

శాంత: వాళ్ళ ఊర్మిళ పిక్చర్‌కి తీసుకెళ్ళిందమ్మా!

సూర్యం: వెక్కసంగా ఊర్మిళ నాన్నకు కారున్నట్టు నాకు తెలీదు. పాపం మధ్యాన్నమే కొన్నాడల్లేవుంది.

శాంత: ఊర్మిళ కారెక్కాలంటే, వాళ్ల నాన్నే కారు కొనాలని నాకు తెలీదు. దాని తరఫు బంధువులెవరికీ కారుండగూడదా ఏమిటన్నాయ్.?

సూర్యం: ఓ, దివ్యంగా ఉండొచ్చు.

శాంత: మరింకేం—అన్నట్టు నాన్నేడే అమ్మా?

భాగ్య: ఆ కామరాజు, అదేదోఊళ్ళో, ఓసంబంధమున్నదంటేనూ, వెళ్ళారు.

శాంత: ప్చ్. నాన్నో పిచ్చిమనిషి.

భాగ్య: అదేమిటే నీయమ్మకడుపు బంగారంగాను. మీఅన్నా చెల్లెళ్ల ధోరణి చూస్తుంటే...

సూర్యం: కాకపోతే ఏమిటమ్మా! ఇప్పటికి సంవత్సరంనరనుంచీ, ఆ కామరాజు భజనచేశాం. ఫలితం ఏమన్నావుందా!

భాగ్య: సూర్యం, నువ్వు వెయ్యి చెప్పు, లక్ష చెప్పు. ఆ కళ్యాణం ఘడియ, అలా నెట్టుకురాందే నువ్వూ నేనూ ఏమీచేయలేం. తోచీతోచక, ఆపెద్దమనిషిని మనంఆడిపోసుకోవడంగాకపోతే ఆమాగల్లు సంబంధానికేం తీపర మొచ్చిందీ?

సూర్యం: శాంతమీద మనకేమన్నా పగ ఉంటే, దాన్ని మరోలా తీర్చుకుందాం. అంతేగానీ, దాన్నో రెండో పెళ్ళివాడికిచ్చి చేతులు దులుపుకోవడానికి నేనొప్పుకోను.

భాగ్య: అంతగా ఒప్పుకోనివాడివి. నువ్వే దానికొమూడుముళ్ళూ పడేట్టుచూడరా.

శాంత: ఈ దిక్కుమాలినగొడవకిక అంతూ పొంతూ ఉండదా యేమిట్రా? పెళ్ళి భోజ

నాలుచేసి రాగూడదూ?

భాగ్య : లేమరి—లేవరా సూర్యం వెళ్ళి కాళ్లు కడుక్కునిరా! నువ్వే శాంతా?

శాంత : నేను ఊర్మిళ గారింట్లో తిన్నాను.

సూర్యం : అయితే నేను కాళ్లు కడుక్కొస్తాను...

(సూర్యం దూరంగా వెళ్లాక భాగ్యమ్మ తగ్గుస్వరంలో అదో రహస్యంలాగా...)

భాగ్య : శాంతా ఇందాక ఆకారులో వచ్చినవాళ్ళెవరే?

శాంత : ఊర్మిళ.

భాగ్య : ఆ పిల్లకు కారు నడపడం వచ్చునే?

శాంత : వచ్చు—ఉహు—రాదు. వాళ్ళ మామయ్య నడిపాడు.

భాగ్య : ఇంతదాకా ఆపిల్లను తెచ్చిన దానివి, పోనీ మనింట్లోకి రమ్మనకపోయావా అలా వీథిలో వదిలేసిరావడం ఏం బావుందే?

శాంత : రమ్మన్నాను. ఆయనగారే ఎందుకో భిడియపడుతున్నాడనుకొంటాను.

భాగ్య : (దిమ్మరపోయి) ఆయనా?—అదేమిటే శాంతా, ఆకార్లో ఊర్మిళలేదూ?

శాంత : అబ్బబ్బబ్బబ్బ... నీ యక్షప్రశ్నలతో నా ప్రాణాలు తోడేస్తున్నావ్ నేను చెప్పను ఫో.

భాగ్య : ఓసి నీ తలపుండు పుచ్చ. ఎంత పని చేశావే! ఎవరికంటన్నా పడితే ఇంకేమన్నా ఉందా? పెళ్ళి కావలసినదానివిగదా? ఇలా పరాయి మగాళ్లతో...హవ్వ తండ్రీ!

శాంత : నువ్విట్లాంటిదానివి గనకనే, ఆ రత్నారావును మనింటికి తీసుకురాలేదు.

భాగ్య : ఆ తద్దినం ఇంకా కొంపలో గూడా ఎందుకూ? రేపు వాణ్ణి గుమ్మంలో కాలు బెట్టమను చెబుతా—

శాంత : ఏం చేస్తావో చూస్తాను. రేపు ఆయనగార్ని కాఫీకి పిలిచాను; ఊర్మిళా, ఆయనగారూ వస్తున్నారు.

సూర్యం : (దూరంనుంచి) అమ్మా.—

భాగ్య : (దగ్గరగా) ఓసి భడవా (బిగ్గరగా) ఓయ్, వస్తున్నాను.

* * *

సూర్యం : ఇంతకీ మీకా కథ ఎందుకు వచ్చిందో చెప్పారు కాదు.

జానకి : మీకంతగా బావుండలేదు గదూ?

సూర్యం : బావుండటం సంగతి దేవుడెరుగు. దాన్ని చదువుతున్నంతసేపూ, ముళ్లమీద కూచున్నట్టు మహాబాధ పడిపోయాను జానకీ!

జానకి : అదేమిటండీ?

సూర్యం : కాకపోతే యేమిటీ జానకీ ఆ కథ? ప్రారంభంలో నే ఓ అబ్బాయీ, అమ్మాయీ, తయారు. వాళ్లిద్దరూ కాస్సేపు ఏమిటేమిటో మాట్లాడేస్తారు. ఎందుకో నవ్వుతారు. ఎందుకో ఒకరివంక మరొకరు, తియ్యగా చూసుకొంటారు. మధురంగా ఆలోచిస్తారు. వాళ్ళ శరీరాలనిండా, తేనె సోనలు ప్రవహిస్తాయి... అలా నాలుగైదు పేజీలపాటు ప్రేమించుకొని చివరికి పెళ్లాడేస్తారు. మరీ, ఆ హీరో ప్రకాశరావు...

జానకి : పూర్ ఫెలో......

సూర్యం : ఎగ్జాక్ట్లీ జానకీ. మరి-అంతగా ఉన్నవాడేమీ కాదాయె. ఆ హీరోయిన్ ఏమిలేమో, బోలెడంత ఆస్తికి అధికారిణాయె. అందులోనూ కథకు అనుకూలంగా, ఆ తండ్రికి, ఒక్కగాను ఒక్క కూతురాయె; ఆ తండ్రి బోలెడంత సంస్కారం ఉన్నవాడా; కూతురంటే ప్రాణాలువిడుస్తాడా; తెలిసో తెలియకో ఆ పిల్ల, ఆ ప్రకాశరావును చేసుకొంటానంటే, సంతోషంతో, దభీమని ఒప్పేసుకొంటాడా?—ఇలాంటి చచ్చుకథ నీకెందుకు వచ్చిందో నాకు తెలియకుండాఉంది.

జానకి : (నవ్వి) మీ అనుభవానికది దూరంగా ఉండవచ్చు. కానీ లోకంలోని అందరి అనుభవాలూ, మీ అనుభవాల్లాగే ఎందుకుండాలి?

సూర్యం : ఉండనవసరంలేదుగానీ జానకీ-నువ్వేమన్నా చెప్పు. నాకుమాత్రం ఏమీ నచ్చలేదు. మరీ—ఆ హీరో, హీరోయిన్లు కలుసుకొన్న సందర్భం, మహాబోరుగా ఉంది. అమాంతం, హీరో వెళ్ళి, ఆ హీరోయిన్ గదిలో తిష్ఠవేసి,—ఏమిటిది? ఎంత అన్నాచురల్ గా ఉంది.

జానకి : కాదు. చాలా నాచురల్ గా డీల్ చేశాడు. అంతదాకా దేనికి సూర్యం? మనిద్దరం ఇప్పుడు—ఇక్కడ కలుసుకోవడంలో నాచురాలిటీ లేదని నీకనిపిస్తున్నదా?

సూర్యం : దానికీ, దీనికీ సాపత్యమేమిటి జానకీ.

జానకి : నామట్టుకు నాకు బోలెడన్ని పోలికలు కనిపిస్తున్నాయి. ఆ కథకుడెవరో మనసంగతి బాగా తెలిసినవాడే అయి ఉంటాడు. లేకపోతే, ఇంత వాస్తవికంగా అంతాచూసినట్టు రాసిఉండడు.

సూర్యం : నువ్వేదో అంటున్నావు గానీ......

జానకి : నేననడంగాదు సూర్యం. మా నాన్నకు నేనూ ఒక్కదాన్నే. మా తాతగారు దివానిరీచేసి బోలెడంత సంపాదించాడు. అదృష్టవశాత్తూ మా నాన్న చదువూ సంస్కారమూ ఉన్నవాడు.

సూర్యం : అయితే ఆ కథలో అర్ధసత్యం ఉన్నదన్ని ఒప్పుకొంటున్నాను.

జానకి : చచ్చాంపో, ఇంకా నీకు మిగిలిపోయిన అనుమానాలేమిటి స్వామీ?

సూర్యం : సవాలక్షఉన్నాయ్, నీలాంటివాళ్లు-ఉన్నంతమాత్రాన్నే, ఆ కథ మంచి కథకాదు. అలాంటివాళ్ళు ఉండరనీ నేననను.

జానకి : (గోముగా) ఊఁ ఫో సూర్యం. ప్రతిదానికీ నువ్వింతే. అన్నీ నాచేత చెప్పించాలంటావ్? (ముద్దులుగుమస్తూ) ఎందుకమ్మా నీకంతపట్టుదల?

సూర్యం : ఎవరైనాగానీ జానకీ, తొందరపడి ఓ నిర్ణయానికి రావడమన్నా, తరవాత పశ్చాత్తాపపడటమన్నా నాకు గిట్టదు.

జానకి : అలాంటి అవసరం నాకులేదు సూర్యం. అథవా ఏమన్నా ఉంటే, నీకే ఉండాలి.

సూర్యం : ఈ పాయంత్రం చాలా బావుందిగదూ.

జానకి : ఊఁ.

సూర్యం : అలా కాస్సేపు నడుద్దామా?

జానకి : ఏది, నీచెయ్యిలా ఇవ్వు సూర్యం.

సమాన ఉజ్జీలు

సూర్యం: ఇకమీదట నన్నలా పేరుతో పిలవకూడదు మరి.

జానకి: అబ్బ, పో సూర్యం. నువ్వెప్పుడూ యింతే.

సూర్యం: అదిగో, మళ్ళీనా.

* * *

భాగ్యం: ఇదిగో, మిమ్మల్నే...(బిగ్గరగా) వచ్చేటప్పటికి మరీ పొద్దుపోతుందేమో. పోనీ భోంచేసి వెళ్ళకూడదూ!

(దూరంనించి అడుగుల చప్పుడు దగ్గరయాక)

సూర్యం: ఎక్కడికమ్మా, నాన్న అలా హడావుడిగా వెడుతున్నాడు?

భాగ్య: సీతాపతిగారింటికి ఎవరో చుట్టాలొచ్చారట...

సూర్యం: అయితే నాన్న వెళ్ళడమెందుకు?

భాగ్య: ఆడపిల్లను కన్నతరవాత ఎక్కడికైనా వెళ్ళాలిరా నాయనా! ఆ చుట్టాల్లో ఎవరో కుర్రాడున్నాడట. చూసొద్దామని వెళ్ళారు.

సూర్యం: వాడెలాంటి తేభ్యమో మరి.

భాగ్య: ఎలాంటివాడైనా, కాలం కలిసి రానప్పుడు వచ్చినట్టు ఒప్పుకోవాలి. మహారాజుబిడ్డను చెయ్యాలనే మాకూ ఉంది. ఐతే మరి తూగిచావద్దూ!

సూర్యం: ఏమో, దాని అదృష్టం బాగుంటే, మహారాజుబిడ్డే దొరుకుతాడేమో మనకేం తెలుసే అమ్మా.

భాగ్య: అందా నీకారాతే ఉంటే. ఇంతకాలంనించీ తిరుగుతున్నాంకదా, ఒక్క సంబంధం- అందొచ్చేది ఒక్కటన్నా దొరక్కుండా ఉంటుందా?

సూర్యం: దొరక్కపోవడమేం ఖర్మం. ఆ యింజనీరుగారబ్బాయికేం తీసిరమొచ్చింది!

భాగ్య: ఉభయఖర్చులూ గాక, పాతికవేలు కట్నం కావాలట. ఇంకా ఆడబడుచు లాంఛనాలంటూ ఉండనే ఉన్నాయి. మన్ని తెగనమ్మినా అంతరాదు.

సూర్యం: డబ్బు సంగతి కేంగానీ, ఆ కుర్రాడు నీకూ నచ్చాడంటే అమ్మా?

భాగ్య: ఆ పిల్లాడికేమి(టోయ్), సూర్యం, దవ్వచెక్కలాంటివాడు. తండ్రి బోలెడంత సంపాయించాడు. ఒక్కగా నొక్కడు. తల్లి తరపునకూడా బాగా ఆస్తిఉందట. యమ్మెస్సీయో ఏదో చదువుతున్నాట.

సూర్యం: వాడి ఖరీదు పాతికవేలన్న మాట. ముష్టి పాతికవేల రూపాయలకోసం, వాడు ఎలాంటి కురూపినైనా పెళ్ళాడ్డానికి సిద్ధపడతాడన్నమాట!

భాగ్య : మన ముఖాన్నే పొద్దుపొడిచిందట్రా సూర్యం! ఇప్పుడీ పద్ధతి లోకమంతటా ఉన్నదేగా.

సూర్యం : నాన్నకూ, నీకూ ఇష్టమైతే, ఆ సంబంధం శాంతకు చేద్దామా అమ్మా? అన్నట్టు మరి– శాంత అభిప్రాయమేమిటో గూడా కనుక్కోవద్దూ?

భాగ్య : (దిమ్మరపోయి) ఏమిట్రా నువ్వంటున్నది?

సూర్యం : ఏమీ లేదు. శాంతకు ఆ యింజనీరుగా రబ్బాయినిచ్చి చేదాం.

భాగ్య : ఛీఛీ. ఇన్నేళ్ళొచ్చాయి, ఎవరితో ఎట్లా మాట్లాడాలోగూడా నీకు తెలియదు...ఎంత అమాయకురాలైనా, కన్నతల్లినిరా. నాతోనట్రా నువ్వు హాస్యమాడ్డం?

సూర్యం : (ఆశ్చర్యపోయి) హాస్యమాడానా? అదెప్పుడు? ఇంటిల్లపాదికీ వచ్చిన సంబంధం చేసుకొందామనడంలో హాస్యమేముందే అమ్మా?

భాగ్య : కాకపోతే.

సూర్యం : (నిట్టూర్చి) అమ్మా మనకేదో సరుకు కావాలి. అందుకోసం బజారంతా తిరిగాం. కావలసింది దొరకలేదు. దొరికిన చోట మన కందుబాటులో లేని ధర లు చెప్పారు. కొనలేకపోయినందుకు, చాలా కాలం బాధపడ్డాం. అదృష్టవశాత్తూ, మనకు డబ్బు సరిపడా దొరికింది. ఇప్పుడా వస్తువుని కొందామని నేను అన్నాననుకో, ఇందులో హాస్యమనేదేముంది?

భాగ్య : మరి – డబ్బుమాటేమిటి?

సూర్యం : ఇదే ఇంతకాలంనుంచీ నేనూ ఆలోచించాను. అందరూ ప్రవాహంలో పడిపోతున్నప్పుడు, మనం మడిగట్టుకొని లాభం లేదు. నలుగురితోబాటు నారాయణా. ఇంజనీరుగారబ్బాయి పాతిక వేలకు అమ్ముడుపోతున్నాడు, నేనంతకంటే పెద్దమొత్తానికే అమ్ముడుపోతున్నాను.

భాగ్య : ఓరి – మరి ఇంతకాలం నాతో మాటమాత్రమన్నా అనలేదేమిట్రా?

సూర్యం : ఇప్పుడంటుంటేనిగదా. జానకి వస్తుతః మంచిపిల్ల, ఇంటర్ గావును చదువుతున్నది. వెనకకట్టుకు పోయినంత ఆస్తి ఉంది. వీటన్నిటికీతోడు ఆపిల్లకు నేనంటే ఎందుకో వచ్చాను. ముద్దొచ్చినప్పుడే చంక నెక్కాలి. అందుకే వచ్చే నెల్లో మేమిద్దరం పెళ్ళాడుదామనుకొంటున్నాం. ఈలోగా నాన్న నోసారి ఆ ఇంజనీరుగారింటికి కెళ్ళిరమ్మను. శాంతగ్గూడా ఆ వస్తువు నచ్చితే, మరో పది వేలదాకా పాటపెంచమని, నాన్నతో చెప్పు. ఎమ్మెస్సీ చదివిన ప్రాణిని పాతిక వేలకు కొనడమంటే లాభసాటిబేరమే ననుకొంటాను. పనిలోపనిగా శాంత ఉద్దేశం గూడా కనుక్కొంటే పోతుంది. ఏదీ? ఇంట్లోంచి ఊడిపడదేం?

భాగ్య : ఆ ఊర్మిళగారింటికి కెడతానని వెళ్ళిందిరా!

సూర్యం : ఎనిమిది కావస్తున్నదిగదా, ఇప్పటిదాకా ఊరేక్కపోతే పెందరాడే ఇంటికి రాగూడదూ?

* * *

శాంత : మరి నేను వెళ్ళొస్తాను రత్నారావుగారూ! ఎనిమిది కావస్తోంది.

రావు : అని తప్పుకోవాలని చూస్తున్నారే గాని, నే నడిగినదానికి సమాధానం చెప్పారు కారు.

శాంత : నేను చెప్పడానికేమీ లేదండీ! ఇరవై యేళ్ళొచ్చినా ఓ ఆడపిల్లకు పెళ్ళి కాలేదంటే, దానికి సవాలక్ష కారణాలుంటాయి.

రావు : అన్ని కారణాలూ చెప్పమని మిమ్మల్నడిగానా?

శాంత : అడక్కపోయినా, చెప్పకపోతే ఆ సమస్య బొత్తిగా అర్థంకాదు.

రావు : పోనీ, దాన్నర్థం చేసుకొనే అవకాశం నాకు మీరు కలిగించకూడదూ?

శాంత : (నిట్టూర్చి) ఏమిటోనండీ, చూడగా చూడగా నాకు వెనకటి కాలమే మంచిదేమో ననిపిస్తోంది. ఆ రోజుల్లో ఆడవాళ్ళకిన్ని చదువులూ లేవు. ఈ రకమైన ఆలోచనలూ వాళ్ళకుండేవి కావు.

రావు : ఆడవాళ్ళయి ఉండిగూడా మీరిలా అంటుంటే నాకెంతో ఆశ్చర్యంగా ఉంది.

శాంత : నేనన్నదాంట్లో ఆశ్చర్యపడవలసిందేమీ నాకు కనిపించడం లేదు రావుగారూ! చాలామంది, ఆ కాలంలో, ఆడవాళ్ళు, ఘోరయాతనలు పడ్డారంటున్నారు గానీ, నామట్టుకు నాకు అదేమంత సత్యంగా కనిపించడంలేదు. తల్లీ దండ్రీ ఓ సంబంధం తెచ్చేవారు. తాతురుకు ముడెట్టేవారు. ఆపిల్ల ఆ మొగాడితో అలా నే కాపరంచేసేది. ఆకాలంలో ఆడపిల్లల పెళ్ళిళ్ళు చేయడంతోపోలిస్తే, ఇప్పటి పెళ్ళిళ్ళ నేమనాలి? ఈకాలపు కుర్రాళ్ళకు చదువుసంధ్య లక్కర్లేదు. అటే రూపురేఖలూ అవసరంలేదు. కావలసిందల్లా కట్నం. పాతిక వేలుంటే ఎలాంటిఓతైనా చెల్లుతుంది. యాభై వేలుంటే మరి అడగనే అక్కర్లేదు...

రావు : ఈ సమాజమంటే మీకు చాలా కోపమనుకొంటాను. అవునుగదూ?

శాంత : సమాజమనేది ఆకాశంలోంచి ఊడిపడ్డదానిలా మాట్లాడకండి. మనమంతా సమాజమే!

రావు : (నవ్వి) అంటే మనమీద మనమే కోపగించుకొంటున్నామన్నమాట!

శాంత : అది తప్పని నేననుకోను రావుగారూ! దీన్ని కోపం అనకండి. ఇంకేదన్నా పేరుబెట్టండి.

రావు : అవును. మీరన్నమాటా నిజమే!

శాంత : డబ్బుతోనే ఆడపిల్లల జీవితాలు, సుఖపడటమో, కష్టపడటమో జరుగుతున్నప్పుడు, మీ ప్రశ్నకు నేనేమని సమాధానం చెప్పమంటారు?

రావు : మీకు మొగవాళ్ళంటే కోపమూండి?

శాంత : ఉన్నా, నాకోపం, ఎవరికీ చెరుపుచేసేది కాదనుకొంటాను!

రావు : పోనీ–ఈ సంగతన్నా చెప్పండి... అంతగా పరిచయంలేని వ్యక్తి, మీ పట్ల చొరవతీసుకోవడాన్ని మీరొప్పుకుంటారా?

శాంత : (నవ్వి) మీరు చిత్రంగా మాట్లాడతారు రావుగారూ! ఆ వ్యక్తెవరో, ఆ మహానుభావుడు తీసుకొనే చొరవేమిటో తెలియందే, నేను ఒప్పుకొనేదీ లేనిదీ ఎలా చెప్పమంటారు?

రావు : మాటవరసకు నేనే ఉన్నాననుకోండి—నిజానికిది మీ వ్యక్తిగతవిషయం. కానీ, దీంట్లో నాకూ ఎంతో ఆసక్తి ఉంది.

శాంత : చెప్పండి. వినగలిగినంతవరకూ వింటాను.

రావు: మనిషన్న తరవాత ఏవో కోరికలూ, ఆలోచనలూ ఉండటంకద్దు. అవునుగదూ?

శాంత : పోనీ–మనం కాస్తంత సూటిగా మాట్లాడుకొందాం.

రావు : మీరేమన్నా బాధపడతారేమోనని, అనుమానిస్తున్నాను.

శాంత : అయినా మునిగిపోయిందేమీ లేదండీ! మనిద్దరం కలకాలం ఒకచోట ఉండబోవడంలేదు. మరో పావుగంటకల్లా నేను మా యింటికి పోతున్నాను. రేపు సాయంత్రం మీరు మెయిలెక్కబోతున్నారు.

రావు : కలకాలం ఒకచోట ఉండడమనేది నా ఇష్టంమీదనే ఆధారపడిఉంటే, నిరభ్యంతరంగా దానికి అంగీకరిస్తాను. కానీ, అవతలివారి అభిప్రాయమేమిటో తెలుసుకోకుండా నా ఉద్దేశాన్ని బైట పెట్టడం ఏమంత మర్యాదగా ఉండదనుకొంటాను.

శాంత : అవతలివారికి ఎలాంటి అభిప్రాయాలయినా ఉండనివ్వండి. మీ ఉద్దేశాలను మీరు బైటపెట్టుకోవచ్చునే!

రావు : అవుననుకోండి. (నీళ్ళు నములుతూ) ఇంతకన్నా స్పష్టంగా చెప్పడం నాకూ చేతకాదు మరి.

శాంత : (నిట్టూర్చి) ప్చ్. నిజంగా నేనిక్కడకు రాకుండా ఉండవలసింది.

రావు : (హడిలిపోయి) ఏం? నేనేమన్నా పొరబాటుగా అన్నానంటారా?

★ సమాన ఉజ్జీలు ★

కాంత : మీ సంగతి కాదు రావుగారూ! నేనే, చేతులారా ఓ స్నేహితురాలితో విరోధము తెచ్చుకోవలసి వస్తున్నందుకు బాధపడుతున్నాను.

రావు : ఊర్మిళను గురించేనా మీరంటున్నది?

కాంత : అవును. చాలా కాలంనుంచీ కలిసి మెలిసి ఉంటున్నాం. దాపరికాలు లేకుండా బ్రతికాం. అలాంటి ఊర్మిళ రేపట్నించి నాముఖంగూడా చూడదు.

రావు : మీకు అసూయగా ఉందా?

కాంత : అది ఊర్మిళ వంతు. ఈ సంగతి తెలిశాక అది నన్నెంత ఆడిపోసుకొంటుందో మరి.

రావు : ఇంతకాలం స్నేహం చేసిగూడా మీరు ఊర్మిళను గురించి తెలుసుకొన్నదిదేనా?

కాంత : ఎదటివాళ్ళను అర్థం చేసుకోవటమన్నది, వాళ్ళ సంస్కారాన్ని బట్టే ఉంటుంది. ఏమో—మీరన్నటు, ఊర్మిళను నేనంతగా అర్థం చేసుకోలేదేమో?

రావు : ఇప్పుడే వస్తానని, మనిద్దర్నీ ఒంటరిగా వదలి వెళ్ళిందిగదా...

కాంత : ఓసి—రేపు నాకు కనిపించనివ్వండి. చెవులు పిండుతాను.

రావు : రేపు దానికేదన్నా ప్రెజెంట్ చేదా మనుకొంటున్నాను.

కాంత : ఉత్తినే ప్రెజెంట్ చేస్తారా?

రావు : నీలాంటి మంచి అమ్మాయిని చూసినందుగ్గూడా ఇవ్వకపోతే ఎలా?

కాంత : పొద్దుపోయింది. మరి వెడతాను. నోనో, అవసరం లేదు. మీ సాయం లేకుండానే నేను లేస్తాను.

రావు : ఇలా ముందు సీట్లో కూర్చో కాంతా. మీ ఇంటిదగ్గర దిగబెడతాను.

* * *

భాగ్య : ఇంతటికీ నువ్వంటున్న దేమిటి తల్లీ? మేము చెప్పినట్లు వింటానంటావా? ఇక నీ ఇష్టమే ఇష్టమంటావా?

కాంత : ఇందులో ఇష్టపడటానికీ ఇష్టపడక పోవటానికీ ఏముందే అమ్మా? ఎప్పుడన్నా మీరు చెప్పినమాటను కాదన్నానా?

భాగ్య : అందుకని ఇప్పుడంటా నంటావేమిటే?

కాంత : అది కాదమ్మా!

భాగ్య : అయినప్పుడు, ఆ ఇంజనీరుగారబ్బాయిని చేసుకోరాదూ. మొదట్లో నువ్వు సరేననే అంటివిగా.

కాంత : అప్పుడన్నానేమో నాకు జ్ఞాపకం లేదు. ఎప్పుడో తలెగరేశానని, ఇప్పటికీ నా ప్రాణం తీస్తుంటివి—ఇప్పుడు వద్దంటున్నానుగా మానుకోరాదూ?

భాగ్య : నాన్న వెళ్ళి మాట్లాడొచ్చారు.

కాంత : పాతిక వేలకు అమ్ముడుపోయిన ఆ మనిషిని గౌరవిందడం నాకు చేతకాదు. నా మూలంగా మన కుటుంబమంతా, అల్లకల్లోలం కావడంగూడా నాకిష్టంలేదు.

భాగ : కాబట్టి ఇలాగే ఉండిపోతానంటావా?

కాంత : మొన్న మొన్నటిదాకా నాకా ఉద్దేశమే ఉండేది. రావుగారిని చూశాక మార్చుకొన్నాను. అదీగాక – నాకోసం, అన్నయ్య అలాంటి పనిచెయ్యడానికి నేనొప్పుకోను. నే నేదో కష్టపడిపోతానని, వాడో కోతిని కట్టుకోవడం ఏంబావుంటుందమ్మా?

భాగ్య : నేనైతే చూడలేదుగానీ, జానకి బాగానే ఉంటుందిటే!

కాంత : నా పెళ్ళి మనస్సులో ఉంటున్నంతకాలమూ అన్నయ్యకు ఎలాంటి పిల్లయినా, అందంగానే కనిపిస్తుంది. అనవసరంగా తొందరపడొద్దని చెప్పు. ఆ ఊర్మిళ ధర్మమా అంటూ నా సమస్య తీరిపోయింది.

భాగ్య : అయితే ఇక నీమాటే చెల్లాలంటావ్! అంతేనా?

కాంత : ఇందులో మాట పట్టింపులకోసం నేనేమీ చెయ్యడంలేదు. పాతిక వేలుపోసి కొన్న ఆ ఇంజనీరు కొడుక్కంటే ఊర్మిళ మేనమామ ఎందులోనూ తక్కువకాదు. నాలుగైదు వ్యాపారాలు చేతిలో ఉన్నాయి. చాలా ఊళ్ళల్లో బ్రాంచీలుపెట్టి బిజినెస్ చేస్తున్నాడు. బెజవాడలో అయిదు మేడలున్నాయిట. ఓ రైసుమిల్లులో మువ్వావలా వాటా ఉన్నదిట. చాలా కాంట్రాక్టులూ అవీ చేస్తుంటాడు. తండ్రిలేడు. ఒక్కడికీ పని తెమలక నానా కచాటూ పడిపోతున్నాడు. ఇదేదో అయిపోయాక అన్నయ్యను జనరల్ మేనేజరుగా వేదామనుకొంటున్నాడు...లేదా యమ్మే చదవమంటున్నాడు...

భాగ్య : ఏమో తల్లీ, నువ్వు చెప్పేది ఇలా ఉంది. వాడేమో పెళ్ళికొడుకుల్ని వేలమీద బేరం చేస్తున్నాడు. మీ నాన్నగారేమో కంపనపడ్డ కాకిలా అలా తిరుగుతున్నారు. ఇన్నిటికీ ఏమికానుందో ఆ భగవంతుడికే తెలియాలి.

* * *

సూర్యం : అమ్మా, కాంత ఇంట్లోనే ఉందా ?

భాగ్య : లేదురా నాయనా! ఇప్పుడే అలా ఎక్కడికో కెళ్ళింది.

సూర్యం : ఊర్మిళ గారింటి కెళ్ళి పోయింది ?

భాగ్య : ఏం ?

సూర్యం : రేపణ్నించీ దాన్నా గడప తొక్కొద్దని చెప్పు.

భాగ్య : అదేమిట్రా ?

సూర్యం : ఆ రావుగాడు ఊళ్లోనే ఉన్నాడా? చెక్కేశాడా ?

భాగ్య : ఇంతటికీ సంగతేమిట్రా ?

సూర్య : ఏదైతేనేంగానీ, తొందర్లోనే మేలుకొన్నాం. లేకపోతే కాంత బ్రతుకు కుక్కలూ నక్కలూ పడేవి కాదు.

భాగ్యం : అసలేం జరిగిందో చెప్పరా!

సూర్యం : మన పెద్దమ్మ కళ్లు మూసుకొంటే ఏమైనా జరుగుతుంది. నువ్వామాట చెప్పినప్పుడే నాకీ అనుమానం వేసింది. అప్పణ్నించీ కూపీలు తీస్తూనే ఉన్నా. ఇవ్వాళ ఆ చలపతి ధర్మమా అంటూ, ఈ పక్షిగాడి అసలు రంగు బైటపడ్డది.

భాగ్య : పక్షిగాడెవ్రరా? కాస్తనాకు తెలిసేట్టు చెప్పగూడదుట్రా సూర్యం?

సూర్యం : ఇంకెవరు? ఆ రావు.

భాగ్య : ఎవరన్నా వింటే నవ్విపోతారు గానీ, ఇహ చాలించు. నిక్షేపంలాంటి పుర్రాణ్ని పట్టుకొని, పక్షీ, గిక్షీ అనవాకు. కాంత వింటే ఖస్సున లేస్తుంది.

సూర్యం : మరి-వాణ్ని దేవాదిదేవుడన మంటావా ఏమిటే? వాడెంత మోసకారి కాకపోతే, మనతో ఇంత నాటకం ఆడతాడూ?

భాగ్య : ఏం నాటకమాడాడంటావురా? మరీ, నువ్వు చెప్పేదానికి, తలా తోకా ఉండదేం?

సూర్యం : వాడేదో ఇంద్రుడనీ, చంద్రుడనీ కాంత నమ్మకం. ఆ నమ్మకంతో అది నీకు బాగా నూరిపోసింది. మీరందరూ అనుకొంటున్నట్టు, ఆ రావుగాడు పేద్ద ఊడబొడిచినవాడేమీ కాదు.

భాగ్య : హవ్వ తంద్రీ.

సూర్యం : నిజం చెప్పాలంటే మనకన్నా అధముడు. వాడన్నట్టు, కాంత నమ్మినట్టు, నువ్వనాకు చెప్పినట్టు, వాడికి నాలుగైదు వ్యాపారాలూ లేవు. బెజవాడలో మేడలూ లేవు. ఉన్నాయని మనముందు బుకాయించాడు.

భాగ్య : వాడికేం ఒరుగుతుందిరా?

సూర్యం : లక్షణమైన పెళ్లాం దొరుకుతుంది. పనిపాటా లేకుండా మన ఎదానపడి ఉందామనుకున్నాడు...ఇంకా నా మాట మీద నమ్మకం లేదుకదూ? చలపతిది బెజవాడేగా వాడిచేతనే చెప్పిస్తా. సరేనా?

భాగ్య : వాళ్ళిద్దరకూ పడదేమోరా.

సూర్యం : ఎలాంటి దుర్మార్గులైనా, పీటల మీది పెళ్ళి చెడగొడతారా?

భాగ్య : ఓరీ భగవంతుడా, ఎంతపని చేశావురా? ఈ నాటికన్నా అదో ఇంటిదవుతుందిగదా అనుకొన్నాను. భగవంతుడిట్లా చేశాడు.

కాంత : (వస్తూ) ఏమిటే అమ్మా భగవంతుణ్ని తలుస్తున్నావ్? మళ్లీ ఏమొచ్చింది?

భాగ్య : కాలం, ఖర్మం, సరిగ్గా లేకపోతే ఏమైనా వస్తుంది తల్లీ!

కాంత : నేనూ అదే అనబోతున్నాను.

సూర్యం : ఏం చాలా పెందరాడే వచ్చావేం? పొద్దుపోయిందాకా ఊర్మిళ కూచో బెట్టుకో లేదూ?

కాంత : ఝుంఝూమారుతం ఇలా తిరిగిందేం అన్నయ్యా?

భాగ్య : నువ్వూరుకోవే తల్లీ!

సూర్యం : ఆ రావుగాడు వూళ్లోనే ఉన్నాడా?

కాంత : ఏం కథ?

సూర్యం : ఇంతసేపూ నువ్వు వాడితోనే తిరిగావా?

భాగ్య : తోడబుట్టినదాన్ని పట్టుకొని ఏమిట్రా ఆ అడగడం?

కాంత: ఒళ్ళు తెలియని వెధవలు ఇంకెలా మాట్లాడతారు? నువ్విలాంటివాడివి కనకనే, ఆ జానకి, నీకల్లా టోపీ పెట్టింది. ఆ సంగతి చెబుదామనే అదరాబాదరా వచ్చాను. లేకపోతే అసలు రాకనేపోదును.

సూర్యం : ఏమిటేటి నువ్వు చెప్పదామనుకొంది?

కాంత : ఇష్టం లేకపోతే వినడం మానెయ్. అంతేగాని కొక్కిరిస్తూ మాట్లాడకు.

భాగ్య : ఏమిటే తల్లీ ఆ సంగతి?

కాంత : ఆ మహాతల్లి ఎవత్తోగాని, అన్నగారిని చక్కగా బుట్టలో వేసుకొంది. ఆ పక్షి చెప్పిన ప్రతిమాటా అన్నయ్య నమ్మేశాడు. తీరా, ఇట్లా ఇట్లా సంగతని మాటవరసకు కమలతో అన్నాను. అది నెత్తీ నోరూ బాదుకొంది.

సూర్యం : కమలమ్మకు ఆ ఖర్మేం పట్టిందీ?

కాంత : దానికేం. నిక్షేపంలా ఉంది. మన ఖర్మ చూసే అది నెత్తి బాదుకుంది. అదిగాదన్నయ్యా. ఇంత తెలిసినవాడివిగదా నువ్వా జానకి మాటలన్నీ ఎట్లా నమ్మావంట?

భాగ్య : అదంతా అబద్ధమా ఏమిటే?

కాంత : కాకపోతే నిజమటే అమ్మా. లక్షాధికారి కూతురా? ఒక్కగా నొక్క సంతానమా? అదేమో అన్నయ్యకోసం పడి చస్తుందా? ఇందులో నమ్మటానికేమున్నా ఉందా? కమలదీ ఆవిడదీ ఒకే ఊరట. అందుకని దానికీసంగతులన్నీ తెలుసుట.

సూర్యం : భగవంతుడు కూడా మనకు విరోధంగానే ఉన్నాడమ్మా! నా బ్రతుకు ఎలా తెల్లవారినా, కాంత నన్నా సుఖపెడదామనుకొన్నాను. దాని సుఖంకోసం ఎన్ని బాధలైనా పడదామనుకొన్నాను. జానకి వెనక లక్షలున్నాయని నమ్మాను.

భాగ్య : కాంత అనుకొందిగూడా అదే గదుట్రా నాయనా. నువ్వేదో పాడయిపోతున్నావని, అది మహా ఇదయిపోయింది. ఆ రావుతో పెళ్లయితే, నిన్నేదో పైకి తెద్దామనుకొంది. వాడేమో అట్లా అయ్యాడు.

కాంత : (భయంతో) ఏమయిందన్నయ్యా?

సూర్యం : ఏమీ కాలేదులే కాంతా! ఇందులో మనం ఎవర్ని తప్పు పట్టడమూ తప్పే! పైవాళ్ళెవరో మనల్ని మోసం చేశారని ఆడిపోసుకుంటున్నాంగానీ, మనం చేసింది మాత్రం ఆ పనికాదా? మన మోసం బైట పడాక వాళ్ళు మాత్రం అలా అనుకోరా? అందరం ఒకటే మచ్చు. సమాన ఉజ్జీలం. ఖర్మకాలి వాళ్లి ముసుగుముందుగా తొలగిపోయింది. మనమింకా ముసుగులోనే ఉన్నాం. ఇవాళ కాకపోతే రేపన్నా మన బ్రతుకు లేమిటో వాళ్లకు తెలియకుండా ఉండదు. ఇందులో ఎవర్ని మనం తప్పు పట్టడం? ఎవర్ని మంచివాళ్లనడం? ★

[ఆలిండియా రేడియో సౌజన్యంతో]



(దేవీనవరాత్రగా



చిద్రూపిపర

· శ్రీ పురాణపం

"మాతా మరకతశ్యామా
మాతఙ్గీ మదశాలినీ
కటాక్షయతు కళ్యాణీ
కదమ్బవనవాసినీ"

అఖిలలోకాశ్చర్యకర సౌందర్యలీలా
విలాసవిభ్రమావిర్భావే!
శ్రీమ ద్దివ్యమంగళవిగ్రహే! శ్రీమద్దివ్య
కైలాసాశ్రిత...
.........శ్రీ మహావిభూతే!

అని సంబోధించి, సంప్రార్థిస్తూ, సాగించే దేవీ పూజను గూర్చిన ప్రాచీనకథా సముచ్చయం ఎంతో ఉన్నది. ఆ కథావాహినిలోని ఒకటి రెండు తరంగాలను ఆంధ్ర పత్రిక పాఠకులకు అందించే సంకల్పంతో ఈ రచన సాగుతున్నది:

మనదేశంలో వసంతనవరాత్రులు, గణపతి నవరాత్రులు, దేవీ నవరాత్రులు నేటికీ సాగుతున్న ఉత్సవాలు. సర్వ ప్రజానీకం ఈ ఉత్సవాలను పండుగలుగా చేసుకుంటూ ఉంటారు. వసంత నవరాత్రులు మన తెలుగు వారి కంత ప్రముఖ మయినవి కాకపోయినా శ్రీరామనవమినాడు సీతాకళ్యాణోత్సవాలు జరపుకోకుండా ఉండలేరు. ఆంధ్రుల ఇష్ట దైవమయిన భద్రాచలరాముడి కళ్యాణోత్సవంతో ఆరంభమవుతాయి మన నవరాత్రులు.

అనంతరం విఘ్ననాయకుని ఉద్దేశించి పూజలు జరుపుతారు. వీని నే గణపతి నవరాత్రులని వ్యవహరిస్తారు. బహుళా ఈ గణాధిపతిని అర్చించనివారు తెలుగునాట ఉండరేమో. దేవుడి అస్తిత్వంమీద అనుమానం ఉన్నవారు వినా అందరూ ఈ గణాధిపతిని పూజిస్తారు. ఈ ప్రకారంగా వసంత నవరాత్రులూ, గణపతి నవరాత్రులూ అయాక దేవీ నవరాత్రులు వస్తాయి.

శరత్కాలం ఆరంభమవుతూండగా నే, అనగా, ఆశ్వీయుజ శుద్ధపాడ్యమినాడు ఆరంభమయిన ఈ దేవీపూజ నవమివరకూ సాగుతుంది. దశమినాడు ఉద్వాసన. ఉదయ సాయంసంధ్యలలో శక్తిని పూజిస్తారు. కుంకుమతో కానీ, తామరపూలతో కానీ సహస్రనామార్చన సాగుతుంది. లక్ష్మీరూపంలో, లలితారూపంలో, సరస్వతీ రూపంలో—ఆరాధకుల అభీష్టానుసార రూపంలో ఉభయసంధ్యలలోనూ శక్తిని ఉపాసించటం జరుగుతుంది. ఆ సేతుశీతాచల పర్యంతం సాగే నవరాత్రదీక్ష యిది ఒక్కటే ననిపిస్తుంది.


వసంతనవరాత్రులలో కుష్కించిన గోదావరి గణపతి నవరాత్రులకు వరదల బురదలతో బీభత్సం సాగించి శరన్నవరాత్రులకు కలకదేరి నిర్మలంగా గంభీరంగా ప్రవహిస్తూ ఉంటుంది. వరదలు విచ్చిన నేలలు శ్రావణ ప్రావృణ్మేఘాలతో సంతృప్తములై సస్యశ్యామలస్థితికి అనుకూలములై శారద జ్యోత్స్నలలో పులకిస్తూ ఉంటవి. తెలుగు పడుచు వసంతఋతువులో మంగళస్నాతయై మాంగళ్యాన్ని ధరించి శ్రావణ వర్షావేశ మంగళగౌరిని అర్చించి, శరన్నవరాత్రులలో దేవీపూజకు పతిపజ్ఞ చేరుతుంది. శారద రాత్రు లుజ్వల లసత్తర తారకహారపంక్తులతో నవయౌవనులకు మనోహ్లాదకారకములు గదా!

ఏవంవిధవిశిష్ట విశేషలక్షణాలతో అలరారే శారదవేళలో జరిగే దేవీపూజను గురించినవివరాలు పురాణాలలో చాలచోట్ల లభిస్తాయి. అష్టాదశపురాణాలలోనూ, భారతభాగవతాదులలోనూ దేవీ ప్రస్తుతి ఉన్నది. ప్రత్యేకించి 'దేవీ భాగవతం' అని గ్రంథమే ఉన్నది. ఈ దేవికి సంబంధించిన 'మంత్రశాస్త్రం' కావలసినంత ఉన్నది. దేవి నే శక్తి అని వ్యవహరిస్తారు. 'శాక్తేయం' ఒక మత శాఖగా కూడా విలసిల్లింది. ఈ శక్త్యర్చనలో 'బలి' కూడ ఉన్నది, సురాది మత్తపదార్థాల నివేదన సాగిస్తారు వారు. వీరిని వామాచారులని వ్యవహరిస్తారు. అద్వైతమతాన్ని పునః స్థాపన చేసిన ఆచార్య శ్రీ శంకరభగవత్పాదులు శాక్తేయులను పరాజితులను చేసినా షణ్మతాలలో శాక్తాన్నికూడా ఆయన అంగీకరించి పీఠాలు స్థాపించాడు. అందుచేత శక్తి సర్వ సత్తాకమయిన దేవత. ఈ శక్తిని అనేకులు అనేక విధాలుగా భావించారు. సృష్టి, స్థితి, లయ కార్య నిర్వహణార్థం త్రిమూర్తులను సృష్టించిన శక్తియేది ఉన్నదో అదే ఈ 'శక్తి' అని సిద్ధాంతం. త్రిమూర్తులకూ అతీతమయిన శక్తి ఉపాసన ఆ త్రిమూర్తులతో నే ఆరంభమయినట్లు పౌరాణిక ప్రమాణా లున్నవి. అందుచేత ఈ పూజాసంవిధానం ఏనాడు ఆరంభ మయినదీ అంటె అది సృష్ట్యాది నాడే అని సమాధానం వస్తుంది. కాలాన్ని గురించిన మీమాంస మనకవసరం లేదు. ఇక పూజా విధానం : ఇది దేశ కాలాభిరుచులను అనుసరిస్తూ ఉన్నది. ఎలా ఉన్నా శబ్దవాచ్యమయిన చిచ్ఛక్తిని ఆరాధించటంలో ఏదో అలౌకిక మయిన ఆనందాన్ని మానవుడు పొందుతూండటంవల్ల నే ఈ దేవీ పూజ యింత కాలంగా సాగుతున్నది.




మైసూరు నగరంలోని ప్రఖ్యా
సరస్వతీపూజరోజున ఈవిధంగా ప్ర

ధ)



ండ రామమూర్తి

దక్షిణ భారతంలో కంటె ఉత్తర భారత ములో ఈ దేవి పూజ విరివిగానే కాదు, విశిష్టంగా సాగుతుంది. ముఖ్యంగా వంగదేశీయులు కాళిని ఉపాసించటంలో విపరీత



ీ గాయత్రీ ఆలయం :
ద్యుద్దీపాలతో అలంకరిస్తారు.
ఫొటో: టి. వాసుదేవన్.]

శ్రద్ధ ప్రదర్శిస్తారు.

అథకథా ప్రారంభః—

మహావిష్ణువు క్షీరసాగర శయనుడై యోగ నిద్రలో ఉన్న వేళ, ఆ దేవుని నాభి దేశం నుండి కమలం ఉద్భవించింది. నారాయణుని నాభి ప్రదేశమునుండి ప్రభవించిన పద్మంలో నుండి ప్రజాపతి (బ్రహ్మ) ప్రాదుర్భవించినాడు. ఆది నారాయణుడు యోగ నిద్రా ముద్రలో ఉన్నప్పుడే ఆయన కర్ణమూలాలలోనుండి మధు, కైటభుడు అనే రాక్షసు లిద్దరు జన్మించారు. పుట్టిన యిద్దరూ పాలసముద్రంలో నిర్విరామంగా విహరిస్తూ తమ జన్మానికీ, ఈ క్షీర సాగరానికీ ఆధారమయిన దేమిటి? అని ఆలోచించ సాగారు. కారణం లేని కార్యం ఉండదు గదా! అనే విచికిత్సతో వారు సాగుతూండగా విచిత్రమయిన శబ్దం ఒకటి వారికి వినిపించింది. ఆ శబ్దాన్నే వారు పునశ్చరణ చేసుకుంటూండగా సర్వ సృష్టికీ మూలహేతువయిన ఆది శక్తి వారి మహా దీక్షకు సంతృప్తి చెంది అశరీర వాక్యాలతో వారికి వరా లిచ్చింది. స్వచ్ఛంద మరణం వారు కోరుకున్నారు. అంగీకరించింది అంబ.

అంతతో వారు తమ కెదురుగా కనబడ్డ బ్రహ్మనుమాచి హేళనగా, "ఈ పద్మాసనాన్ని అధిష్ఠించడానికి వీరులయిన వారికే అర్హత ఉంది. నువ్వు వీరుడ వయితే మాతో పోరాడి జయించు" అని జబ్బ చరిచారు. ప్రజాపతి అయోమయావస్థలో పడి మహా విష్ణువును ప్రార్థించాడు. విష్ణువు మధు—కైటభులతో యుద్ధం ఆరంభించాడు. అయిదు వేల సంవత్సరాలు పోరాటం సాగినా విజయశ్రీని వరించిన వారు లేరు. ఆలోచించి మహావిష్ణువు విశ్రాంతికోరి తపస్సు ప్రారంభించాడు. ఆదిశక్తి ప్రత్యక్షమయి మహా విష్ణువు అభిమతాన్ని తెలుసుకొని చిరునవ్వుతో యుద్ధానికి నడిపించింది. ఆదినారాయణుడు మహానందంతో ఆహవరంగంలోకి ప్రవేశించాడు. మధు—కైటభులు అనక్రమపరాక్రమంతో మహావిష్ణువును బాధించసాగారు. చేయునది లేక హరి యోగమాయవైపు కన్ను లెత్తేసరికి దయావార్ధి యయిన మహాశక్తి మనోజ్ఞ మందస్మితంతో మధు - కైటభుల కన్నుల ముందు నిలిచి వారిపై తన చంచలదృష్టిని ప్రసరించసాగింది. అపూర్వ సౌందర్య సుషమాలంకృత అయిన ఆదిశక్తిని అవలోకిస్తూ అచేతనులయారు. అసుర సోదరులు. ఆ అదను చూచి మాయామానుషవిగ్రహుడు మధు - కైటభులను సమీపించి "మీకేంకావాలి. కోరుకోండి" అన్నాడు.

అసురుల అహంకారం అవధులు దాటింది. ఆదినారాయణుడు అవమానిస్తున్నట్టే అనిపించిందా యోధవరేణ్యులకు. వారు వికటాట్టహాసం చేస్తూ. "మహాయోధులమయిన మాకు నువ్వు చెయ్యగలిగిన ఉపకారం యేమిటి. అవసరమయితే మమ్మల్నే నువ్వు కోరుకో" అన్నారు.

మహావిష్ణువు మానసములో కల్హార శతములు వికసించినవి. ఆయన కనులలో కమలములు రేకులు విచ్చినవి. గంభీర వదనుడై, "మీ రిద్దరూ నా చేతుల్లో మరణించడమే నేను కోరేవరం" అని కటిస్థలం మీద చేతులు బిగించి నిలబడ్డాడు.

రాక్షస సోదరులు ఉలిక్కిపడి, ఉక్కిరి బిక్కిరై, తేరుకుని. "సరే, ఆడినమాటతప్పే అధములంకాదు కనక నీవు కోరినవరం యిస్తున్నాం. అలాగే నువ్వు కూడా మాకిస్తానన్న వరం యియ్యి. ఏమిటంటే మమ్మల్ని జలప్రదేశంలో చంపకూడదు."

అని వారి అతిబుద్ధి కుశలతకే కాక, సద్యః స్ఫురణకు కూడా పొంగిపోయారు. మధు - కైటభులనే కాక జగన్నాటక సూత్రధారి అయిన మహావిష్ణువునే సృష్టించిన యోగమాయ చిరునవ్వు నవ్వింది. ఆ చిరునవ్వును ఆకర్ణించిన మహావిష్ణువు మధు - కైటభులకు వరంయిచ్చాడు. దిక్కులు దద్దరిల్లేటట్లు వికటాట్టహాసం చేసారు మధు - కైటభులు. ఆ అట్టహాసాన్ని పరిహసించేలా విహసించాడు మహావిష్ణువు.

* * *

కలయజూచాడు మహావిష్ణువు. సర్వ ప్రపంచం జలమయంగానే ఉన్నది. ఎక్కడా పృథ్వీభాగంలేదు. సృష్టిలోనే ఆనాడు పృథ్వి లేదు. జలరూపంలోనే ఉన్నది. యోగమాయ ఆదేశానుసారం మహావిష్ణువు తొడలుపెంచి మధు - కైటభులను ఆహ్వానించాడు. మధు - కైటభులు శరీరాలు పెంచి తొడలపై స్థానం చాలదన్నారు. మహావిష్ణువు మరింత విశాలం చేసాడు – మధు కైటభులు కైవారాన్ని రెట్టించారు.

హద్దులేకుండా మహావిష్ణువు ఊరువులను పెంచేయటంతో మధు - కైటభులు మహా

దేవీనవరాత్రగాథ

విష్ణువు చేతులో పడక తప్పలేదు. (ఆది నారాయణుని తొడలపై నిహతులయిన మధు - కైటభుల 'మేధ'యే సముద్రంలో పృథ్వీభాగంగా ఏర్పడిందనీ, కనక నేమన్ను తినకూడదనీ దేవీ భాగవతం ఘోషిస్తున్నది.) మధు - కైటభులను కడతేర్చిన మహావిష్ణువు ఆదిశక్తిని అనేకవిధాల ప్రార్థించి యోగ నిద్రలోకి నడిచాడు. ఇది సృష్ట్యాదివేళ జరిగినగాథ. ఆదిశక్తి - లేదా - కాళిక, దుర్గ, పార్వతి - ఎవరయినా ఈమెయే. ఈవిధంగా ఈమెను గూర్చిన అద్భుత కథలతో నిండిన తీర్థఘట్టాలనేకాలు పురాణ క్షీరసాగరంలో గోచరిస్తాయి.

కుమారి, త్రిమూర్తి, కళ్యాణి:

ఈ దేవీపూజా విధానాన్ని వివరిస్తూ, ప్రామాణికగ్రంథమయిన దేవీ భాగవతం యిలా అన్నది;

మహావిష్ణువు చేత సృష్టి ప్రారంభవేళ అర్చింపబడిన ఆదిశక్తియే అద్యప్రభృతి సర్వ దేవ, మానవ, దానవ సంఘాల చేతనూ అంజలులందుకొంటూన్నది. ఈ దేవీ పూజ విధిగా నవరాత్రములూ సాగవలసినదే. చైత్ర శుద్ధ పాడ్యమినుండి నవమివరకూనూ, ఆశ్వ యుజ శుద్ధపాడ్యమినుండి నవమివరకున్నూ ఈ పూజచేయాలి. ఇందులో మొదటిది మన సంప్రదాయంనుంచి వైదొలగింది. మనం శరత్కాలారంభంతోనే దేవీ నవరాత్రదీక్ష సాగిస్తున్నాం.

అయితే ఈ దేవీ పూజా విధానాన్ని గూర్చి అనేకులలో అనేకవిధానాలున్నాయి. దేవీభాగవతం ఈ సంవిధానాన్ని విశదంగా యిచ్చింది. స్థలవైశాల్యందగ్గర్నుంచి వేదికా నిర్మాణంవరకూ యిస్తూ, అనంతరం దేవీ విగ్రహం—లేదా—యంత్రం విషయమై కూడా పరామర్శించింది. అయితే ఈ విష యాలలో మనకు తెలీని అంశం ఒకటి ఉన్నది. ఈ అంశాన్ని పీఠాధిపతులయిన స్వాములవార్లు మాత్రం విధిగా నిర్వహిస్తున్నారు.

సామాన్యంగా ఉభయసంధ్యలలోనూ దేవిని అర్చించటం, యథాశక్తిగా మంత్ర పుష్ప నివేదనం చేయటంమాత్రమే యిప్పటి వారనుసరిస్తూన్న విధానం. అయితే 'పుస్తక రూపిణి'గా సంభావించి సంప్రార్థించే దేవీ పూజమాత్రమే యిది. అలాకాక సర్వశక్తి స్వరూపిణి అయిన పరాశక్తిని అర్చించేవారు ఉభయసంధ్యలలోమాత్రమేకాక త్రికాలాల లోనూ అర్చించాలనీ, ఏకభుక్తంగానీ, ఉప వాసంగానీ అవశ్యమనీ, అధశ్శయనదీక్ష ముఖ్యమనీ అంటూ, ఈ తొమ్మిదిరోజులూ కన్యలను కూడా పూజించాలని ఆదేశించింది దేవీ భాగవతం.

ఈ కన్య లెవరో వివరిస్తూ జనమేజయ చక్రవర్తికి సర్వపురాణేతిహాస మీమాంసా కర్తయయిన శ్రీ వేదవ్యాస మునీంద్రుడు ఇలా అన్నాడు:

1. రెండేండ్ల వయస్సుగల కన్య—'కుమారి.'

ఈ కుమారిని పూజించినవారికి దారిద్ర్యం, దుఃఖం ఉండవు.

2. మూడేళ్ళ వయస్సున్న బాల—'త్రిమూర్తి.'

ఈ త్రిమూర్తిని అర్చించినవారికి త్రివర్గాలతో ఆయుఃప్రాప్తి లభిస్తుంది.

3. నాలుగు వత్సరాలుగల కన్యకామణి 'కళ్యాణి.'

కళ్యాణీ సమారాధనం వినయ, విద్యలను ప్రసాదిస్తుంది.

4. పంచవర్షకన్య 'రోహిణి' అనబడుతుంది.

ఈ రోహిణీ పూజవల్ల ఆరోగ్యం సుష్ఠుగా ఉంటుంది.

5. ఆరేళ్ళ బాలను 'కాళిక' అని వ్యవహరిస్తారు.

కాళీ సమారాధనం శత్రువినాశనకారి.

6. సప్తవర్షములుగల కన్యను 'చండిక' అని సంబోధిస్తారు.

ఈ చండికను అర్చించినవారికి సరైశ్వర్యాలు సమకూడతాయి.

7. అష్టవర్షముల బాలిక 'శాంభవి.'

శాంభవి ప్రార్థన రాజసభా రంజనను చేకూరుస్తుంది.

8. నవవత్సర ప్రాయముగల కన్య 'దుర్గ.'

దుర్గా పూజకులకు పృథివిపై సాధ్యము కానిది లేదు.

9. పదేండ్లబాలిక 'సుభద్ర.'

సుభద్రా సమర్చనం సర్వవాంఛలను నెరవేరుస్తుంది.

ఈ కన్యకలను పూజించటంలో రోజు రోజుకీ రెట్టించుకుంటూ పోవాలని వ్యాసుడు అన్నారు. పదేళ్ళుదాటిన కన్యను 'శక్తి' అని పిలుస్తారనీ, ఈ 'శక్తి' నామక కన్యను మాత్రం పైవిధంగా అర్చించరాదనీ శాసించారు వేదవ్యాసులు.

ఈ కన్యల విషయమై విశదంగా వివరిస్తూ వ్యాసమునీంద్రు లిలా అంటున్నారు:

వయస్సునిబట్టి కుమారీ, త్రిమూర్తి, కల్యాణీ అనేపేర్లతో పిలువబడే వారందరూ ఈ అర్చనకు అర్హులుకాదు.

అర్చింపదగిన కన్య సర్వాంగాలంకృత, సంశోభితగాత్రయై ఉండాలి. ఏ విధమయిన ఆంగికలోపం ఉన్నా అది పూజా పీఠాన్ని చేరడానికి అర్హురాలు కాదు కనుక అర్చకుడు కుమారీ, త్రిమూర్తీ, కల్యాణి - ఆదిగాగల కన్యలను పూజా వేదిక ముందుకు ఆహ్వానించే ముందు ఎన్నో పరిశీలించుకోవాలి.


మరొక అంశం ఏమిటంటే - బ్రాహ్మణ క్షత్రియులకు బ్రాహ్మణియే ఆరాధ్య, వైశ్యులకు పైమూడు వర్ణములలో నెవ్వతెయైనగాని అర్చనీయ. శూద్రులకు చతుర్వర్ణములలో నేవర్ణపు కన్యయైనను పూజింపదగినదే. సర్వవిధ కార్యనిర్వహణకు బ్రాహ్మణ కన్యకలు పూజింపదగినవారు.

యుద్ధములందు జయేచ్ఛతో సాగించు పూజారికి క్షత్రియ కన్యక పూజింపదగినది.

వ్యాపారాదులందు లాభము గోరు సాధకునకు వైశ్య, శూద్ర కన్యకలారాధనీయులు.

* * *

ఈ ప్రకారంగా వివరిస్తూ సాగితే ఎంతయినా వ్రాయవచ్చు. భారతీయులకు ఉచ్ఛ్వాస - నిశ్వాసలయిన భారత - రామాయణాలలో దేవీపూజ గోచరిస్తుంది. రాముడు కిష్కింధనుండి లంకానగరానికి కదలబోయేముందు దేవీపూజ చేస్తాడు. భారతంలో చాలా చోట్ల దేవీస్తుతి కనిపిస్తుంది. అనంతమయిన విశ్వాన్నే నేత్రలీలా విలాసంతో నడిపే పరాశక్తిని అర్చించి సర్వ సిద్ధులూ పొందుదురుగాక. ★



చలచిత్ర కథలు

విక్రమార్కుడి మార్కు సింహాసనం

సిందుబాదు మనీపరుసు
కాదుకాదు బేవారుసు
నాదుమాట నమ్ముతమ్ము
డా యిది నిక్కమ్ముసుమ్ము.

(వి॥ మా॥ సిం॥)

అని కుబేరుడు గభాలున అంతర్ధానుడై పోయాడు. రాజు తిరిగి స్టుడియో గేటు దగ్గరకు వచ్చాడు.

ఘూర్ఖాని ప్రసన్నుణ్ణి చేసుకోవడం, సార్ వాల్యూ లేని పిక్చరుకి డిస్ట్రిబ్యూషన్ సంపాదించడం అంతటి కష్టం. డైలాగు మార్చేస్తాను అని పట్టుబట్టిన పెద్దనటుడిని బతిమాలి బామాలి ఆ 'మాట' దక్కించుకోవడానికి (సినిమాలోకి) దర్శక రచయితలు చూపేటంతటి నేర్పు కావాలి. మధ్యాహ్నం కాల్‌షీటు కోసమని పెంద్రాళే ఐదుగంటల కల్లా వచ్చేసిన హీరో హీరోయిన్‌లను ఆరూ, ఆమాటకొస్తే ఆరున్నరవరకు కూడా సెట్‌మీద పనిచేయించగలిగే టంతటి చాకచక్యం, మంచితనం కావాలి.

వరహాలరాజుకి ఈ సాధకబాధకాల లోతుపాతుల తీరుతెన్నుల మంచిచెడ్డల కుడి ఎడమలు కూడా తెలీవు కాబట్టి అతడు అటువంటి ప్రయత్నానికి పూనుకోలేదు. కొత్తరకం ట్రిక్కు, లేక ఉపాయం ఆలోచించాడు. ఉపాయం లేనివాణ్ణి ఊరు వెళ్లగొట్టమన్నారు.

ఐదు గజాల ఇవతల ఉండగానే వరహాలరాజు మొహంమీద చిరాకు పులిమేసుకున్నాడు. ఆపైన కీవిని తగిలించాడు. భ్రుకుటి ముడిచి ఆ మడతలో ఆలోచన ఒకటి బిగించాడు. అర్జెంటు పని ఉండి, అంతలోనే కారు దారిలో చెడినందువల్ల కాలినడకనే వెళ్ళిపోతున్న షేరుహోల్డరులాగ హడావుడిగా గేటులోకి వెళ్ళబోయాడు—ఘూర్ఖా పెట్టవలసిన సలాంకు ప్రతి సలాం విసురుతూ.

వర్ధమాన నటతత్త్వవేత్త ఘూర్ఖాకి వరహాలరాజు తాపత్రయం క్షణార్థంలో అర్థమైంది. లోపల ప్రేమ పెల్లుబికింది. దాదాపు మందహాసం చేయబోయినంత పని చేసి, ఘూర్ఖాలు, అందులోనూ డ్యూటీమీద ఉన్న ఘూర్ఖాలు నవ్వరాదన్న నియమాన్ని తలపుకు తెచ్చుకు తమాయించుకుని "కేరో కేగో" అన్నాడు కఠినంగా.

షేక్ మధ్యలో డైలాగు మర్చిపోయిన నటుడు తనంతట తనే కట్ అన్నట్టుగా, హఠాత్తుగా అపశ్రుతి పలికేసరికి ఆపి తూనాబొడ్డు అనుకుంటూ సిగ్గుపడి పాట మానేసిన కొత్తగాయకుడిలా తక్కున ఆగి హోల్డాన్

ఎస్. పార్థసారథి

అనుకుని గిరుక్కుని వెనక్కి తిరిగాడు వరహాలరాజు.

బామ్మ చెంగునున్న వేడ కాసుని దొంగతనంగా విప్పి తీసుకోబోయి అమ్మకంటబడ్డ కుర్రనాగన్నలా సిగ్గుపడి నవ్వాడు.

'ఇప్పుకోటం లేదూ, చెంగునిముడేసి పెడుతున్నానూ' అని బుకాయించి తప్పించుకోబోయిన వెర్రి నాగన్నలా మళ్ళీ నవ్వి, 'మై అంధర్ నహీ జారహేహూఁ సిర్ఫ్ దేఖ్ నా, తు ఘూర్ఖా హై మై ఆద్మీ హై' అనేశాడు గబగబ.

"నువ్వూ నేనూ కూడా మనుషులమే ఇద్దరిలోనూ సేం బడ్ రన్ అవుతోంది. అంచేత నామీద దయుంచి–"

—లోపలికి వదలిపెట్టు సోదరా అంటూ మానవుడు సాటిమానవుడికి చేసుకునే విజ్ఞప్తి పై వాక్యాల తాత్పర్యం.

భాష చాలకపోయినా ఈ భావం ద్వారపాలకుడికి కంఠతా వే. ప్రజల కష్టాలు విని విని మామూలే అనుకుని యాదాలాపంగా తీసి అవతలపారేసే మంత్రుల మనసులలాగే, చిన్ననటుల మొరలు వినివిని మామూలే అనుకుని బకాయిలగురించి పట్టించుకోని చలనచిత్ర నిర్మాతలలాగే, డైరెక్టరు వివరణలూ సలహాలూ వినివిని మామూలేఅనుకునిపట్టించుకోని పెద్దనటులలాగే, కాలుషీటు కాలిపోతోంది చప్పున రమ్మన్న టెలిఫోను మొరలు వినివిని మామూలే అనుకుని కాలక్షేపం కావటంలేదని పడుకుని ఫాన్‌లెటర్స్ చదువుని ఆనందించే బాక్సాఫీస్ స్టార్‌లలాగే, ఆ ద్వారపాలకుడు కూడా అతిసహజంగానే ఓ హో అనుకున్నాడు. హో హో అని నవ్వాలనికూడా అనుకున్నాడు. ఘూర్ఖాలు హిందీ, హిందూస్థానీ, ఉర్దూలలో పండితులు కాకపోవచ్చు. వ్యాకరణంతో రణం సాగించి దాని అంతు కనుక్కొని వారే కావచ్చు. అయినా తుం తో హో, మైతో హూఁ, వహ్ తో హై అనాలని వాళ్ళకి లీలగా తెలుసును. వరహాలరాజు తు హై, మై హై అనేశాడు. అందుకని నవ్వొచ్చింది. అయినా నవ్వకూడదని ముందరి పేరాలో అనుకున్నాడు కాబట్టి మాటతప్పనివాడు కాబట్టి ఈసారికూడా మానుకున్నాడు.

రైకో అనగానే ఆగిన రాజు భుజాన చెయ్యివేసి 'హూ తో మోటరాగయా' అన్నాడు.

రాజు కొంచెం తప్పుకున్నాడు. ఓ కారు బయటకు వెళ్ళిపోయింది. అందులో ఒకాయన విలసంగా కూర్చుని, రాజునిమాసి హేళనగా నవ్వాడు.

రాజుకి పౌరుషం వేసుకొచ్చింది. "నవ్వు నవ్వు. అలాగే నవ్వు. నీకేం నువ్వుగాక ఇంకెవరు నవ్వుతారు. అప్పనంగా బోల్డు



బ్రీజ్ టాయ్‌లెట్ సబ్బులో మాత్రమే

ఎక్‌టమర్* ఉన్నది

—అది గంటలకొద్దీ నిలవుండే పరిశుభ్రతను గలిగించును!

మీరు స్నానం చేసిన తరువాత ఎంత సేపు మరల పరిశుభ్రంగా నుందురు? బ్రీజ్ టాయ్‌లెట్ సబ్బుతో, ఆ పరిశుభ్రత గంటలకొద్దీ నిలవుండును! మీ పరిశుభ్రతను పోగొట్టునట్టి చెమట దుర్గంధముల నుండి బ్రీజ్ మిమ్ములను కాపాడుటను మీరు తెలుసుకొందురు.

ఎట్లనగా, మీరు బ్రీజ్‌తో స్నానము చేసిన తరువాత దానిలోనున్న అద్భుతమైన ఎక్‌టమర్ చాలాసేపు చెమట దుర్గంధ కారకములగు చర్మము మీది క్రిములను తొలగించును కనుక బ్రీజ్‌యొక్క పరిమళం మీ శరీరం మీద చాలాసేపు నిలవుండి మిమ్ములను చాలాసేపు పరిశుభ్రంగా నుంచును!

బ్రీజ్. ఏది కొద్దిగా హెచ్చయినా, తగినంత ఎక్కువ లాభదాయకమైనదని ప్రజలు గ్రహించారు.

జ్ఞాపకముంచుకోండి... ఒక్క బిళ్ళ చాలా కాలం పనికి వచ్చును!



*'ఎక్‌టమర్' ([illegible]) [illegible]

ఎక్‌టమర్ వైజ్ఞానికంగా శరీర పరిశుభ్రతకు సహాకరించునట్టిది

L/ 6A-X52 TL

★ విక్రమార్కుడి మార్కు సింహాసనం ★

డబ్బు, కారూ..." అని గొణుక్కున్నాడు రాజు.

'హాకో మోటర్ ఆటీ' అంటున్నాడు ఘూర్ఖా.

"నాయనా హిందుబాదూ!" అంది లావుపాటి కంఠం ఒకటి కారులోంచి.

రాజు వెనక్కి తిరిగి చూశాడు.

"స్టుడియోలో కెళ్ళాలా? గూర్ఖా వద్దన్నాడా? ఫరవాలే. కారెక్కు చెబుతా" అని తలుపుతీశాడు ఆ కంఠం తాలూకు ఆసామి.

రాజు కారులోపలకి ఆశ్చర్యపడ్డాడు.

తక్షణం ఆ కారు వెనక్కి జరిగి కుడి వేపుకి తిరిగి మళ్ళీ వెనక్కి తిరిగి ఊరి శివారు దాటి చల్లటి వల్ల నీడలమీద సాఫీగా సాగి పోయి ఒక పెద్ద చెట్టుకింద ఒక వారగా ఆగింది.

"స్టుడియోలోకి తీసుకెళ్తానన్నారుగదా" అన్నాడు రాజు ధైర్యం తెచ్చుకుని.

"తొందరేము హిందుబాదూ. ముందర నే చెప్పేది విను."

"నా పేరు హిందుబాదు కాదండి. వర హాలరాజు."

"మోస్ట్ అనో రొమాంటిక్......పోనే పోన్లే...అసలు మనం విక్రమార్కుడి మార్కు కథల్లో మనుషులం-సిందుబాదూ హిందుబాదూ ఇందులో రాకూడదు. ఇంకో సీరియల్‌లో శాస్త్రీలు కాబోలు. అయితే నేం. నువ్వే కలగాపులగం చేసేశావు. ఇందాక కారులో-ఇంకో కారులో మనిషిని చూసి నువ్వేమన్నావు? — "నవ్వు నాయనా నవ్వూ...అప్పనంగా డబ్బు, కారూదొరికితే నవ్వకేంచేస్తావు?" అని తిట్టుకో లేదూ? ఆ డైలాగు నీబాబుగాడిదనుకున్నావా? ఆమధ్య చాల్లోలుక్రితం సింద్‌బాద్ ది సెయిలర్ ఇంటి అరుగుమీద కూచుని హిందుబాద్ అనే బీదవాడు సరిగ్గా ఇలాంటి డైలాగే అన్నాడు. అప్పుడు సింగుబాదుజాలిపడి లేచి, హిందుబాదుకి తనకథ చెప్పేశాడు. అబ్బే ఇది కష్టార్జితం అనిచెప్పాడు" అంటూ గంభీరంగా ఉపన్యసించి సిగరెట్టు ముట్టించి నవ్వాడు కారు ఆయన.

"మీరేనాండి సింగుబాదు?" అన్నాడు రాజు.

'కాదు నాపేరు వీరభద్రరావు. అయామె ప్రొడ్యూసర్ని బదరీల్లా......నేనొక ప్రొడ్యూసరు బామ్మర్దిని. చాలా విట్టీగా, హ్యూమరికల్‌గా మాట్లాడతాను. మాపిక్చర్లలో కోన్ని నే నేకట్టి కవిగారికిస్తాను" అన్నాడు వీరభద్రరావు.

"మరి మీకెందుకు కోపం ఆయనన్నంటే."

'ఆయనే మా బావగారు ఆయన సిందుబాదంత మనిషి......ఎన్ని కష్టాలుపడి పెద్దవాడయ్యాడో తెలుసా?"

"తెలీదండి. ఎన్ని?" అన్నాడు రాజు ఎందుకేనా మంచిదని.

"జ్ఞాపకం లేదు. బోల్డుంటాయి ఏం. తెలిసిందా. డబ్బు ఆయనకే కాదు ఎవరికీ అప్పనంగా రాలేదు ఇది సాహసించి, కష్టించి సాధించింది. బేవార్సు అనుకుంటే ఇక్కడ పనికిరావు. పైగా నువ్వు సినిమాలో చేరే వాడిలా కనబడుతున్నావు.."

రాజు గుండె చిన్న పిల్లి మొగ్గవేసింది ఆ ఇరుకులో నే చోటుచేసుకుని.

'వీరభద్రరావుగారూ! మీ యాశీర్వచనమువల్ల నేను యాక్టరునైపోతే మీనోట్లో పిసెడు పంచదార పోస్తాను...మీరే నన్ను రక్షించాలి," అన్నాడు. రావుగారు వెకిలిగా నవ్వారు.

"ఛాన్సిస్తే పిసెకాదు మణుగు పంచదార కొని గుమ్మరించే వాళ్ళున్నారు. అయినా పంచదారేం చేసుకుంటాం లెస్తూరూ... నే చెబుతాగా ఏంకానిపొయ్యాలో. మిమ్మల్ని చూస్తే నాకు చాలా జాలేస్తోంది. ఆనక మా బావకిచెప్పి ఛాన్సిప్పిస్తానుగాని, కాస్త అర్జెంటుగా ఎన్నూరు వెళ్ళిరావాలి. పెట్రోలుకో పది హేనుంటే ఇవ్వండిచెప్తా" అన్నారు. రావుగారు ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ.

రాజు ఆ ఫీజుకట్టి ఇకిలించాడు. 'డౌను కానండి. మీరు సినిమావాళ్ళుకదా. మీదగ్గర నోట్లకి నోటు కట్టలుగా ఉండవు? కారు సీటుకిందా, టైరుల్లోపలాకూడా ఉంటాయని చెప్పాడు మా ముత్తెం?" అన్నాడు.

రావుగారు పకపక నవ్వారు. 'ఎంత పిచ్చివాడివి. ఎందుకుండవు. ఉంటాయి. అయితే అందరికీ జీతాలిచ్చుకుంటూ పెద్దసార్లకి బ్లాకుమనీ కట్టుకుంటూపోతేఅయిపోతాయి. అవన్నీ మా బావ చూసుకుంటాడనుకో. నువ్వుచెప్పినట్టు టైర్లలోనూ, కారులైట్లలోనూకూడా డబ్బు లేకపోలేదు. వెనకటి కోసు,మట్టిని బంగారంచేస్తానని చెప్పి,పాలందున్ని పంటఅమ్మి, ఇదిగోఅనలేదు? అట్లాగే టైర్లలోంచి లైట్లలోంచి, సీట్లలోంచీకూడా డబ్బు తియ్యొచ్చు."

"టైర్లతోటీ, లైట్లతోటీ, సీట్లతోటీకూడా పొలం దున్ని పంట అమ్మతారాండీ?..."

"బావుంది అందరూ పొలాలు దున్నితే ఇంక తిని కూర్చునే వాళ్ళెవరుట. టైరులోంచి డబ్బుతియడం అంటే అది కాదు. కొంతమంది పెట్టుబడిదారుల్ంటారా? తాకట్టుపారిశ్రామికులు? వాళ్ళకివిస్తే డబ్బు పుడుతుంది. అయితే, అది కష్టమే. నాకీకారు ఎరువిచ్చిన మా పిక్చరు హీరోయనుందనుకో. నామీద అట్టే నమ్మకంలేదు. అందుకని ఆవుకి నాలుగు కాళ్ళు కారుకి నాలుగు టైర్లు అని లెక్కపెట్టి గట్టిగా చెప్పిఇసుంది. సాయింత్రం ఓ టైరు తక్కువైతే ఇట్టే పట్టేసుకుంటుంది. బ్రిలియంట్ గరల్ లే. చాలా సూక్ష్మబుద్ధి... సరేకాని, కారు దిగు. రేపు సరిగ్గా ఈవేళకే ఇటురా మిగతా పాతికా పట్టుకుని. జాయనై పోదుగాని...ఉంటే యిప్పుడే ఇచ్చెయ్య" అన్నారు రావుగారు హుషారుగా.

"సార్ మరి నన్ను ఎగ్జామినేషను చెయ్యక్కర్లేదా? నాయాక్టింగు చూడరా." అన్నాడు రాజు దీనంగా.

రావుగారికి జాలేసింది. "సరే చెప్పు నీ క్వాలిఫికేషన్లు... రెండు ముక్కల్లో అయిపోవాలి. వివరాలన్నీ రేపు చెబుదు గాని" అన్నారు.

"సిక్స్ డ్రామాస్...హీరో యాక్షన్" అన్నాడు సినిమా కాలం విలువ అప్పుడే పసిగట్టేసిన రాజు.

"వెరిగుడ్... వాటారె? ఏమిటవి?" అన్నారు రావుగారు చేతిన లేని గడియారంలో టైము చూసుకుని.

'అల్పిప్ప','నువ్వేనా?'ఇదా సంఘం!!!' డి. ఇ. వో., తిథి,...ఆ...వానపాముండి. వానపాము."

అన్నాడు రాజు.

"వండ్రఫుల్. నీకొక్క వలసినదానికన్న మూడింతలు అనుభవం ఉంది. టమిల్, కానరీస్ ఫిలిముల్లోకూడా చేరిపోవచ్చు.

విక్రమార్కుడి మార్కు సింహాసనం

పోయిరా. రేపురా. నేవస్తా" అన్నారు రావుగారు కారు స్టార్టు చేస్తూ.

రాజు మనసులో సముద్ర కెరటాలు లేచి విరుగుతున్నాయి. నుదురుమీద రైళ్లు పరిగెడుతున్నాయి. పిడికిళ్ళు బిగించాడు. లాభం లేదు. ద్రోహం కూడదు అనుకున్నాడు.

"మేష్టారోయ్" అని ఒక్క గావుకేకపెట్టి చప్పట్లుకొట్టి, పరుగెట్టాడు.

కారు ఆగింది. 'ఏం' అన్నారు రావుగారు కొత్తకంగారుగా. ఊటీలో చొక్కా లేని వాడిలా, వణికిపోతున్నాడు రాజు.

"అబ్బే డబ్బుకి ఫరవాలేదు. తప్పకుండా ఛాన్సు ఇప్పిస్తా. ఒట్టు. మై బ్రదరిల్లా ఈజె ప్రొడ్యూసర్స బ్రదరిల్లా..." అంటూ ధైర్యం చెప్పారు రావుగారు.

రాజుకి దుఃఖం ఆగలేదు. "హైయా మే ఫ్రెండ్... నేను వానపాము. కాదండి... ఐమీన్..."

"బావుందోయ్ నే నన్నానా నువ్వు వానపామువని...ఇంకా నయం"

"అబ్బే మీరు కాదు సార్...అది కాదు సార్...వానపాము నాదికాదండి. మిత్రద్రోహం చేసి పెద్ద అబద్ధం చెప్పేశాను. ఈ పాపానికి పశ్చాత్తాపం లేదండి" అన్నాడు రాజు భోరున ఏడిచేసి.

"ఏం పాపం చేశావు?...నాకిచ్చినవి దొంగనోట్లా? లేపోతే మా బావకి గూఢచారిగా వచ్చావా?...వాట్?" అన్నారు రావుగారు.

రాజు తెల్లబోయాడు నోటమాటరాక.

"క్యారక్టరాక్షన్ ఆనక చెయ్యొచ్చు. డైలాగులు తరవాత చెప్పొచ్చు...ముందు నే నడిగింది చెప్పు. ఏమిటి నువ్వు చేసిన ద్రోహం" అన్నాడు.

"వానపాము నాటకంలో హీరో నేను కాదండి మా మిత్రెం. నావి మొత్తం అయిదే. 'సిక్సు అవుతాయి అని ఇదికూడా కలిపేసుకో' అన్నాడండి వాడు రైలుకొచ్చి. అందుకని నేను అబద్ధం చెప్పేసి మీకు ద్రోహం చేసేశాను" అన్నాడు.

రావుగారు విరగబడి నవ్వారు. "హారినీ, నిష్కారణంగా హడలగొటేశావే...ఇలాటి ద్రోహాలు మోసాలూ పెద్ద లెక్కా...ఎవరేనా నవ్వేస్తారు. గో..గో...కం టుమారో" అంటూ మళ్ళీ స్టార్టుచేశారు కారు.

కారు పదిగజాలు పోయేసరికి రాజుకి మళ్లీ ఓ అయిడియా వచ్చింది. గబగబ చప్పట్లు కొట్టాడు. కాని కారు ఆగలేదు.

"హారినీ విడిపేరు మనకి తెలీదే. కారూ మళ్ళీ గుర్తు పట్టలేము. ఎంతపని జరిగిపోయింది" అనుకున్నాడు. (సశేషం.)

వనితా లోకం

అతివల ఆటలపండుగ

అట్లతద్దె

పెళ్ళికాని ఆడపిల్లలకోసం ప్రత్యేకం నోములు వ్రతాలు అట్టేలేవు. ఉన్న వాటిల్లో కల్లా అతిముఖ్యమైనది సర్దా అయినది అట్లతద్దె. చిన్నా పెద్దా తారతమ్యము లేకుండా ఆఖరికి కొత్త కోడళ్లు కూడా ఆనందంతో ఆటపాటలతో గడిపే దీపండుగ. ఇది విచిత్రమైన నోము. సాధారణంగా నోములు వ్రతాలు ఆచరించేవారు అన్నం తిని ఏ పూజా చెయ్యరు. ఇది అలా కాకుండా తెల్లారకట్ల చద్దిఅన్నం అదీ పుల్లిపాయ పులుసుతో తిని గౌరమ్మను పూజిస్తారంటే విచిత్రంగా లేదూ? కానీ దురదృష్ట వశాత్తు ఇప్పుడీ పండుగ మరుగున పడిపోతోంది. ఇంకా పల్లెటూళ్ళల్లో మాత్రం దానిఛాయలు పూర్తిగా చెరిగిపోలేదు. "ఏనాడో"అనిపించే బాల్యాన్ని జ్ఞాపకము తెచ్చుకుంటూ తరగని ఐదవతన మియ్యమని పెదలు గౌరమ్మను పూజిస్తే రాబోయే గృహిణీత్వంలో ఏలాటి వదుదుడుకులూ రాకుండా చెయ్యమని గౌరమ్మకు మ్రొక్కులు చెల్లిస్తారు కన్యలు. స్త్రీలకు అంతకన్న కావలసింది ఏముంది? సంవత్సరానికి మూడుసార్లు గోరింటాకు పెట్టుకోవాలంటారు. అది ఆషాడమాసం, వుండ్రాళ్లతద్ది; ఈ అట్ల తద్దీనన్న మాట. దాదాపు ఈ మూడు వర్షాకాలంలోనే వస్తాయి. ఇలా గోరింటాకు పెట్టుకోవటము వలన కాలిగోళ్ళు చేతిగోళ్ళు పిప్పిగోళ్ళు కావనీ, గోరింటాకువల్ల గోళ్లల్లో వుండే విషక్రిములు నశిస్తాయని ఆరోగ్యశాస్త్రజ్ఞులు చెప్తారు. కాని ఆడవాళ్లు మటుక్కు అయిదవతనము కోసమే పెట్టుకుంటున్నామనుకుంటారు. ఏది ఏమైనా అట్లతద్దిరేపనగా, తలంటి నీళ్ళుపోసుకుని స్త్రీలంతా గోరింటాకు పెట్టుకుంటారు. ఆ తెల్లారకట్ల కమ్మని గడ్డపెరుగు పుల్లిపాయపులుసు గోంగూర పచ్చడితో ముత్తయిదువులంతా చిన్నా పెద్ద తారతమ్యము లేకుండా చద్దన్నం తిని చక్కగా తాంబూల మేసుకుని జడలేసుకుని ఎవరిచేతులు నోరు బాగా పండాయో అని చూసుకుంటూ ఆటలకు బయలుదేరుతారు, మరీ పెద్ద వాళ్ళయితే ఏ గవ్వలో గచ్చకాయలో తెల్లారే దాకా ఆడతారు, మిగతా వాళ్ళంతా అట్ల తద్ది ఆటలే ఆడతారు.

ఈ అట్ల తద్ది ఆటపాటలు కూడా తమాషాగానే వుంటాయి, వాటిల్లో కొన్ని క్రింద రాస్తున్నాను.

అట్లతద్దోయి-ఆరట్లోయి
ముద్దపప్పోయి
మూడట్లోయి
చీమ పచ్చిమిరప కాయి-చిర్రోచిర్రో
నీ మొగుడు కొడితేను-మొర్రో మొర్రో

ఈ పాటతో ఆరంభమైన ఆట—

బుజబుజ రేకుల పిల్లుందా బుజ్జా రేకుల పిల్లుందా—

అనేపాటతో కాని అదే అర్థమిచ్చే—

చిన్ని పిన్ని కన్నో ఏడూ—
సిరిగల గౌరి కన్నో ఏడు

అనే పాటతో కాని ఆ ఏటి అట్లతద్ది ఆటపాటలు పూర్తి చేస్తారు. మధ్యలో ఆటపాటల్లో ఏమార్పువచ్చినా చివరా మొదలూ మటుక్కు ప్రతి ఏడూ ఆపాటలుతోనే ఆడుతారు. తెల్లారగానే గౌరమ్మను పూజించేందుకు ఎవరిళ్ళకు వారెడతారు.

బి. యస్. లక్ష్మి

ఈ పండగ మగపిల్లలకోసం కాకపోయినా ఆడపిల్లలు ఇంత సర్దాగా ఆడుకుంటూంటె వూరుకోలేక పెరుగన్నానికి ఆటలకు మగపిల్లలుకూడా తయారవుతారు. చివరకు బుజబుజ రేకుల పిల్లుందా అని స్త్రీలంతా పెళ్ళిబేరాలు కుదురుస్తూంటె మగపిల్లలు మటుక్కు దూలగుండాకు పల్లేరు కాయలు తెచ్చేందుకు వెళ్ళి అప్పటికి ఆట పూర్తయి పెళ్ళి కుదర్చిన పెళ్ళి పెద్దల పని ఆ దూలగుండాకు పల్లేరుకాయలతో పట్టిస్తారు. అందుకని సరిగ్గా తెల్లారకుండానే ఆట పూర్తిచేసి మగపిల్లలొచ్చేసరికి ఎవరిళ్లకు వాళ్లు వెళ్ళిపోయేవాళ్ళము మేము.

కోమట్ల, బ్రాహ్మణుల ఇళ్ళల్లో ఆ మధ్యాహ్నమే గౌరమ్మను పూజించి అట్లతో మహానైవేద్యం పెట్టి ఆపైన భోంచేస్తారు. మిగతా కులాల్లో అలా కాదు. సాయంత్రం నీలాటి రేవుదగ్గిర గౌరమ్మను పూజించి రాత్రి చంద్రుణ్ణిమూసి కాని భోంచెయ్యరు. ఆ మధ్యాహ్నం అంతా అట్లతద్ది ఉయ్యాల ఊగుతారు. క్రొత్తగా పెళ్ళయినవాళ్ళని మొగుడుపేరు చెప్పేవరకు వుయ్యాల దిగనివ్వకుండా ఉక్కిరిబిక్కిరయ్యేలా వూపేస్తారు. ఇలా ఈనోము కన్యలు చేసుకుంటే ముసలి మొగుడు రాడనీ, పెళ్ళయినవాళ్ళు చేసుకుంటే వాళ్ళ ఐదువతనము అక్షయముగా ఉంటుందని, వాళ్లభర్తలు ఆయురారోగ్యవంతు లవుతారనీ మనపూర్వుల నమ్మకము. మరచిపోయా. ఈ నోముకి అట్లు నైవేద్యము పెట్టిన తరువాత ఒక 'ముత్తయిదువకు అట్లే వాయనమిస్తారు. ఆతరువాత

(42-వ పేజీ చూడండి)

కుంకుమ

మతుకుమల్లి సుశీల

తిలకం మంగళకరం. సుమంగళీ చిహ్నం. ఈబొట్టు నల్లరంగు చాదు లేక చుక్కతో గాని, ఎఱ్ఱ రంగు తిలకంగానీ లేక అనేక రంగుల కుంకుమలతో గానీ పెట్టుకుంటారు. తమిళులలో వివాహితలు నల్లబొట్టు పెట్టుకుంటారు కానీ తెలుగు వారిలో పెళ్లి అయినవారు విధిగా కుంకుమ బొట్టు పెట్టుకునే వారు. ఈ రోజులలో అంతా బజారులో అమ్మే తిలకమే బొట్టుకి ఉపయోగిస్తున్నారనుకోండి. అయినా కుంకుమబొట్టు పెట్టుకోవాలని పట్టుదల కలవారు. యింకా వుంటారనే నమ్మకంతో కుంకుమ యింట్లోనే తయారు చేసే పద్ధతులు చెప్తున్నాను.

బజారు కుంకుమ

సాధారణంగా బజారులో కుంకుమ పేరుతో రంగు రంగులలో అమ్మబడే పొడుము పసుపునుండి తయారు చేసినది కాదు. కొందరికి ఆ బొట్టు పెట్టుకుంటే ముఖము మీద పుండు పడటము కాని, మచ్చ పడటము కాని జరుగుతుంది. ఇంట్లో పసుపు కొమ్ములతో తయారు చేసే కుంకుమ ఉపయోగిస్తే యిటువంటి యిబ్బందులు వుండవు. కొందరి శరీరానికి పసుపే సరిపడక పోవచ్చుతుంది. అటువంటి వారు యీ కుంకుమ వాడినా పుండు పడవచ్చు.

మనయింటిలో తయారు చేసే కుంకుమ (1) మామిడి చిగురు రంగులోను, (2) ఎఱ్ఱగా రక్తపు రంగులోను వుంటుంది.

మామిడిచిగురు రంగులో

1. మామిడి చిగురు రంగు కుంకుమ :— కావలసిన వస్తువులు. (1) పసుపు కొమ్ములు (2) కుంకుమ తయారు చేయు రంగు 1 తులము. ఈ రంగుకు ప్రత్యేకపు పేరేమీ లేదు. చిన్న చిన్న పలుకులుగా లేత ఆకు పచ్చ రంగులో (Sea green colour) వుంటుంది. పచారీ కొట్లలో దొరుకుతుంది.

తయారు చేయు పద్ధతి :— సాధారణంగా యింట్లో పసుపు కొట్టించుకునేప్పుడు ఆఖరుకి ఒక చారెడు నూక వుండగా యీ రంగు పలుకులు రోట్లో వేసి దంపితే పసుపు మామిడి చిగురు రంగుగా మారుతుంది. ప్రత్యేకం కుంకుమ చేసుకోవాలనుకునేవారు పావు వీశెగాని, ఐదు పలాలు గాని పసుపుకొమ్ములు దంపి, బాగా నూక అయిన తర్వాత రంగు వేసుకోవచ్చు. ఎంత రంగు వేయాలి అనేది వారి వారి అభిరుచిని బట్టి వుంటుంది. ముదురు మామిడి చిగురు రంగు కావాలనుకుంటే ఎక్కువ రంగు పడుతుంది. లేత రంగులో కావాలనుకుంటే రంగు తక్కువగా వెయ్యాలి. పసుపు కొమ్ములు చాయపసుపా, వంటపసుపా, గుండ్రని కొమ్ములా, పొడుగువా అని సందేహమక్కరలేదు. ఏదైనా పరవాలేదు. నల్లనివి, పుచ్చిపోయినవి కాకుండా వుండాలి. కుంకుమ తయారుచేయటంలో తీసుకొనవలసిన ముఖ్యమైన జాగ్రత్త వస్త్రకాళితము చేసేప్పుడే. కుంకుమ ఏపిండి జల్లెడతోనో జల్లించి పోస్తే బొట్టు పెట్టుకున్నప్పుడు ముఖమునకు అంటుకుని వుండక యిటుక పొడుములా రాలిపోతుంది. కాబట్టి చాలాసన్నని బట్ట తీసుకుని పీలుని బట్టి ఒకసారి గాని, రెండుసార్లు కాని వస్త్రకాళితము చేసి, శుభ్రమయిన సీసాలో నొక్కి పోసుకుంటే రెండు సంవత్సరములైనా చెడదు. వదులు వదులుగా పోస్తే పురుగుపడుతుంది. ఒక సవాశేరు కొమ్ములు కుంకుమచేస్తే హార్లిక్స్ సీసాలో బాగా నొక్కి పోసేందుకు సరిపోతుంది. ఒక ఏడాదిపాటు శ్రమపడనక్కరలేదు.

ఎఱ్ఱ కుంకుమ

కావలసిన వస్తువులు: పచ్చి పసుపు కొమ్ములు ఒక వీశె. వెలిగారం ఐదుపలాలు. పటిక ఐదుపలాలు. నిమ్మకాయలు. కొద్దిగా మంచినూనె (నువ్వునూనెగాని, పప్పునూనెగాని)

ఎఱ్ఱకుంకుమ తయారుచేయటం కొంచెం శ్రమతో కూడిన పని. దీనికి శ్రద్ధ, ఓర్పు కొంచెం ఎక్కువే కావాలి.

ఎఱ్ఱకుంకుమ చేసేందుకు పసుపు కొమ్ములు జాగ్రత్తగా ఏరుకోవాలి. బజారులో చాయపసుపు కొమ్ములు లేక పచ్చిపసుపు కొమ్ములు అని అమ్ముతారు. ఇవి గుండ్రముగా (అంటే బంతిలా కాదనుకోండి) వుంటాయి. ఇవికాక మద్రాసులోను, చుట్టుప్రక్కలా పసుపు కొమ్ములు అప్పటికప్పుడు వేరునుంచి తీసినవి పచ్చిగా అమ్ముతారు. గిల్లిచూస్తే తడిగా వుంటాయి. ఇవి అయితే చిన్నచిన్న ముక్కలుగా తరిగి నీడనే ఆరబెట్టి, ఎండిన తరువాతనే తూనిక ప్రకారం తీసుకోవాలి. ఈ రెండింటిలో ఏపసుపు కొమ్మలైనా కుంకుమ రంగులో తేడావుండదు.


పటిక, వెలిగారం సాధారణంగా పచారీ కొట్లలో కానీ, మందుదినుసులు అమ్మే కొట్లలో కానీ దొరుకుతాయి.


పైనచెప్పిన పాళ్ళప్రకారం ఎవరికి కావలసినంత వారు చేసుకోవచ్చు. ½ వీశె కొమ్ములకి పటిక, వెలిగారం ఒక్కొక్కటి రెండున్నర పలాల చొప్పున అవుతాయి. ఇలాగే హెచ్చించుకోవటం, తగ్గించుకోవటం చేసుకోవాలి. ¼ వీశె పసుపుకొమ్ములకి ½ శేరు కుంకుమ (సుమారుగా) అవుతుంది.

(42-వ పేజీ చూడండి)

మంచి నిమ్మపండ్లు 50 తీసికొని శుభ్రంగా కడిగి బుట్టలో వడవేయవలయును. నీళ్ళు ఓడిన తర్వాత వానిని మధ్యకుకోసి రసంతీసి ఒక స్టీల్ గిన్నెలో ఉంచవలెను. సన్నటి వాయిల్ గుడ్డ తీసికొని ఆ రసం వడపోయవలెను. 15 తులాలు పటిక 5 తులాలు వెలిగారము తీసికొని మెత్తగా రెండూ పొడిచేసి కలిపి ఆ పొడిని రసములో బాగా కలియబెట్టవలెను. 1½ వీశె పసుపుకొమ్ములు మంచివి తీసికొని చిన్నచిన్న ముక్కలుగాచేసి ఈ రసంలో పోయవలెను. 2 రోజుల కొకసారి వానిని కలియబెడుచూ ఉంచవలెను. రసం మిగలకుండా ముక్కలే పీల్చుకొనేటట్లు చేయవలెను. సుమారు 20 రోజులు అట్లు ఉంచాలి. వానిని జల్లెడలోపోసి ఎండలో ఉంచకుండా నీడను గాలితగిలేచోట ఉంచవలెను. అవి ఒరుగుల్లాతయారైన తరువాత రోట్లో వేసిదంచి సన్నని వస్త్రంలో వస్త్రకాళితం పట్టాలి. అర గిద్దెడు నువ్వులనూనెను దానిలోపోసి కలియబెట్టి డబ్బాలో గాని సీసాలో గాని పోసి వాడుకోవాలి. పసిపిల్లలకు అజీర్ణంచేసినపుడు చిటికెడు కుంకుమను ఆముదములో కలిపి పెట్టినచో అజీర్తిపోవును.

వేదాంతం విశాలాక్షి,
పెదప్రోలు.





ఈజీచైర్ గుడ్డలమీదకు, దిండు గలీబులమీదకూ వేసుకునే డిజైన్లు

డి. జయలక్ష్మి

స్ప్రే వర్కు

టేబుల్ క్లాత్స్ కేనా, డోర్ కర్టెన్స్ కేనా డిజైన్స్ కుట్టాలంటే చాలా ఓపిగా యెక్కువ టైంతీసుకొని కుట్టాలి. అదే స్ప్రేవర్కు చేస్తే చాలా తక్కువ సమయంలో తక్కువ శ్రమతో తేలిపోతుంది. చూడ్డానిక్కూడా అందంగా వుంటుంది.

మనకి కావల్సిన డిజైన్ని ఒక కాగితం మీదకి ట్రేస్ తీసుకోవాలి. అప్పుడా కాగితాన్ని మనకి కావలసిన డిజైను మాత్రమే మిగిలేలా కత్తిరించాలి. అంటే డిజైను చుట్టూ అదనంగా వుండే కాగితాన్ని కత్తిరించాలన్న మాట. అంతేకానీ డిజైను మధ్యన వుండే కాగితాన్ని కత్తిరించకూడదు. ఇలాగే మన కెన్ని డిజైనులు కావాలో అన్నింటినీ కత్తిరించాలి.

తర్వాత కత్తిరించుకున్న యీ డిజైన్లని మనం తీసుకున్న బట్టమీద జిగురుతో అంటించాలి. జిగురు ఆరిన తర్వాత ఆ బట్టని, డిజైన్ని అంటించిన భాగం పైకి కనబడేలా యే చాపమీదేనా పరవాలి.

తర్వాత ఇండియన్ యింక్ ని ఒక చిన్న పళ్ళెంలోకి తీసుకుని దాంట్లో బ్రష్ని ముంచి దాంతో డిజైన్నంటించిన బట్టమీద చుక్క చుక్కల్లా పడేటట్లు జల్లాలి. జల్లేటప్పుడు కొంచెం ఒత్తుగా, బట్టమీదెక్కడా ఖాళీలుంచకుండా సమంగా జల్లాలి. బట్టమీద జల్లిన ఇండియన్ యింక్ ఆరిన తర్వాత ఆ బట్టని ఉతికి ఆరేస్తే మనం అంటించిన జిగురు, డిజైను కాగితంపోయి, మనం డిజైను కాగితాన్నంటించినంత మేరా తెల్లగా (తెలుపురంగు బట్టని వాడితే) బట్టంతా మనం జల్లిన సిరా చుక్కలతో నల్లనల్లగా చూడ్డానికి చాలా అందంగా వుంటుంది.

బట్టంతా తెలుపురంగులో వుండి రంగుల్లో డిజైనులుండాలంటే డిజైన్ని కత్తిరించుకునేటప్పుడు డిజైను చుట్టూ వున్న కాగితాన్ని కాకుండా డిజైను మధ్యనున్న కాగితాన్ని కత్తిరించుకోవాలి. డిజైను ఆకారంలో కాళీ ఏర్పడుతుంది. అప్పుడా కాగితాన్ని జిగురు పెట్టి మనం తీసుకున్న బట్టకంటించాలి.

(42-వ పేజీ చూడండి)

ఎస్. అనంతలక్ష్మీప్రభాకరం

వంటలు:

వాక్కాయతో--

వాక్కాయతో

వాక్కాయలు వర్షాలరోజులలో బాగా వస్తూంటాయి. పుల్లగా వుంటాయి. అనేక రకాలుగా వండుతారు. పప్పులోనూ, పచ్చడీ, కూటకూరల్లోనూ చింతపండు బదులుగా వేసి పులుసుకూర చేస్తారు. వీటితో పచ్చడి కూడా చెయ్యొచ్చు. కొబ్బరికాయ పచ్చడిలో కూడా వేస్తారు. పులిహోర చేస్తారు. వీటితో ఆవకాయ వేస్తారు.

వాక్కాయ పప్పు

ఒక పావు సేరు వాక్కాయలు తెచ్చి కడిగి మధ్యకి తరిగి దేనితోనైనా లోపలి గింజ తీసివేయాలి. ఒక పావుశేరు కంది పప్పు మెత్తగా వుడకనిచ్చి, తరిగి ఉంచుకొన్న ముక్కలు అందులో వేసి, సరిపడ ఉప్పు, కారం, పసుపు, కరివేపాకు వేసి సన్న సెగమీద ఉంచితే కొంతసేపటికి ముక్కలు మెత్తగా ఉడుకుతాయి. తరువాత 1, 2 సార్లు కలియపెట్టి దించి వేరే ఒక గిన్నెలో కొంచెం నూనె వేసి 5, 6 ఎండుమిర్చి తుంచివేసి ఒక చెంచా మినప్పప్పు ½ చెంచా మెంతులు 1½ చెంచా ఆవాలు సరిపడ ఇంగువపొడీ వేసి ఘాటుగా తిరగమూత(పోపు) రానిచ్చి అందులో ఈ ఉడికిన పప్పు పోసి మూతపెట్టవలెను.. కొంతసేపయిన తరువాత వేరే ఒక స్టయిన్‌లెస్ స్టీల్ పాత్రలో, రాచిప్పలలో పోసుకొని వాడుకోవచ్చును. ఇష్టమైనవారు ఇందులో ఉల్లిపాయలు సన్నగా తరిగి వేసుకొనవచ్చును.

ఇత్తడి గిన్నెలోపోస్తే చిలుమెక్కుతుంది.

పులిహోర

ముదురు వాక్కాయలు-పావుశేరు, సన్నబియ్యం-పావుశేరు, మెంతులు ½ తులం, శెనగపప్పు 2 తులాలు, పండుమిరపకాయలు 10, 12, ఆవాలు-2 తులాలు, మినప్పప్పు-2 తులాలు, తురిమిన కొబ్బరి - అర్ధ చిప్ప, ఇవికాక సరిపడ ఇంగువపొడి, పసుపు, కరివేపాకు.

కాయలుకడిగి, నిలువుగా తరిగి, గింజలు తీసి, రోటిలోవేసి మెత్తగా రుబ్బితీసి, వడకట్టి వచ్చిన రసమును ఒక స్టెయిన్‌లెస్ స్టీలు గిన్నెలో పోసుకొనవలెను. బియ్యము శుభ్రముచేసి కడిగి పొడిపొడిగా ఉండేలా అన్నము వండవలెను. ఒకనిముష మాగి ఒక స్టెయిన్‌లెస్ స్టీల్ గిన్నెలోగాని పళ్ళెములోగానీ తడిగుడ్డమీదగానీ అన్నము ఆరపోయాలి. దానిమీద కర్వేపాకుఆకులు, పసుపు, సరిపడినంత ఉప్పు, నూనేపోసి బాగుగా కలియునట్లు కలుపవలెను. కొంతసేపైన తరువాత తీసిఉంచిన రసముపోసి కలుపవలెను. ఒకగిన్నెలో చిన్నగిన్నెడు నూనెపోసి బాగుగా మరగనిచ్చి సిద్ధముగా ఉంచుకున్న ఎండు మెరపకాయలు దోరగా వేగనిచ్చి మిగిలిన తిరుగ మూతసామాగ్రి జీడిపప్పు, ఇంగువపొడి, కర్వేపాకు వేసి మంచి వాసనరాగానే కలిపి ఉంచుకున్న అన్నములోపోసి మూత పెట్టవలెను. తరువాత ఒక చెంచాడు ఆవాలు, రెండు ఎండు మిరపకాయలువేసి కొంచెం నీరుపోసి మెత్తగా నూరవలెను. దానిని గరిటెలోకి తీసుకొని దానిలో కొంచెము నూనెపోసి కలిపి దానిని ఆ పులిహోరలో వేసి బాగాకలుపవలెను. పులిహోర వంతటినీ వేరే ఒకగిన్నెలో ఉంచుకోవచ్చును. మర్నాటికి కూడా చెడిపోదు.

పచ్చడి

దీనికికూడా కాయలను కడిగి తుడిచి ఆ కాయలు ముక్కలుగా తరిగి, గింజతీసి, పావుశేరుకాయలు ½ గిద్దెడు ఉప్పు కొంచెం పసుపువేసి మెత్తగా రుబ్బవలెను. తగినన్ని ఎండు మిరపకాయలు, కొంచెం మినప్పప్పు, మెంతులు, ఆవాలతో పోపు వేయించాలి. బాగా వేగినతరువాత కరివేపాకు, ఇంగువపొడివేసి ఇందాక రుబ్బిఉంచిన ముద్దలో యిది కుమ్మరించి మూతపెట్టి ఐదునిముషాలు వుంచి తరువాత మెత్తగారుబ్బి ఒకజాడీలో ఉంచుకోవలెను.

వాక్కాయ ఆవకాయ

5 శేరు కాయలు పెద్దవిగా చూచి తెచ్చి కడిగి నిలువుగా తరగాలి. ఉప్పు, కారం, ఆవాలు కొట్టి జల్లించి అరసోలెడు చొప్పున కొలిచి ఉంచుకోవాలి. వాటిలో తగుమాత్రం పసుపు, ఇంగువపొడి, 1 గిన్నె మంచినూనె పోసి, అందులో ముక్కలు వేసికలిపి ఒక జాడీలో పెట్టుకోవాలి. మూడవరోజు మళ్ళీ కలుపవలెను. 2, 3 నెలలున్నా చెడిపోదు. ఈ ఆవకాయకిముటుకు, ముక్కలలోని గింజలు తీస్తే పాడవుతుంది.

వేపుడు పచ్చడి

కాయలు శుభ్రముచేసి (తరుగకుండా) ఉంచుకోవలెను. కుంపటిమీద గిన్నెపెట్టి, కొంచెం నూనె వేసి, కాగినవెనుక ఈ కాయలు అందులోవేసి ఉక్కిరించి మూతపెట్టితే ఇవి మెత్తగా అవుతాయి. అవితీసి ఒక పళ్ళెములో పోసుకొని రోట్లోవేసి బండతోనూరితే కాయలు చితికి గింజలు బయటికి వస్తవి. అప్పుడుచింతకాయలలోలా గింజలు ఏరి పారెయ్యాలి. ఒక కుంపటిమీద గిన్నెపెట్టి తగిన నూనెపోసి ఎండు మిరపకాయలు వేసి దోరగా వేగనిచ్చి మినప్పప్పు, ఆవాలు, మెంతులు వేసి వేగిన తరువాత కొంచెం ఇంగువవేసి ఘాటుగా తిరగమోతరానిచ్చి, అడీ, ఉప్పూ ఈ కాయల తొక్కలలో వేసి కొంచెంసేపు మూతపెట్టి, తీసి కలిపి రుబ్బుకోవలెను. 4, 5 రోజులు నిలువ వుంటుంది.

కొండుభొట్ల కృష్ణకుమారి.
గుంటూరు.

* *

జీడిపప్పు లడ్డూలు

నేను జీడిపప్పులడ్డూలు, ఎలాచేస్తారో చెపుతాను. చేసి చూడండి!

కావలసిన వస్తువులు,-జీడిపప్పు-ఒక శేరు, చక్కెర అర్థశేరు, నెయ్యి-పావుశేరు, 10 యాలకులు.

తీపి ఎక్కువ కావలసినవారు ఎక్కువ చక్కెర వేసుకోవచ్చు. మొదట చక్కెరను మెత్తగా పిండివలె దంచి, జల్లించి ఉంచుకోవాలి. యాలకులు పొడిచేసుకోవాలి. జీడిపప్పు పుచ్చులు లేకుండా మంచివిగా తీసుకోవాలి. పొయ్యిమీద బాణలి ఉంచి, కొత్త నెయ్యి వెయ్యాలి. పొయ్యిలో ఎక్కువ సెగలేకుండా చూసి నెయ్యి కాగాక ఒక వాయజీడి పప్పువేసి, గోధుమ రంగు వచ్చేవరకు వేయించాలి. బాణలి పెద్దదయితే అంతా ఒకసారే వేయించుకోవచ్చు. అంతా వేయించుకుని ఒక గిన్నెలో తీసుకోవాలి. రోలు, రోకలి శుభ్రపరచి ఒక వాయకి సరిపడినంత, వేయించిన జీడిపప్పు వేసి దంచాలి. కొద్దిగా నలిగిన తర్వాత పొడిచేసిన చక్కెర వేసి, మెత్తగా దంచి ఒక గిన్నెలో తీసుకోవాలి. మరీ మెత్తగా పిండివలె కాక రవ్వలా ఉండేట్లు చూడాలి. అంతా దంచుకున్న తర్వాత యాలకులు పొడి, మిగిలి యున్న నెయ్యి కరగించి వేసి, అంతా బాగా కలిసేట్లు చేత్తో కలుపుకుని, లడ్డూల మాదిరి కట్టుకోవాలి. వేడిమీదే కట్టుకుంటే లడ్డూలు కుదురుతాయి.

ఇవి రుచిగా ఉండటమే కాక చేయటం చాలా తేలిక. నెల్లాళ్ళపాటు నిలవ ఉంటాయి. చుట్టాలు వచ్చినపుడు పెడితే గొప్పగా ఉంటుంది. ఇవి చేసుకొనేటప్పుడు ముఖ్యంగా మంచినెయ్యి, మంచి జీడిపప్పు ఉంటే చాలా బాగుంటాయి.

కుమారి: సి. రాధ. హైదరాబాదు.

* * *

కొబ్బెరహల్వా

కావలసిన సామానులు: ఐదు కొబ్బరి కాయలు; అరపడి చక్కెర; మూడుపలముల నెయ్యి; బాదంపప్పు; ద్రాక్షపండ్లు; ఏలకులపొడి.

తయారుచేయుపద్ధతి: ఐదుకొబ్బరికాయలు కోరు రోటిలో రుబ్బి; పావుపడి (మూడు అరసోలలు నీళ్ళలో కలిపియుంచుకొనవలెను. మూడుసోలల చక్కెరను పావుపడినీళ్ళతో పాకముపట్టుచూ తీగెపాకం రానిచ్చి కొబ్బెరపాలనుపోసి కలియ బెట్టవలెను. బాదంపప్పు, ద్రాక్షపండ్లు, ఏలకులపొడి వేసి గట్టిపడినపిదప మూడుపలముల నెయ్యి వేసి కలియబెట్టి తట్టలో చదురపరచి, తర్వాత బిళ్ళలుగా కోయవలెను. (పడిఅంటే మూడు తవ్వలు.)

* * *

బాదం హల్వా

కావలసినసామాన్లు: అర్థశేరుపాలు; సవాపావు గోధుమరవ్వ, పొట్టుదీసిన బాదంపప్పు నాలుగుతులములు, యాలకులపొడి అరతులం, సవాపావు కలకండ, తులమున్నర పన్నీరు; నాలుగు తులములు నెయ్యి; తయారుచేయు పద్ధతి! అర్థశేరుపాలు పొయ్యిమీద కాగబెట్టవలయును. కాగినపాలలో గోధుమ రవ్వను వేసి బాగుగాకలిపి బాదంపప్పును; యాలకులపొడిని ఆపాలలో కలుపవలెను. కలకండను పాకము చేసుకుని దించుకుని అందులో పన్నీరు; నెయ్యిని వేసి బాగుగా కలిపి పొయ్యిమీదనున్న పాలలో పోసి కలుపవలెను. పిమ్మట రెండుమూడు నిమిషములకు గడ్డకట్టును. చాకుతో బిళ్ళలుకోసుకుని భుజించవలెను. చాల రుచిగా ఉంటుంది.

వాశిరెడ్డి విజయసుశీలకుమారి. ★

భార్య: గడ్డపెరుగు ఉన్నది! వేయమంటారా?

చెవిటిభర్త: గడ్డం పెరిగిందంటావా! భోజనం చేసేటప్పుడు ఆ సమస్య ఎందుకు చెప్పూ?

సంసారంలో:

సహజీవనం ★ ★ సామరస్యం

అణుయుద్ధభయం ప్రపంచం ఆవరించి వేసింది. ప్రపంచంలోని వివిధదేశాలు అణ్వస్త్రాలకొరకు అతితీవ్రంగా పోటీపడుతున్నవి. అణ్వస్త్ర యుద్ధమే తటస్థిస్తే ప్రపంచమంతా మారణహోమంలో భస్మీభూతం కాగలదనీ, వివిధములైన రాజకీయ సిద్ధాంతాలకు చెంది, విభిన్నదృక్పథాలుగల దేశాలన్నీ ఒకరియెడల నొకరు సామరస్యభావాన్ని పెంపొందించుకొని సహజీవనం చేయనియెడల ప్రపంచ వినాశనం తప్పదని ప్రముఖరాజకీయవేత్తలూ తత్వవేత్తలూ నొక్కి చెప్పుచున్నారు. ఈవిషయాన్నే మన జాతీయనాయకుడు నెహ్రూ అనేక సందర్భాల్లో వుద్ఘాటించివున్నారు.

సహజీవనం

దేశాలకూ, దేశాలకూ మధ్యనే కాక, సాంఘిక జీవనంలోనూ, కుటుంబజీవనంలోనూ, సహజీవనం, సామరస్యం, అతి ప్రధానమైనవి.

సమిష్టి సంసారాలూ, పెద్దపెద్ద కుటుంబాలూ, మనదేశంలో అనాదిగావున్నవి. ఆధునికస్త్రీ యీజీవన విధానానికి వ్యతిరేకం, అనేవాదు ఈనాడు తరచు వినబడుతూ ఉంది. ఇదిపూర్తిగా అబద్ధంకాదు. స్త్రీల దృక్పథంలో నాటికీ నేటికీ కొంతమార్పు వచ్చినమాట నిజమే. వెనుకటిసహనం త్యాగబుద్ధి ఈనాడు లోపిస్తున్నాయంటే అతిశయోక్తి కాదు.

పెద్దపెద్ద కుటుంబాల్లో అనేక సాధకబాధకాలువుంటాయి. అత్తాకోడళ్ళ పోట్లాటలూ, అన్నదమ్ముల కలహాలు, వదినా, మరదళ్ళకూ, తోటికోడళ్ళకూ, మధ్యవిభేదాలూ, మనకుటుంబాల్లో సామాన్యంగా కనిపిస్తూవుంటాయి ఎదుటివారియెడల సానుభూతితో మెలగగలిగితే, ఈ విభేదాలన్నింటికీ తావేవుండదు.

వయస్సుకీ, అనుభవానికీ, ప్రాధాన్యమివ్వడం మనసంప్రదాయం. ఎక్కడేనా అదిసహజమే. ఒక్కొక్క కుటుంబంలో నలుగురయిదుగురు కొడుకులూ, వారిభార్యలూ, దగ్గరచుట్టాలూ, పినతండ్రులూ, మేనత్తలూ, మొదలైనవారంతా కలిసివుండడంజరుగుతూ వుంటుంది. ఇటువంటిచోట్ల గృహస్థుభార్య యింటియజమానిగా అధికారినిగా వుంటుంది. మిగిలినవారంతా ఆమెను అనుసరింపవలసినవారే. ఇటువంటిచోట్ల అప్పుడే కాపురానికి వచ్చిన కొత్తకోడలు తనకు అధికారం, ప్రాముఖ్యం లేదని చిన్నబుచ్చుకోవడం సమంజసం కాదు.

అన్నంరాజు రమణమ్మ

నలుగురుకలిసివుండేచోట్ల పెద్దలు పిన్నవారి వుద్దేశాలను గ్రహించి ఆదరాభిమానాలు చూపుతూ, చూరగొంటూ మెలగడం అవసరం. పిన్నలు పెద్దవారి అధికారాన్నీ అనుభవాన్నీ, గుర్తించి గౌరవించడం ధర్మం. హక్కులకొరకు పోరాడేకన్న బాధ్యతలను నెరవేర్చుట ప్రయోజనకరం.

కొన్నిపరిస్థితులలో స్త్రీలు మిక్కిలి స్వతంత్రంగా వ్యవహరించడం భార్యాభర్తలమధ్య విభేదాలకూ, ఒక్కొక్కసారి విడాకులకూ కూడా కారణంగా వుంటున్నది. ఒకే కుటుంబంలోని స్త్రీలు ఒకరి అధికారాల నొకరధిక్షేపించుకొని కలహించడం కుటుంబ విచ్ఛిన్నాలకు కారణం అవుతున్నది.

తల్లిదండ్రులు అనేక కష్టనిష్ఠురాలకోర్చి పిల్లల అభివృద్ధికి పాటుపడతారు. పిల్లలు పెద్దవారై వారిని ఆదరించకపోగా, అగౌరవపరచి తిరస్కరించటంకూడా కొన్నిచోట్ల జరుగుతూ వుంటుంది.


మాకు తెలిసిన ఒక చిన్న ఎలిమెంటరీ స్కూల్ టీచర్ గారు వున్నారు. ఆయనకు తగిన తాహతు లేకపోయినా, "బాగుపడతాడుకదా" అని కొడుకును విదేశాలకు పంపి పెద్దచదువు చెప్పించారు. ఆ ఫారిన్ రిటర్న్డ్, ఆయనకు పెద్ద ఉద్యోగం కూడా అయింది భార్యకూడా బాగా చదువుకున్నదీ డబ్బు కలదీను. వృద్ధదంపతులను కొడుకూ, కోడలూ "వీరెవరో పరాయివారు" అన్నట్లు దూరంగా వుంచుతారు.

మాచుట్టాల్లోనే ఒకామెవున్నారు. భర్త ప్రోత్సాహంవల్లనే ఆమె యమ్మెస్సీపాసయి లెక్చరర్ ఉద్యోగంకూడా చేస్తూన్నది. భర్తకూ ఆమెకూ భేదాభిప్రాయాలు కలిగాయి. పిల్లలనూ భర్తనూ వదలి ఆమె వేరుగా ఒక్కర్తే వుంటున్నది.

భర్తచే పరిత్యజింపబడిన స్త్రీలూ, భర్తలేని స్త్రీలూ, కుటుంబంలోవారి నిరాదరణకు గురవడం సామాన్యంగా జరుగుతూవుంటుంది. పైసందర్భాలన్నీ మనచుట్టూ జరుగుతున్నవే. ఈ పరిస్థితులను తొలగించుటకు మనలో సామరస్యభావం యెంతో అవసరం. ఈనాటి మన సంఘంలో స్త్రీల హక్కులూ, వారి స్వతంత్రం చాలాభాగం గుర్తింపబడ్డాయి.

ఈహక్కులను సద్వినియోగపరచి కుటుంబక్షేమానికీ సంఘక్షేమానికీ తోడ్పడవలసిన బాధ్యత యీనాటిస్త్రీలపైన వున్నది.

* * *



'అక్కా చెల్లెళ్లం'

"ఈ వారం ఆంధ్ర పత్రికలో ఆర్. ఎస్. లక్ష్మిగారు వ్రాసిన (పక్కింటివారి) పుస్తక పఠనము వ్యాసకము చదువుతుంటే మేమిద్దరం అక్కచెల్లెళ్లమూ అని పోతుంది. పుస్తకాల విషయంలో లక్ష్మిగారు నేను ఒకే అవస్థలో వున్నాం. "ఇలాంటి వ్యాసాలు చదివి వివప్పుడైనా పుస్తకాలు తీసుకెళ్లే వారిలో మార్పువస్తుందని ఆశిద్దాం." ఆ వ్యాసరచయిత్రికి నా అభివందనములు.

ఎల్. ప్రభారెడ్డి (చిత్తూరు)

* * *

ఆశ

25.9-57 ఆంధ్ర పత్రిక (వార పత్రిక) లో ప్రచురించిన "తప్పెవరిది? చిక్కెక్కడ?" అనే వ్యాసం చదువుతున్నంత సేపూ నాకు ఎంతో ఆనందం కలిగింది. ఇటువంటి వ్యాసాలు చదివైనా కొందరి మనస్సులు మారవచ్చును. విశాలాక్షి గారు వ్రాసినట్లు ప్రతివ్యక్తీకూడా ఎదుటివారి స్వభావాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రవర్తించడం చాలా మంచిది. ఒకరినొకరు అర్థం చేసుకున్నప్పుడు ఏ గొడవలూ జరగవు. నిజం చెప్పవలసివస్తే మాటికి 99 మంది గూడా, ఇంటి అత్తగారన్నా, సవతి తల్లన్నా, ఆడబిడ్డలన్నా (ఎక్కువగా ఇరుగు పొరుగు వారికి) వారు తప్పు చేసినా, చెయ్యకపోయినా వారి మీద లేనిపోని నేరారోపణలు చెయ్యడం సహజమే. రచయిత్రికి అభినందనలు.

కాలెపు అప్పారావు (మద్రాసు)

* * *

మంగళాకందూర్ గారు స్త్రీలకు ప్రత్యేక గ్రంథాలయాలు వుండాలని వ్రాశారు. ఆమె అభిప్రాయాన్ని నేను బలపరుస్తున్నాను. నా అనుభవంలోని విషయం ఒకటి వ్రాస్తున్నాను. మా పుట్టినింటికి, విజయనగరం వెళ్ళినప్పుడు కాలక్షేపంకోరకు అక్కడి మ్యునిసిపల్ లైబ్రరిలో మెంబరుగాచేరి పుస్తకాలు యింటికి తెచ్చుకుంటేదాన్ని.

ఆ లైబ్రరిలో ఆడవాళ్లుగూడా వచ్చి చదువుకోవటానికి వీలుగా యిద్దరు ఆడపిల్లలను క్లార్కులుగా వుంచారు. (గాని ఆడవాళ్లెవరూ రారు) సామాన్యంగా, సంఘం నోటికి భయపడి ఆడవాళ్లు లైబ్రరీకి వెళ్ళరు. అక్కడంతా మగవాళ్లే వస్తుంటారు. చాలా యెవరైనా మొండిగా ధైర్యం చేసి వెళితే అక్కడి మగవాళ్లంతా నోరావలించి మింగేసేట్టు చూస్తుంటారు. పోనీ, మన మనసు సరైనదయితే యెవరెలా చూసినా లక్ష్యంలేదనుకుంటే యిరుగు, పొరుగు అమ్మలక్కలంతా నోళ్ళు నొక్కుకొని చెవులు కొరుక్కుంటారు. యివన్నీ వూహించి వ్రాసినవి కావు నా అనుభవంలోనివే!

అందుచేత ప్రతి ఊళ్ళోనూ స్త్రీలకు అందుబాటులో వుండేటు గ్రంథాలయాలు స్థాపించడం మంచిది. కాకమ్మ కబుర్లతో కాలక్షేపం చేసేకన్నా, గ్రంథ పఠనంతో మనోవికాసాన్ని కలిగించుకుంటే మంచిది.

బి. సరోజినీదేవి, మదరాసు.

* * *

పాతబట్టలు - వాటి ఉపయోగం

18.9-57 వారపత్రిక వనితావాణిలో శ్రీమతి ఎ. కనకంగారు వ్రాసిన "వ్యధాకథ" అన్న ఉత్తరం చదివి నాకు చాలా ఆశ్చర్యం వేసింది.

సాధారణంగా పాతబట్టలతో ఏదైనా కుట్టేవారు దర్జీవానికి కూలి ఇచ్చి కుట్టించరు. ఇంట్లో మిషనుంటే మిషనుమీన, లేకపోతే చేత్తోనో కుట్టుకుంటారు. ఒక చీరతో మూడు డోర్ కర్టెన్లు కుట్టడానికి మిషనుమీదయితే 30 లేక 40 నిముషాలు, చేత్తోనయితే గంటన్నర లేక రెండుగంటల్లో కుట్టేయవచ్చు. ఇక దారం సంగతి, యీ మూడు కర్టెన్లు కుట్టేందుకు ఒక్క అణా దారం కూడా ఖర్చుకాదు.

ఇక్కడ గవర్నమెంటు క్వార్టర్సు తయారు కాకముందు ప్రైవేట్లో అద్దె ఇంట్లో ఉండేవాళ్లం. ఆ ఇంట్లో ఒక్క కిటికీ గాని ఒక్క అలమారకుగాని తలుపుల్లేవు. పని మనిషి ఉతకటానికి తీసుకువెళ్ళి కొద్దిగా చింపి తెచ్చిన చీరతో, అలమారాలకు కిటికీలకు కర్టెన్లు కుట్టాను. ఆ ఇంట్లో వున్న అయిదు నెలలు అవి వాడాను. క్వార్టర్సుకు వచ్చిన తర్వాత కూడా కొత్త కర్టెన్ల జతతో వాటిని కూడా వాడుకుంటున్నాము. సుమారు ఒక సంవత్సరమునుండి వాటిని ఉపయోగించుకున్నాము. బాగానే వున్నవి. అదే కొత్తబట్టయితే గజం రూపాయి లేక రూపాయిన్నర పెట్టికొన్నా 8 లేక 10 రూపాయలయేది. అది కాకుండా ఆ ధరల్లో కొన్నబట్టలు సామాన్యంగా వెలిసిపోతాయి. ఎ. కనకంగారన్నట్లు స్టీలు గిన్నెలవాడికి ఇస్తే, రెండు లేక మూడు రూపాయలకంటే ఎక్కువ విలువగల గిన్నె ఇవ్వడు. పోనీ పనిమనిషికిచ్చినా, దాని మాపుకు, ఉతుక్కు ఆచీర ఒక్క నెలకూడా మన్నదు.

చీరలు, కర్టెన్లే కాదు, ఏ బట్టయినా పీలికలుగా కాక కొద్దిగా పాతబడి వుంటే ఎన్నో విధాలుగా ఉపయోగించుకోవచ్చును. పిల్లలకు రోజూ వాడుకునే బట్టలు కాక కొన్ని సమయాల్లో ఉపయోగించేందుకు కొంచెం ఎక్కువ ఖరీదుగల బట్టల్ని కొని కుట్టిస్తాము. అవి ఎప్పుడో వాడుతాం గనుక అవి పూర్తి పాతవి కాకముందే పిల్లలు పెరిగిపోతారు. ఊహ తెలిసిన పిల్లలయితే అవి సరుదగా వున్నాయి. మేం తొడుక్కోమంటారు. ఆ కొన్నాల్లో నుండి

(56 వ పేజీ చూడండి)

ఆళ్లగడ్డలో స్త్రీల గ్రంథాలయం

కర్నూలుజిల్లా ఆళ్ళగడ్డ గ్రామములో సెప్టెంబరు 17న స్త్రీలకై ప్రత్యేకం ఒక గ్రంథాలయం నెలకొల్పారు. జిల్లా గ్రంథాలయసంఘం అధ్యక్షుడు వై. స్వామిరెడ్డి ప్రారంభోత్సవం జరిపారు.

అన్ని ఊళ్లలోను స్త్రీలకు ఇటువంటి ప్రత్యేక సదుపాయాలుండడం అవసరమని అన్నారు.

అతివల ఆటలపండుగ

(35 వ పేజీ తరువాయి)

క్రింద రాసిన కథచెప్పి అక్షింతలు వేసుకుంటారు.

ఒక బ్రాహ్మలమ్మాయి ఒక కోమటమ్మాయి ఒక రాజులమ్మాయి ఒక కాపులమ్మాయి ఈ నోము పట్టారుట. వాళ్ళాచారం ప్రకారం కోమటమ్మాయి బ్రాహ్మలమ్మాయి పూజ చేసుకుని మధ్యాహ్నం భోంచేశారు. రాజులమ్మాయి, కాపులమ్మాయి చంద్రుణ్ణి చూసికాని భోంచెయ్యకూడదు కదా? రాజులమ్మాయి సుకుమారి కాబట్టి రాత్రివరకు వుండలేక శోషవచ్చిందట, అది చూసిన ఆమె అన్నగారు ఒక గడ్డిమేటిచాటున మంటవేయించి ఆ వెలుగునే చంద్రోదయమని నమ్మించాడుట, ఆమాట నమ్మిన ఆ అమ్మాయి భోంచేసిందిట. కాపులమ్మాయి చంద్రుడొచ్చేవరకు వుండి చంద్రుణ్ణిచూసి భోంచేసిందిట. కాలక్రమాన నలురకు పెళ్ళిళ్ళయ్యాయి. మిగతా ముగ్గురికీ అనురూపవరులే దొరికారుకాని రాచారమ్మాయికి ముటుక్కు ఒక ముసలివాడు భర్తగా లభించాడుట. అప్పుడా అమ్మాయి తన అదృష్టము సరిచెయ్యమని గౌరీదేవిని ప్రార్థించిందిట. గౌరీదేవి ఒక ముసలి ముత్తయిదువ వేషంలో వచ్చి, అట్ల తద్దినోము వుల్లంఘన చెయ్యటమువల్లనే ఇల్లా జరిగిందని చెప్పి ఆమెచేత మళ్లీ ఆనోము చేయించి తనే వాయనమందుకుందిట. ఈ నోముచేసుకున్న అమ్మాయి భర్త వెంటనే నవయౌవనవంతుడయ్యాడుట. అప్పటినుంచి పెళ్ళికాని వాళ్లే కాకుండా పెళ్ళయినవాళ్ళుకూడ ఈనోము చెయ్యటము మొదలుపెట్టారుట. కథలో ఏమైనా వ్రతలోపం కాకూడదు. భక్తి తప్పినా ఫలం తప్పదు. అక్షతలుతప్పినా లక్ష వేలు ఐదువతనము. పైన చెప్పినకథ ఎంత నిజమో తెలియదు, కాని ఆచరించే అతివలందరికీ అట్ల తద్ది ఆటపాటలతో ఆనందంగానే గడుస్తుంది. అంతవరకు నిజము. ★

స్ప్రేవర్కు

(37-వ పేజీ తరువాయి)

బటమీదక్కడా సిరా పడకుండా యే పేపర్నో పరచి ఖాళీ డిజైన్లోనే చాలా దట్టుగా ఇండియన్ ఇంక్‌ని చల్లాలి. బట్ట మీద చల్లినఇంక్ ఆరినతర్వాత మొదట చెప్పినట్లుగా ఉతికి ఆరేస్తే డిజైను మనం తీసుకున్న ఇంక్ రంగులోను, మిగిలిన బట్టంతా తెలుపురంగులోను వుండి చూడ్డానికి చాలా బాగుంటుంది.

స్ప్రేవర్కు చేసేటప్పుడు మనకవసరమైన చోటతప్ప, అదనంగా బట్టమీద ఒక్క చుక్కకూడా పడకుండా చూడాలి. ఏంవంటే తెల్లగావుండవలసినభాగంలో సిరా పడితే అందంగా వుండదు. ఇంకోవిషయం ఏమంటే మనం జిగురుతో అంటించిన డిజైనుకాగితం ఆరకుండా స్ప్రేవర్కు చేస్తే కాగితాన్నంటించిన చోటకూడా ఇంకుని పీల్చుకొని నానాగ తరగా తయారవుతుంది. అంచేత మనమెప్పుడూ డిజైను కాగితానికి వున్న జిగురు ఆరకుండా స్ప్రేవర్కు చెయ్యకూడదు. డిజైన్నెప్పుడూ బట్టకి 'మరగ' వైపునే అంటించాలి. స్ప్రేవర్కుని కూడా డిజైన్నంటించినవైపే చెయ్యాలి. డిజైన్నంటించడానికుపయోగించే జిగురు మైదాపిండి నుడకబెట్టినజిగురైతే ఉతికితే త్వరగా వదులుతుంది.

స్ప్రేవర్కు టేబుల్‌క్లాత్సుకి, డోర్ కర్టెన్సుకేకాకుండా చీరల అంచులకీ, జాకెట్టుచేతులకీ పరికిణీలకీ కూడా చెయ్యవచ్చు. కొంచెం చిన్నడిజైన్లయితే చీరలకీ, జాకెట్లకీ బాగుంటాయి. ముఖ్యంగా టేబుల్‌క్లాత్సుకీ, డోర్‌కర్టెన్సుకీ ఎంబ్రాయిడరీ వర్కు చెయ్యడం కొంచెం శ్రమగనుక స్ప్రేవర్కు చేస్తే బాగుంటుంది.

స్ప్రేవర్కు చెయ్యడానికి తెలుపురంగు బట్టనే వాడనక్కరేదు. రంగుబట్టల్ని కూడా వాడవచ్చు. కానీ కొంచెం లేతరంగుబట్టల్ని వాడితే బాగుంటుంది. బట్టరంగునిబట్టి మనం వాడే ఇండియన్ఇంక్ తెలుపో నలుపో నిర్ణయించుకోవాలి.

చూడ్డానికి కొంచెం కష్టంగా కనబడ్డా స్ప్రేవర్కుని చెయ్యడానికుపక్రమిస్తే యిందులోనున్న సులువర్థమౌతుంది. ఏంవంటే యేరంగంలోకైనా దిగితే గాని అందులో వుండే సులువు బరువులు తెలియవుగా మరి! ★


కుంకుమ

(36వ పేజీ తరువాయి)

పసుపుకొమ్ములు శుభ్రమైనచోట చిన్న చిన్న ముక్కలుగా, (కుంకుడు కాయంత) చేసుకోవాలి. పటిక, వెలిగారం శుభ్రంగా కడిగిన నేలపైకాని, కల్వంలో వేసిగాని మెత్తగా పొడిచేసుకోవాలి. నిమ్మరసం కూడా సిద్ధంగా వుంచుకోవాలి. బాగా రసంగల కాయలైతే 1 వీశె పసుపు కొమ్ములకి 100 కాయలు పడతాయి.

ఇపుడు కళాయివున్న గిన్నెకాని, స్టెయిన్‌లెస్ స్టీల్ గిన్నెకాని, జాడీకానీ, ఏదైనాసరే చిలుమూరని పాత్రలో చితుక కొట్టిన పసుపు కొమ్ములు వేసి నిమ్మరసం పోయాలి. కొమ్ములపైన సుమారు $1\frac{1}{2}$ అంగుళముల ఎత్తున నిమ్మరసం వుండేట్లు పోయాలి. అందులో పటిక వెలిగారం పొడులు వేసి బాగా కలపాలి. యీనాలుగూ కలిసిన మిశ్రమము ఎర్రని రంగులో వుంటుంది. ఆ గిన్నెమీద మూత పెట్టి చల్లని ప్రదేశంలో వుంచాలి. రెండవరోజున కలియబెట్టి మూతబెట్టాలి. మూడవరోజు బాగా కలిపి పసుపుకొమ్ములు నీడలో ఆరబెటాలి. ఇది బట్టపైన అయితే రంగుని బట్ట పీల్చేస్తుంది. కాబట్టి చాపమీదకాని, క్రొత్త చాటలోగాని, విస్తళ్ళలోకాని ఆరబెట్టాలి. ఎండ ఎంతమాత్రం తగులకూడదు. రాత్రికి తిరిగి పసుపుకొమ్ములు నిమ్మరసంలో వేసి కలిపి మూతపెట్టాలి. ఈవిధంగా నిమ్మరసం అంతా అయిపోయేవరకూ పగలు పసుపుకొమ్ములు నీడలో ఆరపెడుతూ రాత్రి రసంలో వేస్తూ వుండాలి. రసం అయిపోయిన తరువాత కూడా కొమ్ములు దంచేందుకు వీలయేవరకూ నీడనే ఆరనివ్వాలి. బాగా ఆరిన తరువాత కొమ్ములు చితుకకొట్టి చూస్తే ఎర్రగా వుంటాయి. అపుడు రోలు, రోకలి శుభ్రముగా కడిగి, తుడిచి ఆరిన పసుపుకొమ్ములు వేసి, దంపితే ఎర్రని పొడుము వస్తుంది. ఈ పసుపు కొమ్ములు మామూలు పసుపు అంత తేలికగా నలగవు. కాబట్టి ఇనుపరోకలి అయితే మంచిది.

ఈ ఎర్రని పొడుమును పల్చని బట్టతో పొడిగానుండే పళ్లెములోనికి వస్త్రకాళితము చేయాలి. ఇందుకు పళ్లెము బదులు కాగితము వాడితే రంగు కాగితముకే పటిపోతుంది. కల్వం వున్నవారు వస్త్రకాళితను చేసిన పొడుము కొంచెం కల్వంలో వేసి 2, 3 నూనెబొట్లు వేసి బాగా నూరితే ఎర్రగా నిగనిగలాడుతూ కుంకుమ తయారౌతుంది. కల్వం లేనివారు అడుగు చదునుగా నున్నగా వుండే గ్లాసుగాని, గిన్నెగాని తీసుకొని పళ్లెములోనే నూనెవేస్తూ కలిసేట్లు నూరాలి. నూనె కొంచెం ఎక్కువైనకొద్దీ ఎరుపురంగు ఎక్కువౌతుంది. అలా అన్నానని ఆవపిండికి మల్లే నొక్కితే ముద్ద అయేట్లు నూనె పోయకండి. ఈ కుంకుమ రంగు బాగా నూరటంలోనూ, సమపాళంలో నూనె పోయటంలోనూ వుంటుంది. కొంచెం శ్రమ అయినా మామిడి చిగురు కుంకుమ కంటే ఎర్రకుంకుమ అందంగా వుండి ముఖానికి కళనిస్తుంది. సీసాలో పొయ్యటం జాగ్రత్త పెటటం మామూలే! ఎండమాత్రం తగులకుండా పసుపుకొమ్ములు కాపాడాలి. తరువాత రంగు రాలేదనుకుంటే ప్రయోజనం లేదు. నూనె వేసేప్పుడు కొంచెము కొంచెము వేసి బాగా కలియనూరి, మళ్ళీ నూనె వేసుకోవాలి. నూనె ఎక్కువైతే నలుపూ ఎరుపూ కలిసి చెడిపోయిన రక్తం రంగు వస్తుంది. ఒకటికి రెండుసార్లు చదివి జాగ్రత్తగా చేస్తే శ్రమకు తగ్గ ఫలితముంటుంది. ★



గ్రామ జీవనం

పల్లెటూరి ఎలుక ఒకటి
పట్టణంపు మూషికమును
విందుకుడువ రమ్మటంచు
వేడుకొనుచు కబురు పంపె.

నగరవాసి మూషికమ్ము
సొగసుచేసికొని చక్కగ
పల్లెటూరి ఎలుక కడకు
పయనంబై వెళ్ళిపోయె.

పిలిచినంత వచ్చినట్టి
ప్రేమాస్పదుడైన సఖుని
ఆలింగన మాచరించి
ఆనందం బొందె ఎలుక.

రా రమ్మని తన మిత్రుని
చేర పిలిచి గౌరవించి
దుక్కిచేల గట్ల వెంట
తోడ్తోడుత కొంపోయెను.

వరిగింజలు విందులోన
వడ్డించెను తన సఖునకు.
పట్టణంపు ఎలుక కవ్వి
గిట్టలేదు—ముట్టలేదు.

"సఖుడ! నిన్ను చూడ నాకు
జాలి కలుగుచున్నదోయి!
చీమవలెను దుష్కరమగు
జీవన మిది ఏల నీకు?

పల్లెటూరి జీవనమ్మె
పగవారల కైన వలదు.
నా తోడుత నగరమునకు
ఏతెంచుము నేడె సఖుడ!

పురములందు సకల సుఖము
లిరవొందుచు నుండు నెపుడు"
అనుచు పలికి నగరమునకు
తనమిత్రుని కొంపోయెను.

పట్టణంపు ఎలుక తనదు
పల్లెటూరి మిత్రమునకు
రుచ్యము లగు రకరకాల
రొట్టియలను వడ్డించెను.

గదిలోపల ఆ ఎలుకలు
ముదముతోడ తినుచుండగ
వంట ఇంటి తలుపు తీసి
ఇంటాబిడ కసరికొట్టె.

భయముతోడ ఆ ఎలుకలు
పరుగులెత్తి తూము దూరె.
తూమెంతో సన్నదగుట
దూఱుటకును కష్టమయ్యె.

ఇంటాబిడ వెళ్ళినంత
ఎలుకలు తినసాగ మరల,
తిరుగ ఎవరో తలుపు తెఱచి
వెఱపు కలుగజేసినారు.

తూములోన ఒదిగియున్న
గ్రామీణపు మూషికమ్ము
పట్టణంపు ఎలుకతోడ
పలికె నిట్లు దీనమ్ముగ:

"నీభోజన మమృతమైన
ఈ భయమున తినజాలను—
చీకు చింతలేని పల్లె
జీవనమ్మె మేలైనది!

ప్రాణభయముతోడ పంచ
భక్ష్యమ్ములు తినుటకంటె
నిర్భయముగ గంజి త్రావి
నింపాదిగ మనుట మేలు!"

ఈ రీతిగ పల్లెటూరి
ఎలుక మంచి నీతి చెప్పి
స్వస్థానము చేరుకొనెను;
స్వాతంత్ర్యము నిలుపుకొనెను.

ఉత్పల
సత్యనారాయణాచార్య



ఓసారి నక్కకీ, పీతకీ లడాయి వడింది. నక్క బడాయిగా "నేను చాలా వేగంగా పరిగెత్తగలను. నువ్వు పరిగెత్తగలవా?" అంది.

"ఏం, పరిగెత్తలేనని అనుకున్నావా?" అని అడిగింది పీత.

"నీముఖం! నువ్వు నాతో ఏం పరిగెత్తగలవు?" అన్నది, అతి నిర్లక్ష్యంగా నక్క.

దాంతో పీతకి చాలా కోపం వచ్చింది. "ఇదిగో, నక్కా! జాగ్రతగా మాట్లాడు." అంది, చాలా కోపంగా పీత.

"హుఁ! ఏం జాగ్రతగా మాట్లాడకపోతే ఏం చేస్తా వేమిటి?" అని అడిగింది నక్క.

"నువ్వేం చెయ్యగలవూ?" అని, ఎదురు ప్రశ్న వేసింది పీత.

"అసలు, నువ్వు నాతో పరిగెత్తగలవా?" అని మళ్లీ అడిగింది నక్క, పీతని.

"ఉఁ...పరిగెత్తగలను." అంది పీత.

నక్క నివ్వెరపోయింది. "ఇది చూస్తే 'ఇంత' లేదు, నాతో ఏం పరిగెడుతుంది" అనుకుంది నక్క.

"పరిగెడదామా" అని అడిగింది పీత. నక్క క్షణంసేపు ఆలోచించింది. పీతకి ఇంత ధైర్యం ఎక్కణ్ణుంచి వచ్చిందో దానికి అర్థం కాలేదు. "ఇది ఎలాగా ఓడిపోతుంది" అని, నిర్ధారణ చేసుకుంది నక్క.

"ఐతే, పందెం వేసుకుందాం!" అన్నది నక్క.

"పందెమా?" అని అడిగింది పీత.

"ఔను! పందెం లేనిదే పరుగు ఏఁమిటి?" అంది నక్క.

"సరే, ఏం పందెం వేసుకుందాం?" అని అడిగింది పీత, నక్కని.

పి. జ్యోత్స్న

నక్క ఆలోచించినట్టు నటించి, అన్నది. - "నేనుకానీ గెలిచానో, నువ్వు నాకు మూడుసార్లు వంగి నమస్కారం చెయ్యాలి! లేకపోతే, నేను ఆపని చేస్తాను." అని.

"సరే" అంది పీత.- పీత ఒక రాయిమీద నుంచుంది. ఆ పక్కనే నక్క నుంచుంది.

"ఎక్కడివరకూ వెళ్దాం?" అని అడిగింది పీత.

"ఆకనిపించే తాటిచెట్టువరకూ!" అంది నక్క.

"మరి, ఎవరు ముందు వెళ్లారో గమనించేదెవరూ?" అని అడిగింది పీత.

నక్క మళ్ళా ఆలోచనలో పడింది. ఇంతలో చెట్టుమీది పిచ్చిక 'కిచకిచ' మన్నది. వెంటనే నక్క, పిచ్చికని పిలిచి, మధ్యవర్తిగా ఉండమని కోరింది. 'సరే' నంది పిచ్చిక.

పిచ్చిక ముందుగా వెళ్లి తాటిచెట్టుకింద నుంచుంది. అక్కడినుంచి 'కిచకిచ' మని అరిచింది.

నక్క పరుగుచ్చుకుంది. దాని కాళ్లలో ఉన్న బలం కొద్దీ పరిగెత్తింది.—

తాటిచెట్టు దగ్గరకు చేరుకుంది. "పీత ఏదీ?" అంటూ నవ్వింది.

"నీకంటే ఎంతో ముందుగావచ్చి, నీ కోసం ఎదురు చూస్తున్నాను." అన్నది పీత, పిచ్చికపక్క నుంచొని.

నక్క ఆశ్చర్యపోయింది! సిగ్గుతో తల దించుకుంది. చచ్చినట్టూ, మూడుసార్లూ పీతకి వంగి నమస్కరించింది. ఒక్కక్షణంకూడా అక్కడ ఉండకుండా పరిగెత్తింది నక్క. పీత పగలబడి నవ్వింది.

"ఇంత వేగంగా ఎలా రాగలిగేవూ?" అని అడిగింది పీతని, పిచ్చిక.

"నేను అసలు పరిగెత్తనిదే!— అది పరిగెత్తే ముందు ఒక్క ఎగురు ఎగిరి, దాని తోక చివర ఉన్న కుచ్చుని కరుచుకున్నాను. అది ఇక్కడికి రాగానే, ఒక్క గెంతు గెంతి, నీ దగ్గరకు వచ్చాను. పిచ్చిముండ, పప్పులో కాలేసింది, పాపం!" అన్నది పీత.

ఈసారి పిచ్చికా, పీతా రెండూ కూడా పగలపడి నవ్వేయి! ★

ఈశ్వరప్పసామర్థ్యం

విజయనగరం లింగధారి పేటలో వెంకటసీతామహాలక్ష్మమ్మ అనే ఇల్లాలు ఒకనాటి సాయంకాలం కోడలికి వంటపని వప్పచెప్పి తీరికగా వీధి గుమ్మంలో కూర్చుని చోద్యం చూస్తోంది.

'పిన్నులు రిబ్బన్లు, సెల్యులాయిడు దువ్వెన్నలు, బరిణలు, ఈలలు, గోళ్ళ రంగులు, కాటుకలూ' అంటూ కేక వేసుకుంటూ ఆవస్తువులన్నీ జంగెడలో పెట్టుకుని కామరాజనే చిల్లర వర్తకుడు వీధమ్మటే వచ్చాడు. ఆమె వాణ్ణి పిలిచి 'కలరు కుంకం ఉందిటోయ్?' అని వాకబు చేసింది.

కామరాజు, 'ఉన్నదమ్మా' అంటూ కుంకం పొట్లాం విప్పిచూపించాడు. ఆమె మచ్చుకి చిటికెడు కుంకం తీసుకుని ఆతడు అమ్మ దెచ్చిన అద్దాలలోంచే ఒక అద్దంతీసి చూచుకుంటో బొట్టు పెట్టుకుంది. 'అబ్బే, వెలవెల బోతోందోయ్ ఈ కుంకుం! ఇంతకంటే మంచిది లేదా?' అంది.

కామరాజు చిరాకుపడి, 'ఇంతకంటే మంచి కుంకం ప్రపంచంలో ఎక్కడా లేదు. కావలస్తే కొనండి, లేకపోతే లేదు.' అన్నాడు.

ఆమె, 'అక్కర్లేదు, పట్టుకెళ్లు!' అని లోపలకు వెళ్ళిపోయింది.

'పిసినిగొట్టు! మచ్చుకని బొట్టుకు సరిపడే కుంకంపుచ్చుకుని వంకలెంచి కొనకుండా పంపేసింది! ఎప్పుడూ ఇంతే! నా బుద్ధి తక్కువగాని ఈవిడ పిలుస్తే వెళ్ళడమేమిటి?'

రాంభీ
చింతల రామచంద్రమూర్తి

అని తిట్టుకుంటూ కామరాజు గేటు ఇవతల కొచ్చేసరికి, ఈశ్వరప్ప అనే మరొక చిల్లరవర్తకుడు, తాను అమ్మే సబ్బుబిళ్లలూ, సీకాయపొడి, లాంతరు వత్తులూ, బొట్టు సీసాలూ, మొలతాళ్లూ, అగ్గిపెట్టెలూ వగైరాలన్నీ రెండు సంచీలలో వేసుకుని, సైకిలు హాండిలుబారుకి అటొకటీ ఇటొకటీ తగిలించుకుని నడిపించుకుంటో వచ్చి ఎదురయాడు.

ఈశ్వరప్ప కామరాజుకుమల్లే కాకుండా, సరుకు లమ్మడంలో చాలా సామర్థ్యం కలవాడు. తియ్యగానూ నేర్పుగానూ కబుర్లు చెప్పి, కొనేవాళ్లకి అవసరం లేకపోయినా

ఈశ్వర సామర్థ్యం

వకే అంటగట్టి చక్కా వచ్చేవాడు.

కామరాజు కంటబడటంతోనే ఈశ్వరప్ప, 'బావా, మంచి బేరం చిక్కినట్లుందే!' అని పలకరించాడు.

కామరాజుకి పుండుమీద కారం రాసినట్లయి, 'ఆ, బలేబేరం! నువ్వు కూడా వెళ్లి ఆ లాభం పాముకో!' అన్నాడు.

ఈశ్వరప్ప నవ్వుతో, 'ఏం బావా, అలాగంటున్నావ్? ఏమీ కొన కుండా పంపేసిందా ఆవిడ? నువ్వు మరీలే! ఏవో తేనెపలుకులు చెప్పి అంటగట్టాలికాని ఊరికే మెచ్చు లిచ్చుకు చక్కా రావటమా?' అన్నాడు.

కామరాజు, 'రాక ఏం చేసేది? ఇసకలోంచి నూనె పిండవచ్చునేమో గాని పిసినిగొట్టులచేత ఏమీ కొని పించలేం' అన్నాడు.

"'లేం' అని నన్ను కూడా కల పకు. ఈ పిసినిగొట్టు మా లక్ష్మమ్మ చేతనే నేనేదైనా సరుకొకటి కొని పించి రమ్మంటావా?" అన్నాడు ఈశ్వరప్ప మీసం మెలిపెడుతో.

'నువ్వుకాదు సరికదా, నిన్ను పుట్టించిన బ్రహ్మదేవుడుకూడా ఈ విడచేత ఏమీ కొనిపించలేడు!' అన్నాడు కామరాజు.

'ఎంత పందెం?' అన్నాడు ఈశ్వరప్ప.

'పావలా, పావలా' అన్నాడు కామరాజు.

ఈశ్వరప్ప కామరాజును అక్కడే ఉండమని చెప్పి, తాను లోపలికి వెళ్లి, 'అమ్మగారూ!' అని మెల్లిగా పిలిచాడు.

వెంకటసీతామహాలక్ష్మమ్మ గారు బయటకొచ్చి, ఈశ్వరప్ప పెట్టిన నమస్కారం అందుకొని, అతడు తెచ్చిన సబ్బుబిళ్లలూ వగైరా సరుకులు కంటపడటంతోనే, 'ఏమీ వద్దోయ్' అని పంపెయ్యబోయింది.

ఈశ్వరప్ప, 'అమ్మ టానికి రాలేదు, అక్కయ్యగారు! దీపాలు పెట్టేకా రప్పడే. ఇంక అమ్మకం ఏమిటి నా మొహం?' అన్నాడు.

'అలాగైతే ఎందుకు వచ్చావు మరి?' అంది వెంకటసీతామహా లక్ష్మమ్మగారు.

'సైకిలు లైటు వెలిగించుకుం మని వచ్చాను. ఒక్కమారు అగ్గి పెట్టె ఇప్పించండి.' అన్నాడు.

దమ్మిడీ ఖర్చులేకుండా బొట్టుకు కుంకం సంపాదించే ఆ మహాతల్లి అగ్గిపెట్టె నిస్తుందా? సైకిలులైట్లు ఒకొక్కప్పుడు ఒక్కపుల్లతో వెల గవు. గాలివేసి ఐతేనేమి, వత్తి కొడి గట్టిపోవడంవల్ల నైతేనేమి మూడు నాలుగు పుల్లలుదాకా ఖర్చై పోవచ్చు. 'వీడిచేత అగ్గిపుల్లలు తగలేయించడానికి నేనేమైనా అచ్చిఉన్నానా?' అనుకుంది ఆమె.

ఎటొచ్చీ, 'ఇవ్వను' అని నిర్మొగ మాటంగా చెప్పటం ఇష్టంలేక ఒక చిన్న అబద్ధమాడింది. 'అగ్గిపెట్టె లేదోయ్. నాలుగు రోజుల క్రితమే ఖాళీఐ నానా ఇబ్బందిగానూ ఉంది ఇంట్లో. ఎన్నిమాట్లు తెమ్మని చెప్పినా మావారు మరిచిపోతు న్నారు!' అంది.

ఆవిడ అలాగ చెప్పాలనే ఈశ్వ రప్ప అనుకుంట! ఆతడు వెంటనే, 'అయ్యో, మీవారు ఈ మాత్రం దానికి బజారువరకూ వెళ్ళాలా? మీలాంటి వారికి వీలుగా ఉండటా నికే నేను ఈ వర్తకం పెడత!' అంటూ తన సంచీ అడుగునుంచి అగ్గిపెట్టెల ప్యాకెట్టు పైకితీసి, 'ఎన్ని పెట్టెలు ఇమ్మన్నారు?'అని అడిగేడు.

వెంకటసీతామహాలక్ష్మమ్మగారు నిర్ఘాంతపోయి, 'ఏమోయ్ నీవద్ద అగ్గిపెట్టె లుండగానే నన్ను అడి గేవా?' అంది.

ఈశ్వరప్ప, 'ఈ పెట్టెలు తమ లాంటివారికోసంగాని నావంటి పేద వాళ్ళకా తల్లీ? నాలైటు వెలిగించు కోడానికైతే, తమలాంటివారిని ఒక పుల్ల అడిగితే ఇస్తారు!' అని వెంటనే

మళ్లీ, 'ఒకఅరడజను ఇమ్మన్నారా?' అని అడిగేడు.

అంతవరకూ వచ్చాక ఇంక 'అక్కర్లేదు.' అంటే అబద్ధమాడినట్లు తేలిపోతుందని ఆమె, 'ఒక్కటి ఇయ్యి చాలు' అని పుచ్చుకుంది.

ఈశ్వరప్ప డబ్బులు చేతిలో వేయించుకుని చరచరా పోయి గేటువద్దనున్న కామరాజుకు చూపించి, 'పందెం నెగ్గేను, పావలా ఇయ్యి' అని వసూలు చేశాడు.

కామరాజు ఈశ్వరప్ప సామర్థ్యానికి మెచ్చుకుని, వ్యాపారంలోని మెళకువలు నేర్చుకోడానికి నాటినుండీ కొన్నాళ్లు అతగాడివద్ద శిష్యరికం చేశాడు. ★

మూత్రంలో చక్కెర పోతున్నదా?

మూత్రంలో చక్కెరపోవడం చాలా ప్రమాదకరం. అతి క్లిష్టమైన వ్యాధి శరీరంలో పాతుకొనిపోయి, బలపడి క్రమేపి రోగిని మృత్యువాతపెడుతుంది. ఈ వ్యాధి తగిలిన రోగుల సంఖ్య రోజుకు రోజు వృద్ధియగుచున్నది ఈ రోగ లక్షణాలు ఏవంటే అమిత దాహం, ఆకలి, తరచుగా మూత్రవిసర్జనం, మూత్రంలో చక్కెర దురద మొదలైనవి. ఈ జబ్బు కనపడిన తరువాత వెంటనే దానికి చికిత్సచేయక పోయేటట్లయితే, రాచపుండు, వ్రణములు, కంటిపొర, అతిసారం, శరీరమంతా నొప్పులు, కీళ్ళవాతం, రక్తపోటు, క్షయ, బరువు తగ్గుదల, అతి ప్రమాదకరమైన తదితర వ్యాధులు బయలుదేరుతవి. "వీనస్ చారమ్" బిళ్ళలు పూర్వకాలం నాటి యూనాని వైద్యశాస్త్రం ప్రకారం తయారు చేయబడ్డవి. ఇందులో అరుదైన వనమూలికలు, సారములు చేర్చబడినవి ఇవి వెంటనే గుణమిచ్చి పై లక్షణాలను పారద్రోలుతవి. "వీనస్ చారమ్" బిళ్ళలుకొని వాడి వేలాది మంది మృత్యుముఖం నుంచి తప్పించుకొన్నారు మూత్రంలో చక్కెర, తరచుగా మూత్ర విసర్జనం, ఈ చికిత్స మొదలుపెట్టిన 2 వ లేదా 3 వ రోజునుంచే తగ్గుముఖం పడతవి, కొన్ని రోజులకే మీకు స్వస్థత కలుగుతుంది. "వీనస్ చారమ్" ఎక్కువ ఖరీదుకాదు. నిరపాయమైనది సేవించడం సులభం ప్రత్యేకపత్య నిర్బంధములులేవు. అడిగిన వారికి పూర్తివివరాలు ఇంగ్లీషులో పంపబడతవి. 50 బిళ్ళల డబ్బీ ఖరీదు రు. 6-12-0 ప్యాకింగు పోస్టేజి ఉచితం

వివరములకు :

వీనస్ రీసర్చి లేబరేటరి, (A. P. W.)
పో. బా. నం. 587. కలకత్తా.

అమెరికన్ మహిళ

(7-వ పేజీ తరువాయి)

నిధికి తోడ్పడేందుకు ఉద్దేశింపబడినవే. యూరప్‌లోని సంఘాల వార్షికోత్సవం జరుగుతున్నప్పుడు మిసెస్ పాంటల్యూని ఈ ఏడాది ఒకసారి పారిస్ వెళ్ళివచ్చింది. "పారిస్ సమావేశంలో కనబడిన వైవిధ్యం, ఏకీభావం నాకు చాలా ఆనందం కలిగించాయి. ప్రతిదేశపు సంఘమూ తనదేశపు పరిస్థితులకు అనుగుణంగానే పనిచేస్తుంది. కాని ఇతరదేశాల సంఘాలు పనిచేసే విధానాలను పరిశీలించి, ఆవిధానాలు తమదేశానికి అన్వయిస్తే ఎలా ఉంటుందీ అని కూడా ఆలోచిస్తుంది" అని ఆమె అన్నది.

అమెరికన్ సంఘం ప్రతి ఏడాదీ ఒక కార్యక్రమం నిర్వహిస్తోంది. అక్టోబరు 31 వ తేదీ హాలోవీన్ పండుగ. ఈ పండుగనాడు పిల్లలందరూ వేడుకగా వింతవేషాలు ధరించి పెద్దవాళ్ళను నవ్వుటాలకు బెదిరించి బహుమతులు సంపాదిస్తూ ఉంటారు. ఈ పండగ సరదాలను అమెరికన్ సంఘం చక్కగా ఉపయోగించుకుంటోంది. ఇప్పుడు అమెరికన్‌పిల్లలు ఈ బహుమతులను తమకోసం సంపాదించుకోవడం తగ్గించారు. ప్రపంచదేశాల్లోని శిశువులకు పాలు, ఆహారం, మందులు కొని పంపించడం కోసం డబ్బు పోగుచేయడం అమెరికాలో పిల్లలకు క్రమక్రమంగా అలవాటవుతున్నది. కిందటేడు 7,500 అమెరికన్ గ్రామాల్లో ఇలా ధనసేకరణ జరిగింది.

శిశు సహాయనిధివారి అభినందన పత్రాలను [గ్రీటింగ్ కార్డులు]అమ్మి పెట్టడానికి అమెరికన్‌సంఘం 1950నుంచీ అనేక దేశాల్లోఉన్న సమితి సంస్థలతో సహకరిస్తూ ఉంది.

క్రిందటేడాది ఒక్క అమెరికాలోనే 80 లక్షల అభినందనపత్రాలు అమ్ముడుపోయాయి. వీటివల్ల శిశుసహాయనిధికి చాలా ధనం సమకూడుతున్నది.

ఇవల మరొక కొత్త కార్యక్రమంటే ప్రారంభమైంది. ఇతరదేశాల బాలబాలికలను గూర్చి అమెరికన్ పిల్లలకు తెలియజేసేందుకు ఇది విద్యాకార్యక్రమంగా ప్రారంభించారు. గ్రామఫోను ప్లేట్లు, పాటలు, ఆటలు చేతిపనులు, జానపదకథలకు సంబంధించిన వాఙ్మయం అన్నికలిపి ఒక ప్యాకెట్టుగా కట్టి అమెరికన్ పిల్లలకు అందజేస్తారు. వాటిని బట్టి వారు ఇతదేశాల పిల్లల జీవన విధానాలను గూర్చి తెలుసుకుంటారు. అమెరికన్ సంఘం ప్రధానంగా చర్చీలద్వారా, పాఠశాలల ద్వారా, క్లబ్బుల ద్వారా పనిచేస్తుంది.

శిశుసహాయనిధి కార్యక్రమం తనకు చాలా ప్రీతిపాత్రమైనపని అని, ఈపనికోసం తనకుటుంబపు పనులను తప్ప మిగతా అన్ని వదిలేశాననీ మిసెస్ పాంటల్యూని అంటూ ఉంటుంది. ఈమె భర్త చనిపోయారు. ఇద్దరుకుమారులు, మరి ముగ్గురు సవతిపిల్లలు ఉన్నారు. ★

సినిమా

★ డిసీకా కొత్తచిత్రం ★

అనగనగా ఒక రోజున దీనుడి మీద పున అమావాస్య వాలింది. బద్ధకంగా ఆవరించి, అతని బ్రతుకంతా ఆక్రమించి పడుకుంది. అది ఇంకా అలాగే ఉంది. ఆ దీనుడిపేరు బీదవాడు; లేక నిర్బలుడు. వాడిమీద వాలిన అమావాస్య మీద ఎందరో ఎన్నో సిద్ధాంతాలు చాటారు దాన్ని తొలగిస్తామని. అవి కథలై నిలిచాయి...వాడిమీది పీడను తొలగించలేక పోయినా, తీరుబాటుచేసుకుని జాలిపడమని దారే పోయేవాళ్ళని అవి అడుగుతూ ఉంటాయి. వింటున్నప్పుడు నవ్వొస్తుంది. విన్నాకా ఏడ్పొస్తోంది కాని అందుకు మనసొప్పదు......


ఇటాలియన్దర్శకుడు విట్టోరియో (బైసికల్ థీవ్స్) డిసికాతీసిన 'ఎవ్విరిడే ఈజ్ ఎహాలీడే' చిత్రంలో ఇలాటి కథలు నాలుగున్నాయి. గైసెప్ మరోటా అనే ఆయన వ్రాసిన "నేపుల్స్ కథలు" అనే పుస్తకంలోవి. మరోటా, డిసికా, సీజర్ జవాటినీ వీటిని చలనచిత్రంగా రూపొందించారు.

మొదటికథ, గుండెధైర్యంలేక ఆలుబిడ్డల ముందు లోకువ అయిపోయిన వాడి వ్యథ. అతడు నెపోలియన్ ప్రభుత్వంలో చిన్నకొలువు సంపాదించి పెళ్ళాంబిడ్డలతో కాలక్షేపం చేస్తున్నాడు. ఉండుండి ఒకనాడు ఒక దుండగీడు అతని ఇంటిమీదపడ్డాడు. చిన్ననాటి స్నేహితుడని చోటిచ్చాడు. తీరా ఏకుమేకై అతడు ఈ ఇంటికి నియంతగా తయారయ్యాడు. అతని భార్య గోడమీద పూలువేసి ప్రార్థించరావడంకూడా ఈ గృహస్థు విధులలో ఒకటి అయింది. ఇంట్లోంచి పొమ్మనేటంత దమ్ములులేవు. ఎదటపడి తిట్టేటక్కిలేదు. భార్య, పిల్లలూ కూడా ఆ అతిథి అంటే గడగడ వణికిపోతున్నారు. తను మనిషంతమనిషై ఉండీ కూడా, లేనివాళ్ళలోనే జమ. చివరకి ఓరోజున అతిథికి గుండెజబ్బుచేస్తుంది. ఇదే అదనని తలచి తెగించి, ఇల్లువెళ్ళగొడతాడు గృహస్థు. ఆరోజున భార్యాబిడ్డలూ. పరమానంద పడతారు ఇంటి పెద్దదిక్కు ఇలానిలబడినందుకు. ఆరోజు పండుగ అని ఎంచి పిండివంటలు చేసుకు ఆనందంగా తినబోతుఉంటారు. ఈలోగానే ఇల్లువదలిపోయిన శనిగ్రహానికి గుండె జబ్బులేదని వైద్యులు చెబుతారు. అతడు సరిగ్గా వెనక్కివచ్చిపడతాడు ఈ ఇంటిమీద. ఇంతాకటి పులి మళ్ళీ పిల్లి అయిపోతుంది. కంటనీరు తిరుగుతుంది తనఅశక్తతకి. చూస్తుఉండగా, నియంతలాంటి ఆ అతిథి బల్లమీది అందమైన 'కేక్'మీద 'చెరగనిగీతలు' పెట్టేసి ధ్వంసంచేసి దానవుంటే ఆపు అన్నట్టు చూసివెళ్తాడు. తనను ప్రేమించి గౌరవించే ఆలుబిడ్డలముందు అవమానపడ ఆ మానవుడు నిశ్చేష్టుడై నిట్టూర్చుతాడు...అతనికథ తరువాతివ్యథ ఆలోచించ మనసొప్పదు. అదిఅంతే.

'అతను'గా ప్రముఖ ఇటాలియన్ హాస్య నటుడు టోరో, నటించి నవ్వించి, కవ్వించాడు.

* * *

రెండవది ఒకానొక 'వ్యసనాళనుడి' కథ. పెద్దసైజు జమీందారు. పేకాటకి పోలెడు ఆస్తి హారతిస్తాడు. అందుకని అతని భార్య అధికారిణి అయింది. జమీందారుకి డబ్బు పుట్టదు. అప్పుకోసం చెప్పరానంతగా అపసోపాలు పడతాడు. బట్లర్ని డ్రైవర్ని కూడా అప్పులడుగుతాడు. జీతం రెండింతలు చేస్తానని ఆశపెడతాడు. రోజూ అతగాడితో పేకాడడానికి కూర్చునేవాడు గేటుకీపరు కొడుకు పదేళ్ళవాడు. దొరగారికి భయపడి ఆ తండ్రి, తనకొడుకుని దీనికి అలవాటు చేశాడు. ఆడి, ఆడి, ఆట బాగా వంటబట్టిపోయి, పేరున్న దౌర్భాగ్యంలా, వృత్తే జూదంఅయినవాడిలా అభినయిస్తూ ఆ పసివాడు ఈ ముసలివాడితో ఆడి ఓడిస్తూ ఉంటాడు. కేవలం పేరున్న వ్యసనంలాంటి ఈ ముసలిజూదరితో అతను పందెం ఒడ్డేవి—గోళీకాయలు, పంగలకర్ర, రంగులగాజు పెంకులూను. ఇతగాడు,



జూదరిగా డిసీకా



"వద్దంటే పెళ్ళి"లో [illegible]

తనమేడ, ఆస్తి, పొలాలు, అవి అయిపోయాక, కోటూ, ఆనక సూటూ ఒడ్డి (రోజూ ఆటే) ఓడిపోతుఉంటాడు. ఎన్ని ఆటలయినా ఆ పుత్రాడే గెలుస్తాడు...“పుట్టి అదృష్టం. లక్...అంతే కాని తెలివి కాదు” అని గావుకేకలు వేస్తాడు. తన ఓటమికి దురదృష్టమే కారణమని నమ్మి దలచుకున్న ఆ ముసలి జమీందారు.

“కాదులే, కావలిస్తే మళ్ళీ ఆడు... గెలిచే తెలివి, శక్తి, యుక్తి, నాదగ్గిర ఉన్నాయి” అన్నట్టు చూస్తాడు ఆ బీద పుత్రాడు చిరునవ్వుతూ పెంకిగా కొంటెగా.

“లేదు బాబూ, వాడు అదృష్ట వంతుడు. తెలివెక్కడిదీ. చిన్నప్పట్నించీ అంతా వాడికున్నదల్లా అదృష్టమే” అని నర్ది వేస్తాడు అతంం వాడైన గేటు కీపరు—తరువాతి తరానికి చెందే కొడుకుని కాపాడుకోవాలనీ. ఈదరి భూమికను డీసికా తే ధరించాడు.

* * *

మూడోకథ చిత్రమైనది. ఒక పిల్ల జమీందారు, ఒక బీదపిల్లను కామించి, దరిమిలా వంచించి తిరస్కరిస్తాడు. ఆమె ఆత్మహత్య చేసుకుంది. అప్పుడతనికి మనసు చివుక్కుమంది. ఆ పశ్చాత్తాపం ఎక్కువై అతడు తలపెట్టినపని:—ఇంకో బీదపిల్లను – ఈసారి ఒక వేశ్యను కూడావుడిగా పెళ్ళాడడం. అరాత్రే ఆమెకు సంగతి చెబుతాడు. ‘నువ్వు నా కఖర్లేదు...పెళ్ళికి కారణం పలానా...నీగతం గురించి పట్టింపులేదు. ఇప్పుడు లాంఛనంగా నాకు భార్యవి. అంతే. ఆ అమ్మాయి ఆత్మశాంతికై నాకీ శిక్ష...” అంటాడు.

“మరి నాకో?...నా కెందుకీ శిక్ష? ఈ డబ్బు, మేడా తిని బ్రతకనా?...నేను మనిషినిగానా?” అంటూంది.

ఓనో కాదో అతనికి తెలుసా?... ఆ రాత్రే ఆమె “ఈ స్మశానం” లాంటి పెద్ద భవంతిలోంచి అర్ధరాత్రిలోకి, తన నిన్నటి నికృష్టజీవితంలోకి పారిపోతుంది. ఇంతకన్న అదే నయం అనుకుని.

సిల్వానో మంగానో ధరించిన ఆ పాత్ర హృదయాలను కదల్చివేస్తుంది...

* * *

నాలుగో తిమ్మతకసా మెతను గుర్తుకుతెచ్చే రకం కథ. ఇది కూడా ఎంత నవ్వించినా ఒక మానవుడి క్షోభను హృదయాంతరాంతరాలల్లో దాచుకుంది...

అనగనగా ఒక లావుపాటి బీదవాడు. రొట్టెలమ్ముకుని బ్రతుకుతాడు. అతగాడికో అందాల భార్య. ఒప్పులకుప్ప. కాకిముక్కు దొండపండులా కనబడుతుంది ఊళ్ళోవాళ్ళకి ఆ జంట. మొగుడు ముచ్చటపడి చేయించిన



‘రామానొటిక్’ ప్రొడక్షన్ “ఆషా”లో రాజ్ మెహ్రా, వైజయంతిమాల.

వజ్రపుటుంగరం పోయింది ఓ రోజున. రొట్టెలపిండిలో పడిపోయి ఉంటుందని, ఆ నాడు రొట్టెలు తిన్నవాళ్ళందర్నీ ఓ కొలికి తెస్తాడు భర్త. చివరకది అతని భార్య ఓ పూట పనిచేసే అంగడిలోని పూలరంగడి దగ్గిర దొరుకుతుంది. ఆ అంగుళి చెప్పినక కథ ఆసాంతం వింటే తోచే నీతి:

లావుపాటి బీదవాళ్లు సోఫియాలారెన్‌ని పెళ్ళాడకూడదు.

ఇలా చిత్ర విచిత్ర గతుల పరుగెత్తే చిన్న చిన్న కథలు నాలుగింటినీ దర్శకుడు డీసికా నవ్వుపుట్టేలా తెరమీద చెప్పారు. నవ్వడం అయిపోతూవుండగా ఆ కథాంశం ‘సుతి మెత్తగా’ తగిలి చిత్రమైన ఆలోచనలు రేకెత్తిస్తుంది. చాలా దూరంగా ఉన్న పక్కింటివాడి ఈ కష్టసుఖాల కథలు కంటే వింటే, వాళ్లు మనకి ఇసింటూ జరిగినట్లనిపిస్తుంది. మనం వాళ్లే కి ఆసింటూ జరుగుతాం; వాళ్ళు స్వయంగా చెబుతుంటే, మనం వింటున్నట్టుగా. పెద్ద సంఘటనలు ఉపవృత్తాలు లేని ఈ చిన్న కథలను ఆ దర్శకుడు తెరమీద అంతగొప్పగా చెప్పారు. దర్శకుడు, నటులూ చూస్తున్న

(56-వ పేజీ చూడండి)

చిత్ర సమీక్ష:

"ఎం. ఎల్. ఏ"

ఆదర్శవాది ఆదర్శం ఏమవుతుంది? మామూలుగా తోడునీడ, వెన్నెముక,




పెండ్యాల
గులాబీకి ముళ్లు

జీవితరథసారథిపోను పోను జోహారు, అనక చిరకీర్తి లాంటివి అవుతుంది. ఉండుండి ఒకొక్కసారి మెడకు గుదిబండ అవుతుంది. స్వార్థానికీ, త్యాగానికీ మధ్య సరిహద్దుమీద నిల్చుని అటో ఇటో తేల్చుకోవలసినవాడికి పెద్ద సమస్య అవుతుంది. మంచివాడైతే, పట్టుదలగలవాడైతే ఆ గుదిబండని ఓ పక్క మోస్తూనే, మరోవంక దాన్నే పట్టుకుని తను పడిపోకుండా వేళ్ళాడుతూ నిలబడవలసిన విచిత్రమైన పరిస్థితి ఏర్పడుతుంది. కాని, ధర్మాధర్మాల, పాపపుణ్యాల, నీత్యవినీతుల నిర్వచనాలు కలిసిపోయి సరిహద్దులు జరుపుకోవడానికి, ఆత్మవంచనకూ పరవంచనకూ సదుపాయాలు ఉన్న ఈ రోజులలో ఉప్పు కొరంతి సే మనిషి అప్పుడేం చేస్తాడు?

ఆదర్శానికి విడాకులిచ్చి పదవులనిచ్చే నపై కెగబాకుతాడా? లేపోతే, దాంతో కలిసి కిందపడి దెబ్బలు తింటాడా?

ఈ ప్రశ్నతో సతిమతమైన ఒక రాజకీయవాది కథను 'ఎం. ఎల్. ఏ' (అనుపమ ఫిలింస్)లో చిత్రించారు. నిత్యజీవితంలో కనబడే, వినబడే ఆదర్శవాదుల కథల తరహా ఎలా ఉన్నా, కథలలో ఆదర్శవాదులు, కొస్తే అటూ ఇటూగా ఆదర్శప్రాయమైన [illegible], నీతిగీతి పాటిస్తారు.

'ఎం.ఎల్.ఏ.' చిత్రంలో శాసనసభ్యుడు ఎదుర్కొన్న సమస్యకు, పడ్డ ఆవేదనకూ ప్రాతిపదికలో తులంకన్న బలం లేకపోయినా, ఉన్నంతలో నమ్మతగినంతగా నటుడు జగ్గయ్య, ఆ పాత్రకు చిత్తశుద్ధిని నిజాయతీని సమకూర్చి ఒప్పించాడు. దాసు 'ఎం. ఎల్. ఏ.' కావడానికి ముందు మామూలు ఆదర్శ యువకుడు పైజామా లాల్చీ, వెయిస్‌కోటూ వేసుకుని, ఫోటోజెనిక్‌గా (మేకప్‌లో కోటా ఒక పార తగ్గిస్తే మరింత బాగుండేది) తలతాటిస్తూ ఉంటాడు. అతడు ఆదర్శ యువకుడని



తిలక్
బాక్సాఫీ సూత్రాల్లో

సావిత్రీ, రమణమూర్తి, పెరుమాళ్ళు వాళ్ళు మనకి చెబుతారు. కాని 'దామోదరం' వేషధారి గుమ్మడి వడిగితే, సర్కారు ఉద్యోగంలో ఉంటూ, ఏదో (ఏది?) పెర్మిట్ల వ్యవహారంలో రహస్యాన్ని తనకు అమ్మి లంచంతిన్నాడని చెప్పేవాడే. ఇది తెలుసుకొంటే, అలుసుతీసుకుని ఈ దాసును వాడుకో వచ్చునన్న ఊహతో భూస్వాములు దామోదరం అండ్ కో వారు శాసనసభ ఎన్నికలలో దాసుకు మద్దతు ఇస్తారు. మంచి వాడు, 'మనవాడు' అన్న నమ్మకంతో, గాంధేయ మార్గానుసారి భూషయ్య ఆధ్వర్యాన రైతులుకూడా అతన్ని బలపరుస్తారు. ఇలా "ధనికులం, రైతులం కలసి" అతని గెలిపించారు. తండ్రి చాటున ఉంటూ బీదసాదలకు సేవచేసే నిర్మల దాసుని పెళ్ళి చేసుకుని కథ నడుపుతుంది. ఉదాత్తమైన ఈ కథకు, 1957 అక్టోబరు 9 వ తేదీనాటికి (అనక చాలకాలందాకా) కూడా 'వార్త' అనిపించుకునే ఘట్టంలోనే ఉండే 'భూతపతికి గరిష్ఠపరిమితి' సమస్యను

మాటలు తాపీ, ఆరుద్ర. పాటలు ఆరుద్ర, కొగంటి. సంగీతం పెండ్యాల. నృత్యం వేణుగోపాల్. ఛాయాగ్రహణం లక్ష్మణ్ గోరే. శబ్దగ్రహణం సూర్యనారాయణ, రామచంద్రరావు. పాటలు రంగసామి, రాజగోపాల్. ఆర్టు సూరన్న. ఎడిటింగ్ వీరప్ప, వెంకటేశ్వరరావు. సహాయ దర్శకులు మానార్, బాపయ్య, రఘు.

ప్లేబాక్: జిక్కి, సుశీల, జానకి, ఘంటసాల, రాజా, మాధవపెద్ది. స్టుడియో వీనస్, ప్రకాష్. స్టిలు కె. వెంకటేశ్వరరావు. నటులు: సా[illegible], గిరిజ, సూర్యకళ, జగ్గయ్య, గుమ్మడి, పెరుమాళ్లు, రమణమూర్తి, రమణారెడ్డి, చదలవాడ, నాగభూషణం, ఆర్. వి. కృష్ణారావు, కల్లం నరసింహారావు. బొడ్డపాటి కృష్ణారావు. నర్తకి ఖుర్షీద్.
దర్శకుడు తిలక్.

మితిమీరని విధానజోడించి తెలుగు చలనచిత్ర చరిత్రలో 'అనుపమ' కార్యం తలపెట్టి ఒప్పించారు. అనక, ఎందుకో అందరికీ తెలిసినా, 'ఇదెందుకు చెపుమ?' అనిపించే ప్రేమాయణాన్ని ఈ రాజకీయ రామాయణంలో మిళాయించారు-దిష్టితగలకుండా.

'ఎం. ఎల్. ఏ' దాసు కౌలుదార్ల రక్షణ సమస్యను మంత్రిగార్లకు విన్నవించుతాడు. బళ్లు, పెట్టించడం, రోడ్లు వేయించడం లాంటి, సత్కార్యాలు త్వరగా తెమితేలా చూసి మంచివాడనిపించుకుంటాడు. లావు



గుమ్మడి
కృషిఫలితం రెండుకోట్లు

పాటి పుస్తకం చదువుతున్న సభ్యుడు, సరిగ్గా పదిపేజీలే మిగిలితే, అది మాపటికే చదివెయ్యాలి కాని రేపటికి వాయిదావెయ్య రాదనీ, భూసంస్కరణల గురించిన రికార్డులు చాలా ఉన్నప్పటికీ నన్ని మంచి బాలుడు రాముడిలె పెందలకడనే పడుకొని మర్నాడే చదవాలనీ అంతగా అయితే, సావిత్రి ఉరఫ్ నిర్మలకి కొన్ని ఇచ్చి వాటి సారాంశం (పరీక్షలో 'గైడు'లా)రాయించుకునిచదివెయ్యొచ్చుననీ సందేశాలు బట్వాడా చేస్తాడు.

“ఇవన్నీ బాగానే ఉన్నాయి. బులబులాగ్గా నీయిష్టం వచ్చినంత దేశసేవ చెయ్యి కాని, భూసంస్కరణల జోలికి పోకు సుమీ” అని హెచ్చరిస్తాడు అతనికి పెట్టుబడిపెట్టిన గుమ్మడి దాసుకి ఈయనతో పాత మొహమాటాలున్నాయి. పైగా ఎం. ఎల్. ఎ. అయ్యాక, క్వార్టర్సులో ఉండికాలక్షేపం చెయ్యకుండా, ఆలోచిస్తూ బాధపడుతూ తిరగడానికి డాబాలాంటి సదుపాయాలున్న పెద్ద బంగళాలో కాపురం పెడతాడు దామోదరం మద్దతుతో.

ప్రజలు తనను నమ్మి ఎన్నుకున్నారన్న సత్యంమీద గౌరవంతో విధ్యుక్త ధర్మ పరిజ్ఞానంతో, దాసు భూకమతాలకు పరిమితి వ్యవహారం తలపెట్టి, మంత్రిదగ్గరకు రాయబారం వెళ్ళి వినతి పత్రం సమర్పించ నిశ్చయిస్తాడు.

అప్పటికే, దూరదృష్టితో ఆలోచించి, భూవసతిని ఫ్యాక్టరీ ఆస్తిగా ఫిరాయించెయ్యడానికి పథకం వేసుకున్న దామోదరం వర్గానికి కోపంవస్తుంది.

పూర్వం ఒకసారి లంచం తీసుకున్న సంగతి అధికారులకు తెలిసిపోయిందనీ, పదేళ్ళు ప్రమోషన్ ఇవ్వకూడదని ఆర్డరు చేశారనీ తెలుపుతూ దాసు తనకు రాసిన ఉత్తరం బయటకుతీసి దాంతో, “నీ భవిష్యత్తును గంగలో కలిపేస్తాను”అంటూ దాసును భయపెడతాడు. దామోదరం. దాసు భయపడతాడుకూడా. చివరికి, ఊళ్ళోవాళ్లూ కట్టుకున్న పెళ్ళాం కూడా అసహ్యించుకోవడంతో తెగించి,“కళావెంకట్రావుగారి” దగ్గరకు రాయబారం వెళ్ళి వినతి పత్రం అందజేస్తాడు.

“భూవసతికి 30 ఎకరాలు గరిష్ట పరిమితి ఉండాలండి” అంటాడు దాసు. భూసంస్కరణల రికార్డులను ఆరోజు రాత్రి తను చదవక, సావిత్రి చదివి సారాంశం వ్రాసి ఇచ్చినందువల్ల అది మెట్టో మాగాణో స్పష్టంగా చెప్పడు. మెట్ట గురించి ఎవరూ పట్టించుకోరుగాబట్టి, మాగాణే అని అందరికీ తెలుసు కాబట్టి ఫరవాలేదు.

చివరికి దామోదరానికి కోపం వచ్చేస్తుంది. ఆ ఉత్తరం బయట పెడదామని చూస్తాడుగాని, కొన్ని సినిమా కారణాల వల్ల అది రమణమూర్తికి దొరుకుతుంది. దాన్ని అతడు దాసుకి చూపి చింపి పారేస్తాడు. అక్కడితో దామోదరానికి మతిపోతుంది. అందువల్లనే దాసును లోగడ శిక్షించిన గవర్నమెంటు అధికారులద్వారా ఆ గుట్టు బయటపెట్టవచ్చునని తట్టదు. అంతేకాదు. దాసుని ఖూనీ చేయించాలనుకుంటాడు కూడా. దానికేనా పాత సినిమా అయిడియా వాడుతాడు. ఆ తరవాతది- దాసు భార్య శీలమును శంకించుట, స్వగతంగా, ప్రకాశంగా పవర్ ఫుల్ డైలాగులు అనుకుంటూ, వింటూ, బాధ పడి పడి, ఆవకలారీకింద పడి, ఆస్పత్రిలో చేరుట-తక్షణమే అతని స్టార్ వాల్యూ పెరుగుట-గ్రూపు ఫొటో, అన్నీ ఉన్నాయి.

నిర్మల నిర్మలకాదనీ, మారు వేషంలో ఉన్న 'సుశీల' అనీ ఋజువు అవుతుంది.



ఎన్. ఎ. టి. వారి “పాండురంగ మహాత్మ్యం” లో నాగయ్య.

కథాంతం ఎలా ఉన్నా, అనేకవిధాల మెచ్చుకోతగ్గ చిత్రం. “ఎం. ఎల్. ఎ.”. మనుషుల్ని రెండుతో భాగించి మంచి చెడ్డా అని ఖచ్చితంగా పోతపోసినందువల్ల రాజకుమారుడూ రాక్షసుడూ శ్రీమహావిష్ణువుల కథల పరిమళం అక్కడక్కడ గుబాళించినా, రాజకీయవాదుల స్వరూప స్వభావాలను, ఆదర్శాలకు, వాటిని పనికేసుకొచ్చే పెద్దలకూ ఉండే చుట్టరికాల లోతుపాతులు, తీసుతెన్నులనూ తెలుగునాటి ఎన్నికల తిరువాళ్లనూ దర్శకుడు తిలక్ ఇందులో ప్రతిభావంతంగా చిత్రించి చక్కటి వ్యాఖ్యానంగా రూపొందించారు. ఇందులో నటీనటులంతా కూడా, అతి ఉత్సాహంతో సహకరించి మనం గొప్పగా చెప్పుకోతగ్గ మంచి తెలుగు చిత్రాన్ని రూపొందించారు. బాక్సాఫీస్ సూత్రాలు తాళ్లుగా తయారై, బలవంతం చేసిఉండకపోతే, దర్శకుడు తిలక్, ఈ నటీనటులూ ఇదే కథావస్తువుతో ఇంతకన్న ఉత్తమచిత్రాన్ని రూపొందించగలిగేవారని అది అఖిలభారతస్థాయిలో పేరు తెచ్చిపెట్టగలిగేదని అనుకున్నపుడు వర్తమానపరిస్థితుల మీద ఎవరికైనా చిరాకు కలుగుతుంది...

ఈ చిత్రంలో కథావస్తువునుబట్టి, ఆశయాలూ, ఆదర్శాలూ, ఆచరణ, ధర్మం లాంటి మాటలు తప్పనివే అయినా, వాటిని యతిశతాలతో కూర్చి, సామెతలలా పేర్చి మామూలు సంభాషణ లన్నింటిలోనూ చేర్చి అదేపనిగా గుప్పించడంతో, ఆశయాలూ, ఆదర్శాలూ, అప్పడాలూ, వడియాలూ అని వినబడే పరిస్థితికి వచ్చాయి. వెనకటి కెవరో శుద్ధగ్రాంధికం మాట్లాడబోయి 'క్రందిపప్పు' అన్నట్టుగా, సజీవంగా చైతన్యవంతంగా ఒప్పిన మనుషులనోట, కథ పేరిట పడికట్టు రాళ్ళలాంటి మాటలు పనిగట్టుకు అనిపించడం భావ్యం అనిపించ లేదు. పెరుమాళ్ళు, సావిత్రి ఉత్తమంగా నటించిన పాత్రలు వీటివల్లకొంత అవాస్తవప్రాయా లయాయి. పెరుమాళ్ళు నటన పాతచిత్రా లన్నిటికన్న పదునుగా తూకంగా సాగింది. ఉన్నవారిలో గుమ్మడి ఉత్తమంగా నటించాడు.

దర్శకుడు తిలక్ ఈ చిత్రంలో రమణమూర్తి అనే కొత్తనటుడి పరిచయంచేశారు. జంకూ గొంకూ లేకుండా, చెప్పుకోతగ్గ సౌలభ్యం ఉట్టిపడేలా ఆ నటుడు తన పాత్రను హుషారుగా నిర్వహించాడు. ఇతనికి మంచి భవిష్యత్తు ఉంటుందని ఆశించవచ్చు. కొత్త నటుడు అన్నభావం, చూస్తున్నంత సేపూ కలగదు. ఎలాగా డబ్బున్నవాడివేషంకాబట్టి, ఇంకో రెండుసార్లు దుస్తులు, ఒకసారేనా 'హెయర్ స్టైలు' మార్పించి ఉంటే బాగుండేదనిపించింది. దిలీప్‌కుమార్ వేషం వేసుకుని, రాజ్ కపూర్ పద్ధతిలో వ్యవహరించినట్లనిపిస్తుంది; నిజం అదికాకపోయినా. అతగాడి జతగా గిరిజ ఎన్నడూ లేనంత హుషారుగా నటించింది. ఇందులో ఆమె వేషం విలాసం రూపురేఖలూ కూడా బాగున్నాయి.

ముఖ్యంగా, ఔట్‌డోర్ దృశ్యాలలో (ఇవి చిత్రంలో పుష్కలంగా ఉండి ప్రాణానికి హాయి అనిపించాయి.) ఈ జంట పాల్గొన్న సన్నివేశాలు చాలాబాగున్నాయి “జామిచెట్టుమీద నున్న జాతిరామచిలుకా” అనేపాట (రాజా, జిక్కి) మనోహరంగా ఉంది. మొత్తంమీద ఈచిత్రంలోతొమ్మిది పాటలూ వినడానికి చాలాబాగున్నాయి. రెండుమూడు తగ్గిస్తే ఇంకా బాగుండేది. పెండ్యాల (భాగ్యరేఖ) నాగేశ్వరరావు ఇందులోకూడా తియ్యటి తెలుగుసంగీతాన్ని, మధురమైనదాన్ని వినిపించారు. ఒకచోట

56-వ పేజీ చూడండి)

బొంబాయి లేఖ :

'జమానా' సమీక్ష



'జమానా'లో అమిత

'దొం'గచాటు పద్ధతుల్లో సాగేసుకున్న డబ్బు, ఇవాళో రేపో లాభసాటిగా ఉన్నట్టు కనబడ్డా లేపోయినా తిరగబడి కాటేసి గొడుతుంది సుమీ' అని చెబుతూ ఫిలింస్థాన్ వారు నిర్మించిన "జమానా" చిత్రం మొన్న విడుదల అయింది. ఊహ మంచిదయినా, తెరమీద కెక్కేసరికి ఇది పూర్తిగా తేలిపోయింది. రచన (నబేందు ఘోష్) కట్టుదిట్టంగా లేకపోవడం, నటన (నాయకీ నాయకులు) లోపభూయిష్టంగా ఉండడం ఇందుకు కారణాలు అనిపిస్తుంది. పని తెలిసిన దర్శకుడు పూనుకొన్నా మితి తెలియని నటులతో కథ చెప్పబోవడం ఎంత నిరుపయోగమో ఇది నిరూపిస్తుంది. అమిత, కమల్‌జిత్, ఇందులో నాయకీ నాయకులు. నజీర్ హుసేన్, జాగీర్దార్, యాకూబ్, ఇతర భూమికలు నిర్వహించారు. దర్శకుడు అరవింద్ సెన్.

ఒక మంచివాడు, ఒక చెడ్డవాడూ ఉంటారు. మంచివాడు మర్యాదగాబతుకుతాడు కాబట్టి మొదట్లో కష్టాలు పడతాడు. చెడ్డవాడికి ధర్మాధర్మాలవిషయంలో అట్టే పట్టింపులేదు కాబట్టి, యజమానికి ఝామ్మని ద్రోహం చేసేస్తాడు. తక్షణం అతన్ని సిరివరిస్తుంది. ఆవిడ, 'అయోగ్య పారబాటు'ని పాలిక్కరచుకుని, అదురాగ్రగణ్ణివదిలి వెళ్ళిపోయేలోగా మంచివాడి బీదకుమారుడిని ఆ చెడ్డవాడికుమార్తె ప్రేమిస్తుంది. కష్టాలు ఆరంభంఅవుతాయి. బీద మంచిపిల్లవాడు బాధ భరించలేక మంచితనం, ధర్మం చవటల మూర్ఖుల గుణాలు అన్న అభిప్రాయంలో పడబోతాడు. పడితే సినిమాలు నీతులు అనవసరం. అందుకని సరిగ్గా ఆ వేళకి కథ దారినపడి బుద్ధిగా ఫుల్‌స్టాపువేపు వెళిపోతుంది. అమ్మాయి అబ్బాయి పెళ్ళాడతారు.

ఆ అబ్బాయి వేషంవేసిన కమల్‌జిత్ నటన, పాత్రకు తగినట్టు లేదు. మితిమీరిపోయింది. సంభాషణలు చెప్పినవిధం, మాటల ఉచ్చారణకూడా ఎబ్బెట్టుగా ఉన్నాయి. ప్రణయసన్నివేశాలలోమటుకు ఫరవాలేదనిపించింది. హఠాత్తుగా వక్రమార్గాల ద్వారా డబ్బు గడించిన దుష్టుడి కుమార్తె నీలగా 'అమిత' నటనకూడా అదే ఛాయాలో ఉంది. తెచ్చిపెట్టుకున్న కులుకు హొయలూ, మాటతరహా మితిమీరడంతో కట్టుతప్పిన పిల్లగా ఆమె ప్రదర్శించిన నటన, వికటించి, ఈ నటికూడా కట్టు తప్పిందనిపించేలా తయారయింది. ఈమెకు ఈ భూమిక ఎందుకు ఒప్పగించారు? ఎవరాపని చేశారు అనిపిస్తుంది. ఐతే [illegible]లోనూ ఈమె కొ[illegible] మెరుపు.

కష్టాలు భరించి మంచిగానే నెగ్గుకొచ్చిన సుజనుడుగా నజీర్ హుసేన్ నటించాడు. ఆ పాత్రకు చేసిన రూపకల్పనముందు ఈ నటుడి శక్తి దిగదుడుపై పోయింది. అస్తమానం ఒగరుస్తూ నురగలు కక్కుతూ ఆడంబరం ఉట్టిపడే పెద్దపెద్ద వాక్యాలు వల్లించేస్తున్న ఈ ఆసామిని చూస్తే ఒక్కొక్కసారి చిరాకేస్తుంది. ఈ చిత్రం రాణించక పోవడానికి మూడో కారణం ఈ పాత్రకు ఈ నటన. నిండుతనంతో మితిమీరకుండా ఒప్పిన నటన ప్రదర్శించినవారు ఇద్దరే—జాగీర్దార్, యాకూబ్. వక్రమార్గాలలో పాపపుడబ్బు గడించిన దుష్టుడిపాత్రను జాగీర్దార్ బాగా పోషించాడు. సాధ్యమైనంతవరకు ఆపాత్రకు సహజత్వాన్ని సమకూర్చి, ఇలాంటివాళ్ళు ఉన్నారన్న నమ్మకం కలిగేలా నటించారు. నజీర్ హుసేన్ ధరించిన సుజనుడిపాత్ర ఇందుకు శుద్ధవిరుద్ధం.

యాకూబ్ ఇందులో హాస్యం సరఫరా చేశాడు. ఈ చిత్రం పూర్తి అయేలోగా, ఈ మనిషి మళ్లీ మళ్లీ కనబడాలనిపిస్తుంది. దిగులు మితిమీరినపుడల్లా యాకూబ్ వచ్చి నవ్వించాడు. షెరో నృత్యాలు కంటికింపుగా ఉన్నాయి. ఛాయాగ్రహణం బాగుంది.

అంగట్లో అన్నీ వున్నా అల్లుడినోట శని అన్నట్టుగా మంచికథ, సమర్థుడయిన దర్శకుడువున్నా, వెండితెరకథనం (స్క్రీన్‌ప్లే), ముఖ్యనటులనటన నేలబారుగా ఉన్నందువల్ల చిత్రంకూడా ఆ స్థాయికే దిగింది. ఇందుకు దర్శకుడుమటుకు ఏం చేయగలడనిపిస్తుంది.

ఇవన్నీ చూచే కాబోలు, సలీల్ చౌదరి కూడా ఈ చిత్రానికి సగటురకం సంగీతం చాలని, అంతే కూర్చారు. ★

★ ఆగ్రారోడ్ ★

నగవా ఫిలింస్ వారి "ఆగ్రారోడ్" కూడా గతవారమే విడుదల అయింది.



'ఆగ్రారోడ్'లో షకీలా

షకీలా, దేవానంద్ తమ్ముడు విజయ్ ఆనంద్ బేబీనందా, రమేష్‌సిన్హా, అమర్‌నాథ్, సతీష్ వ్యాస్ పాల్గొన్న ఈ చిత్రానికి రవీంద్ర దవేదర్శకుడు. నటీనటులప్రతిభవల్లనే చిత్రం రాణింపుకు వచ్చిందని చిత్రం చూడగానే అనిపిస్తుంది. చలనచిత్రకళ, శిల్పం, ఉత్తమోత్తమ ప్రమాణాలూ, మొదలైనవాటిమాట దేవుడెరుగుగాని, కాలక్షేపానికి చూడతగ్గ చిత్రం అని గట్టిగా చెప్పుకోవచ్చు. ఖూనీ నేరం, దానితాలూకు పరిశోధన, అందుకు చెందిన హంగులు సర్వమూ ఉన్నాయి. డబ్బుమీద సరదాకొద్దీ ఒక యువకుడు ఆస్తిపరుడైన మామయ్యను చంపేశాడు, ఆయన లిద్దర్నీ కుమార్తెకూడా వధించి ఆస్తిని అపహరించాలని ప్రయత్నిస్తాడు.

ఆ ప్రయత్నం విఫలంకావడమే యీ చిత్రంలో కథ. అలాంటి ప్రయత్నాలు తిన్నగా కలిసిరావని చెప్పడమే దీనిలక్ష్యం

ఈ తరహా కథలు చిత్రించినపుడు ఉత్కంఠను కట్టుదిట్టంగా పోషించి, కథను రక్తి కట్టించాలి. ఇందులో ఈ ఏర్పాటున్నప్పటికీ కథ చాలాసార్లు కప్పదాట్లు వేసింది. దర్శకత్వంలో చెప్పుకోతగ్గ ప్రతిభ కనబడదు. కథను కొత్తతమాషాగా చెప్పాలని, హడావుడి చెయ్యాలనీ ప్రయత్నం చేసినట్టు కనబడదు. అందువల్ల ఇది అత్యద్భుత చిత్రరాజం కాలేదు. కాకపోయినా ఫరవాలేదు. కూర్చున్న కాసేపూ కాలక్షేపానికి ఢోకా లేదు. కోటీశ్వరుడుగా రమేష్ సిన్హా నటన మంచి హుందాగా ఉంది. ఉన్న వారిలో ఈయనే పాత్రను బాగా ఒప్పించాడు. విజయానంద్ నటించడానికి ఇదే తొలిసారి. విగ్రహం, నటన బాగానే ఉన్నాయికాని, పాటిలేనిమేటి నటుడు కాగల సూచనలు కొట్టొచ్చినట్టు కనబడవు. అతగాడి ప్రియురాలుగా వకీలా మనోహరంగాఉంది. కోటీశ్వరుడి రెండవ కుమార్తెగా బేబీనందాకూడా బాగా నటించింది. చిలిపితనం ఉట్టిపడే బడిపిల్ల పాత్రను నందా సరిగ్గా సరిపోయింది. ఆ పిల్ల జతగాడు మాగవాడు. (సతీష్ వ్యాస్) ఇతగాడూ, విజయానంద్ కలిసే ఖూనీకోరు హత్యా ప్రయత్నాన్ని ప్రతిఘటించి గెలుస్తారు. ఆ హంతకుడి భూమికను అమర్‌నాథ్ ప్రశంసనీయంగా నిర్వహించాడు. సబబూ బేసబబూ ఎలా ఉన్నా, ఉన్నకథలో ఈ పాత్రను బాగా ఒప్పించాడు.

సంగీతం (రోషన్) వినడానికి బాగానే ఉందికాని ఏ పాటా 'హిట్' కాగల ప్రమాదం ఉన్నట్టు తోచదు.

* * *



"హిల్ స్టేషన్" అపరాధ పరిశోధక ఇతివృత్తంతో రూపొందింది. ఇందులో ఉత్కంఠ బాగా పోషించారు. బొంబాయి నైట్ క్లబ్‌లలో నర్తకిగా బీనారాయ్ చూడడానికి చాలాబాగుంది. ఇతరనటులు ప్రదీప్ కుమార్, కె. యన్. సింగ్, శ్యామ.

ఈ చిత్రానికి విశేషాకర్షణ హేమంత కుమార్ సంగీతం.

★

వార్తలు

అక్టోబరు నెల వచ్చే చిత్రాలలో ముఖ్యమైనవి:

మెహబూబ్ ప్రొడక్షన్స్ వారి "మదర్ ఇండియా." మెహబూబ్ లోగడ నిర్మించిన హిట్ చిత్రం "ఔరత్" ఒకవిధంగా దీనికి మాతృక. ఆ కథను కొత్త తర్జుమా చేసి, (గేవాకలర్) రంగులువేసి, హంగులు కూర్చి దీన్ని రూపొందించారు. ఆనాడు సర్దార్ అఖ్తర్ నిర్వహించిన భూమిక ప్రతిరూపాన్ని ఈనాడు ఈ చిత్రంలో నర్గీస్ ధరించింది. ఆమె కుమారు లిద్దరిలో దుర్మార్గుడుగా సునిల్ దత్, బంగారు తండ్రిగారాజేంద్రకుమార్ నటించారు. సంగీత నిధి నౌషాద్ దీనికి సంగీతం సమకూర్చారు ఈ చిత్రానికి ప్రారంభోత్సవ ప్రదర్శనం లండన్‌లో ఏర్పాటుచేసి ఆ సందర్భంలో బ్రిటిష్ ప్రముఖులకు నాయకి నర్గీస్‌ను పరిచయం చేస్తారు.

"నౌషెర్వాన్"

భారీఎత్తున తయారైన మరో చిత్రం సొహ్రాబ్ మోడీ కానుక "నౌషర్వాన్-ఎ-ఆదిల్" చక్రవర్తిగా సొహ్రాబ్ మోడీ, ఆయన భార్యగా నసీమ్ నటించారు. నాయకీ నాయకులు రాజ్ కుమార్, మాలా సిన్హా.

సంగీతదర్శకుడు సి. రామచంద్ర.

రాజ్ తిలక్

జెమినీ-చిత్రం. పద్మిని, వైజయంతిమాల ఇందులో ఉన్నారు. కాబట్టి ముఖ్యంగా నృత్యాలూ, నాటకీతగ్గ పాటలూ ఉంటాయి. నాయకుడు జెమినీ గణేశన్.

దీనికి సంగీతదర్శకుడు సి. రామచంద్ర.

(ఆంధ్ర వారపత్రిక బొంబాయి విలేఖరి)

★

"ఫ్రెండ్లీ పెర్సువేషన్"

పళ్ళూ, పూలూ, చందనతాంబూలాలూ, నైవేద్యం అన్నీ అమర్చిపెడితే, వచ్చి కూర్చుని ఓ పువ్వుముక్క వడేసి లింగిలింగి మంటూ గంటవాయించడంతప్ప నువ్వు చేసిందేమిటయ్యా అన్నదో అర్ధాంగి, ప్రాణేశ్వరుడిమీద ఒళ్ళుమండి.

అలాగే ఎవడో కథ కట్టగా, ఇంకెవడో దానికి వైద్యంచేసి, మరొకడు మాటలురాసి, కొండొక ఆసామి వేషంవేసి వ్యవహారం నడిపితే, డైరెక్టరు చేసిందేమిటీ మధ్య-రైలు గార్డులా కట్టూ పార్టూ అనడంతప్ప అవటాని కొందరు కొప్పడుతూఉంటారు.

ఈ అభాండంమీద ఇదివరకే చాల్డ తర్జనభర్జనలు జరిగాయి. పెద్దసైజు వ్యాసాలు సంభవించాయి.

అలా కట్టూ పార్టూ అనడమే కాకుండా, సినిమా పాడుగునా సింబాలిజంకోసం వెతుక్కుని మురిసిపోయేవాళ్ళకి ఆ తరహా చమక్కులు చూపించడమే కాకుండా, గొప్ప దర్శకుడు అయిన మనిషి ఒక కథను తెరమీద ఎంత గొప్పగా చెప్పగలడో, "ఇది దర్శకుడి ప్రతిభే" అని వద్దన్నా అనిపించే పద్ధతులు ఎలాటివో, ఎంత అందమైనవో, ఎంత తేలికగా తెలిసేవో తెలుసుకోవాలంటే, విలియం (రోమన్‌హాలీడే, సబ్రీనా) వైలర్ నిర్మించిన "ఫ్రెండ్లీ పెర్సువేషన్" అనే చిత్రం చూడవచ్చు.

ఒక అమెరికన్ గ్రామీణ కుటుంబం కథను ఇందులో చెప్పారు. అయితే యిది మామూలు రైతుకుటుంబం కాదు. కొందరు చిన్నచూపు చూసి, ఒక్కరకం వ్యవహారంచేసే 'క్వేకర్'ల కుటుంబం. వీళ్ళు దాదాపు ఒక వర్గంవంటివాళ్ళు. శాంతి ప్రియులు. అహింస పరమధర్మమని మనసా నమ్మిన మనుషులు. జార్జి ఫాక్స్ అనే ఆయన ఒకప్పుడు మిత్రమండలి ఒకటి నెలకొల్పాడు. ఈ ధర్మాలు శిరోధార్యాలని వాళ్ళకిచెప్పి, భగవంతుడిపేరు వింటే భయభక్తులతో వణకవలసిందేనని అన్నాడు. అప్పట్నించి నాటి వారే ఈ శాంతి వాదులను, అహింసా ప్రియులను, 'పిరికి' వాళ్ళగా, మెతకమనుషులుగా జమకట్టి 'క్వేకర్లు' (వణికేమనుషులు)అని పేరుపెట్టి వేళాకోళం చేయడం పరిపాటి అయింది. ఎవరు ఏమన్నా దైవభక్తి పాపభీతి వాళ్ళకి వదలిపోలేదు. మనవేపు పూర్వాచార పరాయణుల తరహాలే వీరిలోకూడా అనేక విషయాలలో కనబడుతాయి. ఔనన్నా, వద్దన్నా అన్నా, వీళ్ళుకూడా, 'నువ్వు, నీది' అన్నపుడు యూ, యువర్స్ బదులు దీ, దౌ, దైన్ అంటూ కొత్త మడిగట్టుకు మాట్లాడతారు. క్రైస్తవు

ఫ్రెండ్లీ పెర్సువేషన్

అంతా చర్చిలో ఆర్గన్ వాయిద్యం ఉపశ్రుతిగా గొంతెత్తి ఈశ్వరుణ్ణి కీర్తిస్తారు. వీళ్ళ పద్ధతిమటుకు అలా ఉండదు. నలుగురు ఒకచోటచేరి మౌనం అవలంబించి దైవ ధ్యానం చేస్తారు. మనోవాక్కాయాలా ఎవరికీ హానిచేయ పూనరు.

జూదాలూ, పోటీలు, వేట, మద్యపానం లాంటి వ్యసనాలూ సరదాలు కూడా నిషిద్ధాలు. ఇవన్నీ చూసి సాటి అమెరికన్లు వీళ్ళని హేళనచేస్తారు. 'దీ' 'దా' గాళ్ళు అని వెక్కిరిస్తారు. అయినా వీళ్ళుమటుకు మాట తూలరు.

ఇలా బహుయోగ్యులుగా బతుకుతున్న ఈ సంఘీయులలో ఒక కుటుంబం కథను ఇందులో చిత్రించారు. అమెరికాలో బానిసతనంనిర్మూలనపై ఉత్తరదక్షిణ రాష్ట్రాలకు యుద్ధం జరుగుతున్న రోజులు అవి.

దక్షిణాదివారు దండెత్తివచ్చి ముఠాలుగా ఊళ్లమీదబడి దోచుకుంటున్నారు. పాడీ పంటా నాశనంచేస్తున్నారు. ఈ పరిస్థితులలో వాళ్ళని ఎదుర్కొనడానికి ఊరూరా సైనికులు కావలసివచ్చారు.

ఇండియానా రాష్ట్రంలోని శాంతివాద మండలి సభ్యులుమటుకు యుద్ధంలో చేరి ప్రాణిహింస చేయడానికి ససేమిరా ఒప్పుకోలేదు. శత్రువులు దండెత్తివచ్చినాసరే తుపాకి పట్టేదిలేదన్నారు.

“ఈ పోరాటం బానిసతనం నిర్మూలన కోసం. సాటి మనుషుల దాస్యబంధాలు ఛేదించడానికి మీరు తోడ్పడరా?” అన్నాడు వారిని పిలవవచ్చిన సైనికాధికారి.

“ఒకమనిషికి స్వతంత్రం ఇప్పించడం కోసం మరోమనిషిని ప్రాణం తియ్యడం ధర్మమా?” అంటారు అహింసావాదులు.

జెస్సీ కుటుంబంలో అది పెద్ద సమస్య అయిపోయింది. జెస్సీ పెద్దకుమారుడు జాషువ యుద్ధంలో చేరుతానన్నాడు. తల్లి వద్దన్నా వినక తుపాకి పట్టుకొనివెళ్ళాడు. మర్నాడే యుద్ధంలో గాయపడ్డాడు. ఆఖరికి జెస్సీయే యుద్ధానికి వెళ్ళక తప్పింది కాదు. పరిస్థితులబలం అలాటిది. ఆ కుటుంబం అంతటినీ అదుపాజ్ఞలలో పెట్టేగృహిణి కూడా తప్పనిసరిపరిస్థితులలో 'తోటిప్రాణి' మీద చెయ్యెత్తక తప్పిందికాదు. ఎటొచ్చి ఆ తోటిప్రాణి మదించిన శత్రుసైనికుడు. భర్త అటువెళ్ళగానే ఓ ముఠా ఆ యింటి మీదకు దండెత్తివచ్చింది. ఇంట మొగదిక్కు కూడాలేని ఆ ఇల్లాలు దోచుకోవచ్చిన ఆ ముఠాను చిత్రంగా అదుపులో పెట్టింది. ఎప్పటిమల్లేనే ఠీవిగా నిలబడి వాళ్ళని తన యింటికి ఆహ్వానించింది. పళ్ళూ కాయలూ కోసుకోమంది. వంటిల్లుచూపి వండుకుతినమంది. బసచూపి విశ్రాంతి తీసుకోమంది. తన్ని, చంపి, దోచుకుపోవడమే తెలిసిన ఆ ముఠా ఈ అబలయెదుట లొంగిపోయి మర్యాదగా ప్రవర్తించింది. కాని ఒకడు మటుకు ఆయింటి పెంపుడుబాతును పట్టుకు చంపబోయాడు. అప్పుడు ఆ యిల్లాలు చేతికందిన చీపురుకర్రతో అతన్ని మెత్తగా చితగ్గొట్టి బాతుని బతికించింది.

యుద్ధరంగానికి వెళ్లిన ఆమెభర్త మాత్రం హింస చెయ్యకుండానే చాకచక్యంగా శత్రువును అదుపులోపెట్టి, అతని చంపక క్షమించి విజయం సాధించాడు.

స్నేహభావంతోనే శత్రువును వెనక్కు మళ్ళించ గలిగాడు.

ఇదే కథాంశం. ఈనీతులు సృష్ట్యాదినుండీ ఉన్నవే. అబద్ధమాడ కూడదని అందరూ చెబుతారు. అయితే చెప్పడం తలోవిధంగాను ఉంటుంది. కొందరు చెబితే కోపం వస్తుంది. కొందరు చెబితే నచ్చుతుంది. విన మనసవుతుంది. ఆ నీతి కొత్తది గొప్పదీ కాబోలనిపిస్తుంది.

విలియం వైలర్ ఈనీతినినీతిగా కాకుండా, ఆహ్లాదకరమైన మనోహరమైన కథగా చెప్పారు. ఆచెప్పడంలో అమెరికన్ పల్లెలో సామాన్యుల ఈ సగటు కథను అన్యావాతిరిక్తంగా చూపించారు. వారి తీరుతెన్నులను, నిత్యజీవితంలో కష్టసుఖాలను, సరసాలను విరసాలను, చిరాకులను పరాకులను చిన్నచిన్న చమత్కారాలను మరపురాని రీతిన ముచ్చటగా చిత్రించారు. అమెరికన్ పల్లెలలో ప్రజల జీవనవిధానాలను మనం చూచి ఉండకపోవచ్చు. వాటిగురించి ఆట్టే చదివీ ఉండకపోవచ్చు. అయినా ఈ సినిమాలు చూస్తూ ఉన్నపుడు వాళ్ళిలాగే ఉనిటారని మనసుకు తోస్తుంది. నమ్మకం కలుగుతుంది. ఇది చాలా బాగుందనిపిస్తుంది. సినిమాలో కనబడుతున్న మనుషులు ఎవరో సీమ దొరలన్న భావంకూడా ఆట్టేసేపు నిలువదు. మనకు తెలిసినవాళ్ళు, కావలసినవాళ్ళు అనిపించేస్తుంది. క్రమంగా వాళ్ల గుణదోషాలు రెండూ కూడా మనలో అభిమానాన్ని, వాత్సల్యాన్ని కలిగిస్తాయి. ఇదే ఉత్తమ చలనచిత్ర ప్రయోజనం. దీన్ని విలియం వైలర్ ఈ చిత్రంలో సాధించి చూపించాడు.

* * *

ఇంటిపెద్ద జెస్సీ, భార్యా, చేతికందిన పెద్ద కొడుకూ, పెళ్లీడు కూతురూ, పదేళ్ల పెంకిభడవ కలిసి సంబరానికెళ్తారు. మన వేపు సంబరాలలో గారడీలు, గరిడీలు, లాటరీలు, టోకరాలు ఉన్నట్టే అక్కడా అన్ని హంగులూ వుంటాయి. ఈ కుటుంబంలో ఒక్కొక్కళ్ళకు మతిపోతుంది అవన్నీ చూసేసరికి. అయితే ఇల్లాలిమాట జవదాట లేరు ఎవరూ. ఆవిడ కూరలూ, గిన్నెలూ అమ్మే దుకాణాలవేపు వెళ్దామంటుంది. భర్తకి ఇంకటో దృష్టివుంది. కోళ్ళూ బాతులూ ఎలా ఇస్తున్నారో చూస్తానని



విజయగోపాల్ ప్రొడక్షన్‌వారి “గంగా గౌరీ సంవాదం”లో రమణారెడ్డి, కృష్ణకుమారి.

ప్పి తప్పించుకొని సరాసరి తుపాకీ లాటరీ దగ్గరకు వెళ్తాడు. అక్కడ ఇంకో దుకాణదారు తగిలి, రైతులాటి ఈ రైతుకి కబుర్లు చెప్పి ఆర్గన్‌వాద్యం అమ్మేస్తాడు. ఈలోగా పెద్దకొడుకు కుస్తీపట్ల పోటీచూడబోతాడు. ఇక కూతురు అటూ ఇటూ చూసి, తా వలచిన ప్రియుడితో నృత్యం చేయబోతుంది. చిన్నకొడుకు చిటికెలో కన్ను మరగేసి లాటరీ చూడబోతాడు. చివరికి ఇల్లాలు వాళ్ళందరిజాడా కనుక్కొని, ఒక్కచోటుకి "నోలుకొచ్చి" ఇంటికి తీసుకొచ్చేలోగా, పెద్దకొడుకు కుస్తీపట్ల ముచ్చట చూడబోయి అక్కడివాళ్ళతో తగవులాటలో పడతాడు. "చెంపలు వాయించినా చెయ్యెత్తని వాడివిగా" అంటూ, అక్కడి కుర్రాళ్ళు అతనిని లోకువకట్టి తంతారు. అటు జెస్సీ పియానో ఆర్గన్ కొనేస్తాడు.

తీరా ఆఆర్గన్ ఇంటికి వచ్చేసరికి ఇల్లాలు వల్లకాదు పొమ్మంటుంది. మన ఇంటా వంటా లేదు. ఈ వాయిద్యపుగోల అంటుంది. కులపతులకు తెలిస్తే వెలివేస్తారని భయపడుతుంది. చివరికి విసుగెత్తి ఈయింట నేనో, ఆ వాయిద్యమో ఉండాలి తేల్చుకో అంటుంది మొగుణ్ణి. అతడు సతిమాట జవదాటడు. ఆమె చెప్పేది సబబని తెలుసు. అయినా అతనికాన ఎదురుగా ఇంకో పెద్దమనిషి ఉన్నాడు. తిక్కరేగిన పెంకిపిల్లాడిలాగా మొండికెత్తి వాయిద్యాన్ని యింట్లో పెట్టించేస్తాడు. ఆవిడ అలిగి ఆరాత్రి గొడ్లసాలలో పడుకుంటుంది. కాని తెల్లారేసరికి 'అమ్మా నాన్నా' మామూలుగానే నేస్తంకట్టేశారు! వయసు మళ్ళిన ఈ దంపతుల ప్రణయాన్ని వైలర్ మనోహరంగా చిత్రించారు.

మరపురాని మరో సన్నివేశం, తలితండ్రులను బలవంతాన ఒప్పించి కొడుకు యుద్ధభూమికి బయలుదేరడం. కంటనీరు పెట్టుకొని గద్గదకంఠాలతో అతన్ని సాగనంపి ఏమిచాలో ఏంచేయాలో తోచక వృద్ధదంపతులు దిగాలుపడి నిల్చుంటారు. ఒక్కక్షణం అయేసరికి, ప్రియుడిని కలుసుకొని ముద్దిచ్చి వచ్చిన ముద్దరాలు వాళ్ళకుమార్తె తియ్యటి కలలు కంటూ తింటూ, ఏదోలోకంలో విహరిస్తూ తనకు ఇదేం పట్టదన్నట్టు ఆనందపరవశురాలై ఆగదిలోంచే మేడమీదకు వెళ్తుంది. అటు కొడుకును చేతులారా మృత్యుదేవత దగ్గరకు పంపామని ఏడుస్తున్న తలితండ్రులు ఆక్షణంలో, కట్టు తప్పుతున్నదనిపించే ఈ పిల్ల ప్రవర్తన, అన్నగురించి పట్టించుకోని ఆమె ఆనందనృత్యం చూడవలసి వస్తుంది. నవ్వాలో ఏడవాలో, తిట్టాలో తిమ్మాలో తెలీక, తేల్చుకోలేక, అప్రతిభులైపోయి విచిత్రంగా చూస్తారు ఆ గారాబు పట్టివేపు...

ఆ పాత్ర మీకు గుచ్చుకుంటుంది. వాళ్ళ కన్న ముందు మీరే నిట్టూరుస్తారు. 'జీవితం!' అంటుండా నిట్టూర్పు. అంతలోనే ఒక చిన్న మందహాసం మీ పెదిమెల కొనల మీద నిలచి నిష్క్రమిస్తుంది. క్షణంలో సగంలో చిరాకు, కరుణ, వాత్సల్యం, మనకే అనిపించే వేదన, మృదువుగా మీలో కలుగుతాయి. కదులుతాయి.

* * *

పండుగ చేసుకున్నంత తృప్తినీ సంతోషాన్ని కలిగించే చిన్న చిన్న సన్నివేశాలు ఎన్నో ఇందులో ఉన్నాయి. ఆ యింటి పెంకిపిల్లాడు—పదేళ్ళవాడు చేసే అల్లరి, చిలిపిచేష్టలూ ముద్దొస్తాయి. బాలనటులచేత ముదర 'డైలాగులు' అనిపించి, సంఘాన్ని, మనుషులను వీకబిగిన సంస్కరించి పారేయ్యాలని చూసే దర్శక నిర్మాతలు ఈ చిత్రంలో ఈ బాలనటుడి మాటలూ చేతలూ పాఠాలపుస్తకంగా వల్లెవేసి వాడుకోవచ్చు. కుర్రవాడు ఎక్కడైనా కుర్రవాడే. అమెరికన్ పల్లెటూరిపిల్లవాడైనా, "ఇండియన్ మాపెట్" అయినా వాడి తీరూ పోకలూ, ఆటపాటలూ సమానాంతరంగానే సాగుతాయి.

ఈ చిత్రం తప్పకుండా చూడవలసినది ఇందుకు మరోక అతి ముఖ్యమైన కారణం, తండ్రి పాత్రను గారీకూపర్ నిర్వహించడం. ఈ మనిషికిగాని, అతని నటనకుగాని, వ్యాఖ్యానాలూ, సిఫార్సులూ, విశేషణాలూ, అనవసరం...

తల్లిగా డరోతీమాక్‌గిరీ కూడా ఉత్తమమైన నటనను ప్రదర్శించింది.

యునైటెడ్ ఆర్టిస్ట్స పేరిట విలియం వైలర్ నిర్మించిన ఈ చిత్రాన్ని ఎం.జి.ఎం. వారు (మినర్వాలో) విడుదల చేశారు. ఇది డీలక్స కలర్, సినిమాస్కోప్ చిత్రం. ★

"ఎం. ఎల్. ఏ."

(51-వ పేజీ తరువాయి)

మాత్రం గీతారాయ్ (బాండు 'ఆహా ఊహలు' పాట తప్పిందికాదు. గులాబీకి ముళ్లలాగ, అన్ని శాఖలలోను వరస్థితి ఇలాగే ఉంటోంది. అక్కడ నూర్యకళ బొంబాయివాళ్ళ డాన్సు లాంటిది చేసింది. ఉన్నవాటిలో ఉత్తమోత్తమం అనతగ్గది ఘంటసాల, జానకి అనే కొత్తగాయని పాడిన జానపదపధాన సాగిన 'లాంబాడోళ్ల రామదాసా' అనేపాట చాలా రోజులు జ్ఞాపకం ఉంటుంది.

ఈ కొత్త గాయనికి, ఖుర్షీద్ అనే నర్తకికి కూడా తిలక్ యీ చిత్రంలో అవకాశం ఇచ్చి వినతగ్గ పాటనీ, కనతగ్గ నృత్యాన్నీ సమర్పించారు. ప్రజాదరణ పొందవలసిన చిత్రం ఇది. ★

డీసీకా

(49 వ పేజీ తరువాయి)

పుడు అడ్డురారు. ఇందులో ఎవరూ 'నటించ' లేదు.

అర్థరాత్రిమీద, ఒకేరకం అనిపించే, రెండిటిలా కనిపించే జీవిత రేఖమీద — ఎటు పడితే అటుపోయే ఎంగిలాకులమధ్య, పతితస్త్రీ (సిల్వానోమంగానో) నిలబడి ఒకే వేపు చూస్తూ అటూ ఇటూ అని ఆలోచించడం మొదలుపెట్టి మథన పడి మనసు మార్చుకున్న సన్నివేశాన్ని ఒక డిసీకావే అలా ఊహించగలడు; పావు నిముషంలో చిత్రించగలడు.

ఈ చిత్రం గతవారం మద్రాసు ఓడియన్‌లో మూడు రోజులు ఆడి, ఓడి, వెళ్ళిపోయింది. ★

వనితా వాణి

(42-వ పేజీ తరువాయి)

క్రిందిభాగం తీసి ఆ పిల్లలకే లంగామీది జాకెట్టుగానో, లేక చిన్నపిల్లలుంటే వారికి నిక్కరూట్సు, రాంపర్సుగానో వస్తే చక్కగా వుంటాయి. తీరిక వున్నవారు, కుట్టు వచ్చినవారు కొద్దిగా ఆలోచించితే పాతబట్టల్ని ఎన్నో విధాలుగా ఉపయోగించుకోవచ్చును. అందులో, కాలంగాని, దారంగాని వృథాకాదు.

బి. సరస్వతి (మాచర్ల)

* * *

న్యూఢిల్లీ లేఖ

(5-వ పేజీ తరువాయి)

మంత్రి ఉద్యోగంలో ఉండగానే మరణించారు. తరవాత ముఖ్యమంత్రికి, ఆరోగ్య మంత్రిణికి ఘర్షణ వచ్చింది. దీని ఫలితంగా స్పీకరు ముఖ్యమంత్రి అయ్యారు. ఆరోగ్య మంత్రిణి స్పీకరు అయింది. ముఖ్యమంత్రి సాధారణమంత్రిగా ఉండటానికి ఒప్పుకున్నారు. ఆ తరవాత కొంతకాలానికి మరో ఇద్దరు మంత్రులయ్యారు. ఇటీవల ఈ కొత్త మంత్రుల పదవులు పోయాయి. కాని శ్రేయోరాజ్యపు ఏర్పాట్ల ప్రకారం వీరు ముఖ్యమంత్రులకు సలహాదార్లుగా కుదురుకున్నారు. వీరికి అధికారం తగ్గింది గాని ఆదాయం తగ్గలేదు.

స్థానిక స్వపరిపాలన చరిత్రలో అద్వితీయమని చెప్పదగిన ఘట్టం ఒకటి రాబోతున్నది. ఢిల్లీ నగరానికి, పరిసర గ్రామాలకూ కలిపి ఒకే కార్పొరేషను ఏర్పాటు చేస్తారు. పూర్వపు రాష్ట్ర శాసన సభలో 50 మంది సభ్యులుంటే ఇందులో 80 మంది సభ్యులుంటారు. ఈ కార్పొరేషను న్యూఢిల్లీలో కనీసం ఒక భాగానికి వర్తించదు.


ప్రస్తుతం మితవాదులకు, అతివాదులకు ఘర్షణ జరుగుతోంది. ఢిల్లీ గ్రామాల్లో నివసించే అతివాదులు న్యూఢిల్లీ ప్రజలకు బ్రిటిష్ మార్కు ప్రజాస్వామ్యం లేదే అని విచారపడుతున్నారు. ఈ ప్రజాస్వామ్యం తమ కక్కర్లేదని న్యూఢిల్లీలో నివసిస్తున్న మితవాదులు పట్టుబడుతున్నారు. ఢిల్లీ కార్పొరేషనులో న్యూఢిల్లీని కూడా చేర్చాలని యమునానది అవతలి వైపున ఉన్న షాద్రా గ్రామవాసులు ఇటీవల తీర్మానం చేశారు.

వీరికి పోటీగా 'కన్నాట్ ప్లేస్' (న్యూఢిల్లీలోని వ్యాపారకేంద్రం) లోని వర్తకులు, ఇతరులు తమకు కార్పొరేషను అక్కర్లేదని తీర్మానం చేశారు. కాని ఎలాగైనా న్యూఢిల్లీ ప్రజలకు కార్పొరేషనును అంటగట్టాలని "ప్రజాస్వామిక" ప్రయత్నాలు జరుగుతున్నాయి. పార్లమెంటు సభ్యుడొకాయన చెప్పినది నిజమే అయితే, ఒక పెద్ద ప్రదర్శనఊరేగింపు లేవదీయాలని ఆలోచన జరుగుతోందట. ఈ ప్రదర్శనలో అనేకులు స్త్రీలుకూడా పాల్గొంటారట. ఈ ఊరేగింపు న్యూఢిల్లీలోని ప్రధాన వీధుల గుండా పోయి పార్లమెంటు భవనంవద్ద ఆగుతుందట. న్యూఢిల్లీని కార్పొరేషనులో చేర్చాలని బ్రహ్మాండమైన మహజరొకటి పార్లమెంటు సభ్యులద్వారా అందచేయబడుతుందట. అద్భుతమైన ఈ "ప్రజాస్వామ్య" ప్రదర్శనంచూసి ప్రభుత్వం హడలిపోయి కాళ్ళబేరానికి వస్తుందని ప్రదర్శన కార్యకర్తలు ఆశిస్తున్నారు. కాని ఒకటే చిక్కు. ఈ కార్యకర్తలకు ఈపాటికి పండిట్ పంత్ సంగతి బాగా తెలిసిఉండాలి. సర్దార్ పటేల్ లేనిలోటును పండిట్ పంత్ చక్కగా తీరుస్తున్నారు. భారత సంస్థానాలన్నిటినీ సర్దార్ పటేల్ ఏకీకరిస్తే, పండిట్ పంత్ భారత రాష్ట్రాలన్నిటినీ పునర్వ్యవస్థీకరించారు.

న్యూఢిల్లీని కార్పొరేషనులో ఎందుకు చేర్చగూడదో సహేతుకంగా పండిట్ పంత్ సెలెక్ట్ కమిటీ ప్రతిపాదన సమయంలోనే వివరించారు. మళ్ళీ ఆయన అభిప్రాయాలను మార్చుకోవలసినంత అగత్యం ఈలోగా ఏమి వచ్చింది?


ప్రదర్శనలో పాల్గొనేమూకను ఎవరైనా పోగుచేసుకురాగలరు. అదో లెక్క కాదు. గుండెలు బాదుకొని, హై హై అని అరవడమే ప్రజాస్వామ్య ప్రదర్శన లక్షణమైతే అలా చేసే శరణార్థులు న్యూఢిల్లీలో బోలెడు మంది ఉన్నారు. ఇలాగే కమ్యూనిస్టులు కూడా ఎంతమందినైనా ప్రదర్శనదారులను పోగుచేసి తీసుకురాగలరు. వీళ్ళని ఎలా పోగు చేస్తారో ప్రభుత్వానికి బాగా తెలుసు. ఆ ప్రదర్శనలకు ఒకప్పుడు మంచి విలువ ఉండేది. ఇప్పుడు వాటిని ఖాతరుచేసేవారు లేరు. ★

Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd., by S. Radha Krishna at The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras-1. Editor S. Sambhu Prasad



గృహ నిర్మాణం

ఫోటో: ఎమ్. శ్రీనివాసన్.


పాండ్స్ కోల్డ్ క్రీమ్‌ను
వాడే ఆమెను
అతను
మెచ్చుకొనును!
మీరు ముఖము కడుగుకున్న
తరువాత ఎల్లప్పుడూ అద్భుతమైన
పాండ్స్ కోల్డ్ క్రీమును వాడండి.
ఇది కడుగుకుపోతున్న. చర్మము
నకు రక్షణ యిచ్చే నూనెలను
తిరిగియిచ్చి మీ చర్మమును లేతగా
మరియు నిష్కళంకముగా ఉంచును.
పాండ్స్ కోల్డ్ క్రీమ్ సులభముగా
చర్మములోకి చొచ్చుకొనిపోయి మీ
ముఖమును శుభ్రముగా ఉంచును!
PONDS
POND'S
cold
cream
ఉచిత పుస్తకము
Lovelier with Pond's అనే సౌందర్య
మును గురించిన మా యింగ్లీషు పుస్తకము
కావాలి యీ ఎడసుకు వ్రాయండి:
పి. ఓ. బాక్స్ నెం.1612, డిపార్టు
మెంట్ నెం. 30 వి. బొంబాయి-1.
చీస్‌బ్రో-పాండ్స్ ఇన్‌కార్పొరేటెడ్
(పరిమితమైన బాధ్యతతో యు. ఎస్.
అమెరికాలో సంస్థాపితము.)
P.4480(A)